
ఆంధ్రపత్రిక


సచిత్ర వారపత్రిక




14-8-'57

25 నయాపైసలు

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



మోహన్‌దాస్ కరంచంద్ గాంధి



ఆగస్టు 9 విడుదల!
SARVANI PICTURES MADRAS-28
శర్వాణి వారి
అక్కచెల్లెళ్ళు
RAMDAS
దర్శకత్వం... సార్వభౌమ & అమానుల్లా
డిస్ట్రిబ్యూటర్లు : ఆంధ్ర, సీడెడ్

సంవత్సర చందా
రు. 18—0—0
విడిపత్రిక 25 న.పై

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder: K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 50
14-8-57

హేవిళంబి శ్రావణం, బహుళ చతుర్థి, బుధవారం

★ విషయానుక్రమణిక ★

చల్లనైన, తెల్లని

బ్రిల్‌క్రీమ్ BRYLCREEM

బ్రిల్‌క్రీమ్ వాడి మీ కేశములను ఎక్కువ నిగనిగలాడుచు నలుపుగా ఉంచుకొనండి

★ బ్రిల్‌క్రీమ్‌లోనున్న పరిశుభ్రమైన పేరుపున్న నూనెలు మీ కేశముల సహజ నల్లదనమును, తళతళ మెరుపు కనపడేలాగ చేయును.

★ శుభ్రమైన, తెల్లని బ్రిల్‌క్రీమును ప్రతిరోజూ మీ శిరస్సునకు వాడండి. ఇది చుండ్రు రాకుండా మీ కేశములను శుభ్రముగ మరియు ఆరోగ్యకరముగా నుంచును.

★ బ్రిల్‌క్రీమ్ కొద్దిగా రాచుకుంటేనే చాలును! అందువలన పొదుపు చేకూరును. నేడే ఒక సీసాను కొని మీకు మీరే నిర్ధారణ పరచుకొండి.

కీత్ మిల్లర్—ఈ ప్రఖ్యాతి గాంచిన ఆస్ట్రేలియా టెస్ట్ క్రికెటర్, నీటైన మరియు ఆరోగ్యమైన కేశములకు ఆదర్శ కేశశృంగార సాధనమగు బ్రిల్‌క్రీమ్ వాడును






చాలా ఉన్నతి పొందిన వారు వాడేది

బ్రిల్‌క్రీమ్

గ్లాక్సో లేబొరేటరీస్ (ఇండియా) ప్రైవేటు లిమిటెడ్.



జూలై 21 న మద్రాసులో విజయవారి "మాయా బజారు" చిత్రం రజతోత్సవాలు జరుపుకున్న సందర్భంలో గుంటూరు 'న్యూసిటీ టాకీస్" అధిపతి సి బి సయ్యద్ స్థానికంగా సభజరిపి విందుచేశారు.

'మాయాబజార్' శతదినోత్సవాలు

విజయా ('పెళ్ళిచేసిచూడు', 'మిస్సమ్మ') ప్రొడక్షన్స్ వారు శ్రీ కె వి రెడ్డి దర్శకత్వాన నిర్మించిన "మాయాబజార్" తెలుగు తమిళ చిత్రాల శతదినోత్సవాలు జూలై 21 న చందమామ భవనం ఆవరణలో జరిగాయి సభకు జెమినీ అధిపతి శ్రీ ఎస్ ఎస్ వాసన్ అధ్యక్షత వహించారు ఎ వి ఎం అధిపతి శ్రీ ఎ వి మెయ్యప్పన్ ఈ చిత్రాలలో పాల్గొన్న తెలుగు తమిళ నటీనటులకూ, టెక్నిషియన్‌లకూ, వీటిని విడుదలచేసిన సంస్థలకూ, ఆయా థియేటర్ల యజమానులకూ రజత ఫలకాలిచ్చి గౌరవించారు

'విజయా'ధిపతి శ్రీ నాగిరెడ్డిమాట్లాడుతూ ఈ చిత్రం విజయవంతం కావడానికి ఈ సంస్థలో పనిచేస్తున్నవారంతా సంపూర్ణంగా సహకరిస్తూ కృషిచేయడమే కారణమని అన్నారు

"ఇందులో పనిచేస్తూన్నవారే నా ఆస్తి, వారిదే ఈ బలం" అన్నారు నాగిరెడ్డి

అనంతరం, విజయా ప్రొడక్షన్స్ సంస్థలో పనిచేసే ఉద్యోగులకు నాలుగునెలల జీతం బోనసుగా ఇస్తున్నట్లు మేనేజరు శ్రీ ఎన్ సి సుబ్రహ్మణ్యం ప్రకటించారు ఈ చిత్రం శతదినోత్సవాలు జరుపుకున్న థియేటర్లలో సిబ్బందికి ఒకనెల జీతం బోనసు ఇస్తూన్నట్లు కూడా ప్రకటించారు

అనంతరం నటీనటులు కృతజ్ఞత తెలుపుతూ మాట్లాడారు

మాయాబజార్ తెలుగు చిత్రంలో నాగేశ్వరరావు, రామారావు, రేలంగి, రంగారావు, గుమ్మడి, ముక్కామల, సి ఎస్ ఆర్ ఆర్ నాగేశ్వరరావు, నాగభూషణం, మిక్కిలినేని, వంగర, రమణారెడ్డి, నల్ల రామ్మూర్తి, రామలింగయ్య, బాలకృష్ణ, కుటుంబరావు సర్యం, సావిత్రి, సూర్యకాంతం, ఋష్యేంద్రమణి, ఛాయాదేవి పాల్గొన్నారు.

రచయిత పింగళి నాగేంద్రరావు.

తమిళ చిత్రంలో జెమినీ గణేశన్, రంగారావు, తంగవేలు, నంబియార్, ప్రభృతులు పాల్గొన్నారు రచయిత తంజై రామయ్య దాస్

దర్శకుడు కె వి రెడ్డి ఛాయాగ్రహణం మార్కస్ బార్ట్లే, శబ్దగ్రహణం ఎన్ కృష్ణన్ సంగీతజోస్యుల శివరాం, కళాదర్శకులు మాధవపెద్ది గోఖలే, కళాధర్, నృత్యదర్శకుడు పసుమర్తి కృష్ణమూర్తి, ఎడిటింగ్ జంబులింగం, అలంకరణ పీతాంబరం, చిత్రరచన కె ఎస్ ఎస్ మూర్తి ★

వైటోడెంట్
దంతక్రిములను సంహరించే పండ్లపొడి
ప్రవళ్ళ కెమికల్స్ & డ్రగ్స్ లిమిటెడ్ మదరాసు-30.

అంటార్కిటికాలోని అమూల్య జీవకోటి

(31-వ పేజీ తరువాయి)

చేస్తాయి.

వెడెల్ సీల్స్

వెడెల్ సీల్స్ అనేరకం జంతువులకు కొన్ని అపూర్వలక్షణాలున్నాయి. ఇవి మంచు అడుగున శీతకాలపు రాత్రిళ్ళు కటిక చీకటిలోనైనా దారికనుక్కొని ప్రయాణం చేయగలవు. ఎలా తెలుస్తుందో వాటికి, ఎక్కడెక్కడ చేపలగుంపు లుంటాయో అక్కడక్కడికి సూటిగాపోయి మింగేస్తాయి. మంచు అట్టడుగున తిరుగుతూ, ప్రతి 15 నిమిషాలకీ సరిగ్గా ఎక్కడ రంధ్రాలు ఉన్నాయో అక్కడికిపోయి గాలిపీల్చుకుని మళ్లీ తమ దారిన తాము పోతూవుంటాయి. ఎక్కడ రంధ్రా లున్నదీ అవి ఒకసారి చూసి గుర్తుపెట్టుకుంటాయని కాదు. మనం ఒకచోట మంచులో పెద్ద రంధ్రంచేస్తే కాసేపటికల్లా అక్కడొక సీల్ మంచు అడుగునించి తయారవుతుంది.

గబ్బిలాలు రాత్రిళ్ళు ప్రతిధ్వనినిబట్టి దారి కనుక్కొంటాయి. ఈ సిద్ధాంతం జలాంతర్గాములను కనిపెట్టి భగ్నంచేయడానికి యుద్ధాల్లో ఉపయోగపడుతోంది. అదేవిధంగా సీల్స్ మంచుఅడుగున చీకట్లో దారి ఎలా కనుక్కొంటాయో తెలిస్తే ఆ సిద్ధాంతం మనకు శాంతికాలంలోనూ, యుద్ధకాలంలోనూ కూడా ఉపయోగపడవచ్చు.

అంటార్కిటిక్ సముద్రంలోని అనంతమైన జీవకోటివలన అనేక అమూల్య పరిశోధనలు జరగడానికి వీలున్నది. ఆ సముద్రంలో కొన్నిచోట్ల లోతు రాత్రి ఒక రకంగాను, పగలు ఒక రకంగాను ఉంటున్నట్లు అమెరికన్ నావికులు కనుక్కొన్నారు. పగలు 1800 అడుగులు లోతుఉంటోంది. రాత్రి నేలమట్టం పైకి వచ్చేస్తోంది. ఈ మట్టం సమంగానే ఉందిగాని మిట్టపల్లాలుగా లేదు. దీన్నిబట్టి అక్కడ చేపలు, పురుగులు, మొక్కలు దట్టంగా కట్టకట్టుకుపోయి ఉండవచ్చునని, ఆ చేపలు, పురుగులు వగైరా ప్రాణికోటి పగటిపూట సూర్యరశ్మికి జడిసి లోతుకుపోయి, రాత్రిళ్ళు పైకి వస్తుందని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

అక్కడ జీవశాస్త్ర పరిశోధనలు చేయడానికి చాలా అవకాశా లున్నాయి. బహుశా కొత్త రకాల ఔషధాలు, ఆహారం లభించవచ్చు. వివిధ శాస్త్రాలలో పరిశోధనలకు, ప్రయోగాలకు అంటార్కిటికా ప్రకృతి సిద్ధమైన పరిశోధనాలయం లాంటిది.

★

విక్రమార్కుడి మార్కు సింహాసనం

(12-వ పేజీ తరువాయి)

ఆపేశానని నిరుత్సాహంగా ఉందా?"

"మీ రింకా మొదలెట్టలేదుగా" అనుకుంటూ, "ఔను మరి" అంటూ నవ్వాడు రాజు.

రైలాగింది. రాజు మరచెంబు పట్టుకు వెళ్లాడు కాఫీకోసం.

బీదలకు అంబలిదానము చేస్తున్నవాడి తరహాలో అక్కడి హోటేలువాళ్లు చాలా రివిగా చిరాగ్గా. సరుకు లమ్ముతున్నారు.

తను తిని, గురూజీకి ఫలహారం కటించే వరకు రైలు కూతకూసింది. ఉరకలూ పరుగులుగావచ్చి పెట్టెలో కెక్కిపోయాడురాజు.

నరసన్న లేడు.!

ఏడీ! నరసన్న! అని ఆశ్చర్యపడ్డాడు. రాజు.

"అన్నా నరసన్నా లేవా ఇకలేవా"అనే పాట పాడబోయి, ఈలోగా వచ్చేస్తాడేమోనని ఓ క్షణం తటపటాయించాడు రాజు.

"మీ బాబాయిగారు అర్జెంటుగా రైలు దిగి వెళ్ళారండి ఎవరో ఫ్రెండు కనబడితేను" అన్నాడు అసింటా కూచున్న రైల్వే బైరాగి లాలనగా నవ్వుతూ.

"మా బాబా యెవడు? మధ్య నువ్వెడు? అంటూనే అప్రయత్నంగా వంగి బల్లకిందకి తొంగి, చూచాడురాజు.

పెట్టె గల్లంతు!

"హారినీ!" అన్నాడు రాజు హడావుడిగా.

"ఆయన మీ బాబాయికాదా? నేఅనుకున్నాలెండి. ఆ హడావుడి చూసి. పాపం మీ పెట్టె తీసుకుపోయి ఆయింది వదిలేశాడు కాబోలు. ఆ పక్కకి చూడండి" అన్నాడు బైరాగి.

దానికి తాళం గీళం లేవు. రాజు ఆ పెట్టె తెరిచాడు.

సుమారు రెండువీశల న్యూస్ పేపర్లూ, రెండు మూడు కాళీసీసాలూ అందులో ఉన్నాయి.

రాజుకి నోట మాటరాలేదు. 'కథన్నా పూర్తిచెప్పివెళ్ళాడు నరసన్నా' అన్నాడు మెల్లిగా.

'ఆయన చెబుతున్న కథ ఏమిటండి?' అన్నాడు రైల్వే బైరాగి.

"టోకరాసురోపాఖ్యానంట." అంది రాజునోరు; నీకెందుకు అన్నాయి. అతని నొసలు.

"అదే ఇది" అన్నాడు బైరాగి బీడీ ముట్టిస్తూ

★

ఇంకా వుంది.

కొత్తరకం తెలుగు టైప్‌రైటర్

(5-వ పేజీ తరువాయి)

త్రం, తత్సంబంధమైన ఇతర యంత్ర సాధనాల విషయంలో ఇంకా పరిశోధన సాగిస్తూనే ఉన్నాడు.

తెలుగుముద్రణ విషయంలోకూడా పరిశోధన జరుపుతున్నాడు. చేతితో అక్షరాలు కంపోజుచేసే ముద్రణాలయాలలో ఉండే తెలుగు అక్షరాల కేసులకు మామూలుగా దాదాపు 700 ముద్రలుంటాయి. వాటిని 300 కు తగ్గించవచ్చునని శ్రీ రావు సూచించాడు. మోనో టైపు కాస్టింగ్ విధానంలో కూడా కొన్ని మార్పులను సూచిస్తున్నాడు. వీటివల్ల అనేక భారతీయ భాషల ముద్రణ విషయంలో ప్రగతిని సాధించగల అవకాశం కలుగుతుంది.

రాజమహేంద్రవరంలో శ్రీ పిఠాపురం కుమారరాజాగారు ఏర్పరచిన టైపురైటింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థిగా చేరిన నాటినుంచే శ్రీ రామచంద్రరావుకు వీటిపట్ల ఆసక్తి కలిగింది. ప్రస్తుతం వాడుకలో ఉన్న తెలుగు టైపు మిషన్ కీబోర్డును కనిపెట్టి, తయారుచేయించింది శ్రీ పిఠాపురం కుమారరాజాగారే.

1940 సంవత్సరంలో తెలుగు టైపు హైయ్యరు పరీక్షలకు కూర్చొన్న మొదటి జట్టు విద్యార్థులలో శ్రీ రామచంద్రరావు ఒకడు. ఆసందర్భంలో రాజమండ్రి ట్వైన్ ఆర్ట్స్ అసోసియేషన్ వారు శ్రీ రావు టైపులో సాధించిన వేగానికి ప్రశంసా చిహ్నంగా ప్రథమబహుమానం ఇచ్చారు.

రాజమండ్రిలో విద్యార్థిగా ఉన్నప్పటినుంచి కూడా శ్రీ రామచంద్రరావు ప్రస్తుతం వాడుకలో ఉన్న టైపు యంత్రంలో గల లోపాలను గురించి, చేయదగు మార్పులనుగురించి సదా ఆలోచిస్తూనే ఉన్నాడు. శ్రీ రావు మద్రాసు ఆలిండియా రేడియో కార్యాలయంలో తెలుగు టైపిస్టుగా మొట్టమొదటగా చేరాడు. ఆతరువాత అమెరికా సమాచార కార్యాలయంలో ఉద్యోగంలో చేరి పనిచేస్తున్నాడు. అప్పటినుంచి తన తీరికసమయాలలో ఈ పరిశోధనకృషి సాగిస్తున్నాడు. అమెరికా సమాచార కార్యాలయంలో ఉద్యోగం చేసుకుంటూనే, ఈ పరిశోధన చేస్తూనే ప్రయివేటుగా పరీక్షకు కూర్చుని శ్రీ రావు బి. ఏ. డిగ్రీ సంపాదించారు. శ్రీ రావులో గల అసాధారణ మేధాశక్తులకు ఇది మరొక నిదర్శనం.

★


Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at the Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad

గత రెండు శతాబ్దాలలో

ప్రతిఘటించని సందర్భమే లేదు!

బ్రిటిషు ఈస్టిండియా కంపెనీ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రబలిన అసంతృప్తి ఫలితంగా నేటికి సరిగా వందసంవత్సరాల క్రితం భారతదేశంలో ఒక మహోద్యమం బయలుదేరింది. ఆ ఉద్యమాన్ని ఏ పేరుతో పిలిచినప్పటికీ, అది పూర్తిగా యాదృచ్ఛికమని చెప్పడానికి వీలులేదు. భారతప్రజలెప్పుడూ కూడా ఈస్టిండియా కంపెనీవారి పాలనను ప్రోత్సహించలేదు.

ఈస్టిండియా కంపెనీవారు పైకి కనిపించకుండానే లోలోపల కలహాలు పెడుతూ, తమ పాలనను క్రమంగా విస్తరింపచేసుకుంటూ వచ్చారు. వాటి దుష్ఫలితాలను గుర్తించడానికి భారతప్రజలకెంతో కాలం పట్టలేదు. ఫలితమేమిటంటే, ఒకవైపు ఈస్టిండియా కంపెనీవారు తమ పరిపాలనను విస్తరింపచేసుకుంటూ ఉండగా, మరొకవైపున వారి పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు చెలరేగినవి. 1757-1857 సంవత్సరాల మధ్య ఈ కంపెనీవారి పరిపాలనను దేశంలో ఎక్కడో అక్కడ భారతీయులు ప్రతిఘటించని సందర్భం లేనేలేదు. అందుకు కారణాలు ఎన్నోవున్నాయి. దేశంలో వ్యాపారమంతా ఈస్టిండియాకంపెనీవారి హస్తగతమైపోయింది. స్థానిక వ్యాపారులను బ్రిటిషువారు తమ ఏజెంట్లుగా మార్చివేశారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో వివిధ చట్టాలను చేసి, వారికి వారసత్వంగా సంక్రమించిన ఆస్తులను కాజేసేవారు. భూమిశిస్తు చెల్లించని చిన్న నేరానికే భూమినంతనూ వేలం వేసే అధికారానికి చట్టాలు చేశారు. కొత్త కొత్త శాసనాలు, ఎక్కువ ఖర్చుతోనూ, కాలవిలంబనంతోనూ కూడిన న్యాయస్థానాలూ ఏర్పడినందున భారత ప్రజలు ఎంతో నష్టపడ్డారు. వారికి న్యాయం లభించడమే దుస్సాధ్యమైపోయేది. ఈ కంపెనీ విధించిన పన్నులను, ప్రజలను బాధించి వసూలుచేసేవారు. విపరీతమైన మత ప్రచార కార్యక్రమాలలో క్రైస్తవ మిషనరీలు కూడా భారత ప్రజలను బాధించేవారు. సహగమన నిషేధం, మతం మార్చుకున్నా ఆస్తులపై హక్కును కల్పించడం— ఈ మొదలైన కొత్త కొత్త చట్టాలు, పందికొవ్వు పూసిన తుపాకి తూటాలను ప్రవేశపెట్టి సిపాయిలు వాటిని వాడాలనడం—ఇవి అన్నీ చూడగా భారతదేశాన్ని క్రైస్తవదేశంగా మార్చడానికి ఈస్టిండియా కంపెనీ ప్రయత్నం చేస్తున్నదని ప్రజలు గ్రహించారు.



రాష్ట్రపతి

ఇంతేకాదు; ఈస్టిండియా కంపెనీవారు ఒక ప్రాంతం తరువాత మరొక ప్రాంతాన్ని కబళిస్తూ భారత సంస్థానాల నాశనానికి కారణభూతులవడం, తమకు చిక్కిందల్లా రాబట్టుకుంటూ ఉండడం, దేశంలో ఉన్నత స్థాయిలోవున్న కుటీర, లఘు పరిశ్రమలను నాశనం చేసి, ధనికులనూ, పేదలనూకూడా దెబ్బకొట్టడం, — ఈ దుశ్చేష్టల వల్ల దేశవ్యాప్తంగా అసంతృప్తి ప్రబలింది. కంపెనీ పాలననుఅంతమొందర్చాలనిఅధిక సంఖ్యాక భారతీయులు నిశ్చయించుకున్నారు. అయితే, వారిలో కొంతమంది కేవలం ప్రయోజనాల నిమిత్తమే ఈ పనికి పూనుకొని ఉండవచ్చును. ఏమాత్రం వేచి ఉన్నా ఈస్టిండియా కంపెనీ ఇంకా బలిష్ఠమైపోగలదని, ఇక అప్పుడు వారిని ఎదిరించడం సాధ్యపడకపోవచ్చునని కూడా వారు తెలుసుకున్నారు.


ఈస్టిండియా కంపెనీవారి పాలనను పడగొట్టడానికి, లేదా కనీసం వారిపాలన విస్తృతం కాకుండా ఆపుచేయడానికి 18 వ

మత, కులవిభేదాలకు దానిలో తావేలేదు పోరాటం ప్రారంభమవడంతో తమ అందరి లక్ష్యము ఒక్కటే అని అందరూ గుర్తించారు చారిత్రాత్మకమైన ఆసమరంలో ఒకరి నొకరు రక్షించుకుంటూ, తమ ప్రయోజనాలను ఉమ్మడిగా కాపాడుకోవాలన్న భావం ఆ యోధు లందరిలోనూ కలిగింది ఇది మనం విస్మరించరాని విషయం

ఆనాటి సంఘటనలను మనం ఇప్పుడు నిష్పాక్షికంగానూ, వాస్తవికదృక్పథంతోనూ సింహావలోకనంచేసి చూస్తే నాటి అసంతృప్తికి దోహదం చేసిన కారణాలన్నీ, పూర్తిగా చెడ్డవనీ అవాంఛనీయమైనవనీ అనడానికి వీలులేకపోవచ్చు ఆనాటి సంఘటనలు ఏవిధంగా నాటి భారతీయులలో బ్రిటిషు వ్యతిరేకతను రేకెత్తించాయన్నదే ప్రస్తుత పరిశీలనాంశం స్వాతంత్ర్యసాధనకూ స్వాతంత్ర్య సంరక్షణకూ ఆత్మత్యాగానికి కూడా సిద్ధపడాలని ఆ ఉద్యమం గుణపాఠం చెబుతోంది

వంద సంవత్సరాల క్రితమే ఉద్యమాన్ని ప్రారంభించి, అనేక త్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని మనం సంరక్షించుకుంటూ పురోగమించగలమని నా విశ్వాసం

—రాజెన్ బాబు]



కొత్తగవర్నర్ శ్రీ సచార్

ప్రతిఘటించని సందర్భమేలేదు'

శతాబ్దపు ఉత్తరార్థంలోనూ, 19 వ శతాబ్దపు ప్రథమపాదంలోనూ దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉద్యమాలు బయలుదేరాయి 1857 నాటి ప్రతిఘటనోద్యమం ఎంతో పటిష్టమైనదనీ, అది ఒక ప్రాంతంనుంచి మరొక ప్రాంతానికి విస్తరించిందనీ అనడం చారిత్రక సత్యమే అంతకు పూర్వం ఇంత సమర్థంగా ప్రతిఘటన జరగలేదు అందువల్ల, గ్రంథకర్తలుగాని చరిత్రకారులు గానీ ఆ ఉద్యమాన్ని జాతీయ స్వాతంత్ర్య సమరంగా వర్ణించారంటే అందులో ఆశ్చర్యం ఏమీ లేదు

మొదట్లో మీరట్‌లో ప్రారంభమై ఆ తరువాత ఇప్పటి ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలకూ, పంజాబుకూ విస్తరించిన ఈ ఉద్యమాన్ని గురించి ఇప్పుడు సమగ్రంగా వివరించనక్కరలేదు దీనికి కారణం కంపెనీవారి దుష్కృత్యాలవల్ల కలిగిన అసంతృప్తి, ప్రజల దేశభక్తి అనే చెప్పాలి ప్రజల ఆచారవ్యవహారాలనూ, మతసంప్రదాయాలనూ, మార్చి వేయబోవడంవల్ల కూడా చాలామంది ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు

1857–59 ఉద్యమం విదేశీ పాలనను ప్రజలు ప్రతిఘటించడంవల్లనే కాకుండా కొత్త నాయకులను సృష్టించడంవల్ల కూడా దానికి ప్రాముఖ్యం కలుగుతోంది ఆవిధంగా స్వాతంత్ర్యయోధులుగా బ్రిటిషువారితో పోరుసల్పినవారిలో తాంతియా తోపే అహమద్ ఉల్లా కువ్వరసింగ్ ఝాన్సీరాణి లక్ష్మీబాయి ముఖ్యులు

1857–59 ఉద్యమం సాధించిన మంచి ఫలితం మరొకటి ఉంది ఆ ఉద్యమం హిందూ, ముస్లిం ఐక్యతను నిరూపించింది



కీ॥ శే॥ దేవదాస్‌గాంధీ



కాశీహైమవతీ.. శివరాత్రినయని..

ఉషశ్రీ పురాణపండ

"శ్రీవక్షోజకురంగనాభ మెదపై జెన్నొంద...

అబ్బబ్బ! ఎన్నిసార్లు చదివినా రావటం లేదండీ; మరీ మొట్టమొదాటగానే యింతింత పెద్ద పద్యాలు చదివేస్తే మరీ పుస్తకాలన్నీ అయిపోతాయనుకోండీ, అప్పుడేమిటి చదవటం? మా ఊళ్ళోనేం సుబ్రహ్మణ్యశాస్త్రిగారని ఓ గొప్ప శాస్త్రులుగారుండేవారుట. ఆయనకేం చిన్నప్పుడసలు చదువొచ్చేది కాదుట. వాళ్ళ నాన్నగారేమో ముక్కోపి. మీకూ ఉండేదిట కాదూ కోపం ... పెళ్ళయాక పోయిందేం? ఎంచక్కా కోపం లేకపోతేనే బావుంటుంది. మా పెదనాన్నకేం చిన్నప్పట్నుంచీ కోపమేట. ఇప్పటికి డెబ్భై దాటాయా? అయినా ఆయన కోపం పెరుగులా తోడుకుంటూన్నదే కాని వెన్నలా కరగటం లేదు.

మొట్టమొదట గృహప్రవేశానికొచ్చాం చూశారా...అప్పుడు మిమ్మల్ని గురించి విని ఎంత భయపడిపోయానో, నా మీద కూడా అంతకోపం పడతారేమోనని. మీరు నా మీద ఎప్పుడూ కోప్పడరు కాదూ! నేను మీకంటె చిన్నదాన్ని కాదూ? నా మీద కోప్పడకుండా ఏదన్నా తప్పుచేస్తే, నెమ్మదిగా-ఎవరూ లేనప్పుడు పిలిచి చెప్తూంటారు కదూ? నలుగురిలోనూ ఏదన్నా అంటే, నాకు అభిమానం వెయ్యదూ? అయినా అసలు మీకు నామీద ఎప్పుడూ కోపంరాదుగా. నామీద ఎవరికీ కోపం కలగదు. నేనెప్పుడూ జాగ్రత్తగానే ఉంటాను.

ఆ రోజునేం, ముందుగా నాకేం తెలీదు. నిజం...ఎంతొట్టుపెడితే అంతొట్టు. మా వాళ్ళూ చెప్పలేదు పెళ్ళిచూపులకొస్తున్నట్టు. అందుకనే నేనేం యిరుగుపొరుగువాళ్ళ నగలన్నీ దిగేసుకొని సిల్కుచీర కట్టుకోలేదు. మామూలుగానే మధ్యాహ్నం కాఫీలయాక చెల్లాయిలు రుక్మిణీకళ్యాణం పాడుతూంటే వింటూ కూర్చొని, కాస్త చల్లబడ్డాక నూతి దగ్గరకు వెళ్ళి మొహం కడుక్కొని చెంపలు దువ్వుకుని బొట్టు పెట్టుకుంటుండగా మీరంతా వచ్చారు.

వాళ్లోకి మగాళ్ళుంటే మేమెవళ్ళం అటు రానేరాం. మా చిన్నచెల్లి అయినాసరే ...మా రారగరా ఏమిటీ...ఉత్తినే నేను చెప్పటంకానీ...మీరు పలకరించేవరకూ మా పెద్దచెల్లి కూడా మీతో మాట్లాడిందా?

ఆరోజున మీరొచ్చారా, ఎవరో స్నేహితులనుకున్నాను. బొట్టెట్టుకొని దొడ్లో మల్లిపందిరి వార చాప వేసుకుని కాస్సేపు హార్మనీ వాయించుకుందామని వెడుతున్నాను. వాకిట్లో మీరంతా ఏదో మాట్లాడుతున్నారు. ఒక్కసారి అటొచ్చి చూద్దామనిపించింది.

శ్రీమతి సల్లాపం

నాకుకూడా తోచకపోలేదు. అప్పటి కయిదారు నెలలనుంచీ నా పెళ్ళి ప్రయత్నాలు సాగుతున్నాయి. అంచేత ఎవరన్నా చూసుకోనేందుకు వచ్చారేమో అనుకున్నా. అయినా నాన్న చెప్పందే అటు రావచ్చునా అనిపించింది. అక్కడికీ ఓసారి తలుపు సందులోంచి చూశా. సరిగ్గా అదే సమయానికి మీరూ అటు చూశారు. నాగుండె ఝల్లుమంది. తలుచుకుంటే యిప్పటికీ పులకలెత్తుతుంది!

గుండెలమీద చేతులుంచుకుని వెళ్ళిపోయాను. మీరింకా అటే చూస్తూ ఉంటారని నాకు తెలుసు. కానీ పెళ్ళికాని పిల్లని. మరి...అలా తలుపు సందుల్లోంచి చూస్తే ఏం బావుంటుందీ...

ఇంతట్లోకీ వదిన పిల్చి, నా చేతికి రెండు కాఫీ గ్లాసులిచ్చి, తనో రెండు తీసికొని వచ్చింది. వదిన వెనకాలే పిల్లిలా అడుగుల్లో అడుగులు వేసుకుంటూ వచ్చాను. తలపైకెత్తానా? గుండె దడదడలాడిపోయింది. నిజంగా పెళ్ళిచూపులకే అని తెలిస్తే ఆ పాటికూడా నడవలేనేమో అనిపించింది. ఎలాగో గ్లాసు మీముందూ, మీ ప్రక్కనున్న మీ మేనమామగారి ముందూ నా చేతినే పెట్టించారు.

అప్పుడొక్కసారి కోరగా చూశాను.

అంతలోనే సిగ్గూ, సిగ్గుతో భయం.


అదేమిటో నేను మొదట్నుంచీ అంతే. ఇప్పుడయినా సరే నేను మా యింటికెళ్ళి ఓ వారంరోజులుండి వస్తానా? మళ్ళీకొత్తగా ఉంటుంది మీతో మాట్లాట్టానికి.

ఎంత సిగ్గేసి పోయిందో ఆ క్షణంలో...

మీరు గమ్మని నా చెయ్యి పట్టుకుంటారేమో...

ఏమిటో నా పిచ్చిగానీ ఎంత యిదయినా అలా పట్టుకుంటారా?

నేను గ్లాసు అలా ఉంచి చక్రకోయిలా గిర్రున తిరిగి జువ్వలా దూసుకు గదిలోకి పోవాలనుకున్నాను.



మద్రాసు టి. యు. సి. ఎస్. బ్రాంచిలన్నింటిలోను ఇప్పుడు లభించును.

కాళీ హైమవతీ శివా త్రిసయినీ...

అప్పటికే మీరు కూర్చున్న చోటు కెదురుగా ఉన్న గదిలో రగు పరచి హార్మనీ సిద్ధం చేసినట్టు నాకు తెలిసే తెలీదు.

నెమ్మదిగా వదిన వెనకాలే నడుస్తున్నాను.

వదిన నన్ను హార్మనీ ముందుకు నడిపించింది.

నాకేం అర్థం కాలేదు; కొంత కాక పోనూ లేదు.

బుజాలట్టుకు కూర్చోబెట్టింది.

'ఓ పాట పాడమ్మా. వింటారు.' అన్నాడు మా నాన్న.

నా అనుమానమే నిజమై పోయింది. అయినా అంతనమ్మకం కలగలేదు. అంటే, అంత నాకు తెలీకుండా జరుగుతుందా అని. తరవాత తెలిసింది లెండి, మీరు అలా అయితే కాని రానన్నారని. నేను కనక సరిపోయింది కానీ, మరో పెంకిపిల్ల అయితే ఏమయేది?.........

ఔను కానీ యింకో రెండు తమలపాకులు చిలకలు చుట్టిస్తానుండండి.

మీకు కోపంగా ఉందా? నేను పుస్తకం చదవటం లేదనీ. చదువుతాలెండి. ఇదిగో మరీ... ఈ రెండు ఆకులూ మీకిచ్చేశాక...

ఏం...ఏదీ ఒక్కసారి యెక్కిరిపించరూ? ...పండిందో లేదో చూస్తాను. ఒక్కసారి ఎక్కిరిపిస్తారుట.

పోనీ ముందు నేనూ...

అబ్బే, నా నాలికా పండలేదు. ఇంకో రెండాకులికి సున్నంరాసి ఇస్తానేం. నేను కూడా వేసుకోవద్దూ మరి...

మరింక మీరు మా చెల్లిని చీటికి మాటికీ వేళాకోళం చెయ్యొద్దండి. ఈడొచ్చిన పిల్ల కాదూ? మరీ అంత మూగనోము పట్టకండి. అది మరీ బాధపడుతుంది.

వెనకటిసారి—జ్ఞాపకం ఉందా? రాత్రి వచ్చి ప్రొద్దుటే వెళ్ళిపోయారు. అప్పుడేమో దానికెంత కోపం వచ్చింది! కోపం కాదు-అన్నట్టు మరిచిపోయాను. మా చిన్న చెల్లి మొన్న ఆదివారంనాడు కొబ్బరాకుల చాపమీద కూర్చుంది తెలుసా? ఔనుకానీ మరీ రామాయణంలోనూ సీతారాముల కథే కాదూ ఉంటుంది.

అయితే సీత రాముడి పెళ్ళాం కదా! సీతాదేవికి శాంత అనే ఆడపడుచుందంటారేమిటండీ? దశరథుడి కసలు ఆడ పిల్లలు లేనిదే, ఈ ఆడపడుచు ఎలా వచ్చిందో?

మరయితేనూ పార్వతీదేవి పెళ్ళికూడా రామాయణంలోనే ఉంటుందా? భారతంలో ఉంటుందా? మీరు రుక్మిణీ కళ్యాణం చదివారా? మీరెప్పుడూ అంతే. నేనే మాటన్నా మీకు హాస్యంగా ఉంటుంది! నాకు తెలీకడుగుతాను కానీ—అదేనండీ, తెలీక కాకపోతే, తెలిసి అడుగుతారా ఏమిటీ?- అదిగో మీకు చికాగ్గా ఉన్నట్టుంది.

పోనీ మనం మా ఊరెప్పుడు వెడదాం చెప్పండి. ఇప్పుడు-అంటే-రేప్పొద్దున మనం వెళ్ళిపోతామా! వెళ్ళాక పది రోజులేమో మనింటి దగ్గరుందాం. అక్కడనుంచి మీ అక్కయ్యగారింటిదగ్గర సరిగ్గా నాలుగు రోజులంటే నాలుగు రోజులుందాం. అయిందా?... మరీ... యింకెక్కడి కెడదాం? మళ్ళీ వచ్చి మనింటిదగ్గర ఓ వారం ఉంటే సరిగ్గా నెలవుతుంది. పోనెండీ... నాలుగైదు రోజులు తేడా...అంతేనా? తక్షణం బయల్దేరి మా యింటి కొచ్చేద్దాం. ఏం? మీరెంతో మంచివారుటా, వచ్చేద్దామా? వద్దా?

మీ ఇష్టం... మళ్ళీ వేసంకాలం వెళ్ళిపోతే సంవత్సరం దాకా సెలవు లేవుగా? అందుకనీ ఓసారి చూసిపోదాం.

ఒట్టేనా!

నిజంగా తీసుకొస్తారు కదూ.

ఒక్కరోజే ఉండి వెళ్ళిపోదాం.

అదిగో మా చెల్లి పక్కలేసి పిలుస్తూన్నట్టుంది.

ఏదీ మీ నోరు పండిందా?

ఒక్కసారి ఎక్కిరిపించండీ... ఏదీ... హామ్మయ్యో, ఎంత ఎర్రగా పండిందో లక్కలాగానూ... నాకొక్కత్తె తమ్మిపెడ్తారుటా!

ఊం లేవండీ...ఇప్పుడు చదవనా...

శ్రీ వక్షోజ కురంగ నాభ మెదపై...ఈ పద్యం మీకొచ్చునా. అప్పగించండీ..."

—వచ్చే వారం మరొకటి]

★

మలబద్ధకము మిమ్ము క్రుంగ దీయుచున్నదా?



అవును, మలబద్ధకము చాలా బాధ కలిగించు వ్యాధి. అది మిమ్ము క్రుంగదీస్తుంది. మాంద్యం కలిగిస్తుంది. నిరుత్సాహులను చేస్తుంది. అయినా ప్రపంచంలో లక్షలాది ప్రజలు ఒక్కదినం కూడా బాధపడరేమి. ఇందుకు కారణం అతి సులభమైన, నమ్మకమైన మందు బ్రూక్‌లాక్స్ కనిపెట్టుటే. రుచికరమైన యీ చాకొలెట్ రేచి మందు మల విసర్జనం మామూలుగా కలిగించి మీ శరీరంలోని అపరిశుద్ధమును తీసివేయును. నిద్రకు ముందు ఒక చిన్న ముక్క తీసికొని, దీనివలన కలిగే లాభాన్ని మరునాడు అనుభవించండి. మీరు ఎక్కువ ఉత్సాహంగా, బాగా, శక్తివంతంగా వుండగలరు. మీరు చాలా మెరుగుగా కన్పిస్తారు.

బ్రూక్‌లాక్స్
మిమ్ము రాత్రికి రాత్రి
సరిదిద్దును
(వెస్టు మినిస్టర్ లాబొరేటరీస్ లిమిటెడ్, లండన్ వారి నిర్మాణము.)

ఇండెంటింగు ఏజంట్లు: ఓరియంటల్ మర్కెంటైల్ ఏజన్సీ మద్రాసు-1
బ్రాంచి : 17/117 నాగేశ్వరరావురోడ్, విజయవాడ-2.


హోమ్

జర్మన్ డొమెస్టిక్ పంపుసెట్టు: $\frac{1}{2}$ హా. ప. సిటీ కరెంటుమీద, 75 అడుగుల సక్షనువరకూ పని చేస్తుంది. బెడ్ ప్లేటు, ఫౌండేషను, ఫుట్ వాల్వు అవసరం లేదు. సక్షను గోట్టంమీద బిగించవచ్చును.

★

తాతా—ప్రభాత
విజయవాడ-2.

చలచిత్ర కథలు



విక్రమార్కుడి మార్కు సింహాసనం

"ఏడిదుంప తెగ! వీడి కెప్పుడూ ఒక్క లాటి వేషాలే దొరకకా. టోకరా కథలు చెబుతూ చెబుతూ నాకే టోపీవేసి మస్కాకొట్టాడే.. ఆ పెట్టెనిండా ఫిలిం స్టోరీలూ, డైలాగులూ, స్టిలూ, సినిమా టోగ్రఫీ-అన్నిటికన్న ముఖ్యం త్రీథౌజండ్ సాంగ్సూ ఉన్నాయిగదా. ఇప్పుడేలా?" అన్నాడు రాజు మెల్లిగా

"అవన్నీ మీరు రాసినవే? ఓరిబాబో" అన్నాడు రైల్వే బైరాగి అద్భుత రసాన్ని నటించి

"ఔనండీ నేను చాలా బ్రిలియంట్ ఫెలోని లెండి అన్నీ నేనే రాశాను.. మా వద్ద అన్నిరకముల సాంగ్సూ దొరకును.., ఏడిచేవి, నవ్వేవి, జోలపాటలూ, నేపధ్య పాటలూ అన్నీ హోల్ మొత్తం త్రీథౌజంత్ ఉన్నాయండి. ఈదొంగపీనుగ వాటితో గబుక్కున, నాకన్న ముందర గొప్పవాడై పోరుకుంటాడు . ఇంత పచ్చిదొంగ అనుకో లేదు రైల్వే బైరాగిగారూ...వీణ్ణేమన్నాలో తెలీటం లేదు స్వామీ"" అన్నాడు వరహాల రాజు హృదయ విదారకంగారుగా

రైల్వే బైరాగి ఒక్కక్షణం ఆలోచించాడు. తనకు తోచినమాటలు సూచించడానికి.

"పుస్తకాల్లో రాసుకునే మాటలే చాలనేపత్నంలో, దొంగపీనుగ, కంత్రీవెధవ, పచ్చికేడీ, దంగు వెధవ, ఇంగ్లీషులో రాస్కెల్, ఇంకా దుర్మార్గుడు, కౄరుడు మరీ ఘాటుగా తిట్టాలంటే అప్పులవాడూ, టికెట్టు కలెక్టరు, అనవచ్చును అన్నాడు రైల్వేబైరాగి గుక్క తిప్పుకోకుండా.

గుక్కతిప్పుకోడానికి తెరిపిచేసుకోగానే,

"అయ్యా ఒక చిన్న మంగుళూరుబీడీ-అణా కొరకం ఇవ్వండి" న్నాడు.

రాజు బైరాగికి సలహాలు నచ్చలేదు

"థాంక్స్ మీ డైలాగు బాగానేఉంది గాని ఘాటుగా లేదు. మాట మాటకీ నూటొక్క అర్థాలుండాలి. సినిమా డైలాగులు మీరు విన లేదు కావును. ముఖ్యంగా ఆస్నేపు డైలాగులికి, ఉండేవి రెండర్థాలే అయినా ఎంత గ్రహ్మాండంగా ఉంటాయని!" అన్నాడు రాజు.

"నీకు నాలుగు చేతులున్నాయిస్మీ" అంటూ భక్తుడు చెబుతుంటే, వింటూ నిల్చున్న విష్ణుమూర్తిలా నవ్వాడు రైల్వే బైరాగి.

"ఎందుకు నాయనా! మానిన గాయాలని, మరచిన ఆశయాలని రేపుతావు." అన్నాడు మందహాసంచేస్తూ. అది కాస్తా అతగాడిగడ్డంలో చిక్కడిపోయినందువల్ల

ఎస్. పార్థసారథి

రాజుకి కనబడ లేదు. కాని ఇతగాడూ ఇంకో కథ చెప్పి ఇంకేమన్నా ఎత్తుకపోతాడేమోనని భయంవేసింది. అందుకని మాట్లాడకుండా, బైరాగులతో నాకేమిటన్న పోజును అభినయించి, తల అటువేపు తిప్పాడు.

"హుఁ అన్ని పోతేపోయాయిగాని ఎడ్రసులు పోతే ఎలాగ?. " అని గొణుక్కున్నాడు ఉండబట్టలేక.

"ఎవరెడ్రసులు బాబూ-బీడీ ఇచ్చావు గాదు" అన్నాడు బైరాగి కాస్త దగ్గరగా జరిగి ముందుకు ఒరిగి

రాజుకి దుఃఖం, తిక్కకోపం జమిలిగా ముంచుకొచ్చాయి.

"ఎవరెడ్రసులేమిటయ్యా సినిమా స్టార్ల ఎడ్రసులు. ఒకటా రెండా? వందా? యాభయా? వంగాయాభయీ. చచ్చి చెడి సంపాదించాను."

"దానికేముంది నాయనా. ఏ సినిమా పత్రికొక్కన్నా కొల్లలుగా దొరుకుతాయి ఈపాటి దానికే ఏటికి బెంగ? ఒక్క బీడీ ఇచ్చావుగాదు" అన్నాడు.

రాజు ఉలిక్కిపడ్డాడు. "మీరు సాంగు రైటరాండి కొంపతీసి?" అన్నాడు.

బైరాగి బాధగానవ్వాడు. "వద్దన్నానా నాన్నా? నా మానిన ఆశయాలూ, నేమరచిన గాయాలూ ..మళ్ళీ'

"సార్...తప్పచెబుతున్నారండి మానిన గాయాలూ మరచిన ఆశయాలూ అనాలి... ఇంకోటి. నన్నడిగితే ఆశయాల్లో శకారం తీసిపారెస్తే బెష్టు. గాయాలూ, ఆయాలూ అని శ్రావ్యంగా ఉంటుంది." అన్నాడు రాజు.

బైరాగి, 'బాధను అణచుకొనుట' అభినయించి 'విషయమును మార్చ ప్రయత్నించుట'ను నటించి, "ఆఎడ్రసులు దొరకవన్నారు చూడండి......ఎక్కడన్నా దొరుకుతాయిగా.. నా బీడీ డైలాగు మీరు వింటం లేదు" అన్నాడు.

"లేదులెండిసార్...మీరు చెప్పే పుస్తకాలోసినిమావాళ్ళ పేరుఉంటుందికాని ఎడ్రెసులు సరిగ్గాఉండవు. అంతెందుకు నాకు తెలిసిన ఒక అసిస్టెంటు డైరెక్టరు పేరేసి, అడ్రసు కేరాఫ్ కోడంబాకం హైరోడ్డు అని రాసి ఊరుకున్నారు..."

"అంతేలెండి మీకు తెలిసిన ఆ అసిస్టెంటు ఆ రూటులోనే తిరుగుతూఉంటాడు. పెర్మనెంట్ అడ్రసు అన్నమాట" అన్నాడు బైరాగి ముక్కుపుటాలు ఎగరేస్తూ.

"హాఁ. అలాగాండి. నాకు తెలీదులెండి. నేను ఒక్కొక్క పత్రికకి ఒక్కొక్క స్టారు అడ్రసు అడుగుతూ రాసి జవాబు తెప్పించి అవన్నీ పోగేశానులెండి ఎలాగైనా ఎడ్రెసు లేకుండా మెడ్రాసువెళ్ళడం ఎందుకని—"

బైరాగి మాట్లాడలేదు. నిముషం తల వంచుకు ఆలోచించాడు, ఇంకోనిముషం

విక్రమార్కుడి మార్కు సింహాసనం

రైలుటాపు వేపుచూస్తూ ఇంకా ఆలోచించాడు. ఆనక రాజు మొహం 'లెవెల్'కి దింపి "ఎవరెడ్రసులు కావాలి మీకు?" అన్నాడు. గంభీరంగా

రాజు బాధగా నవ్వాడు.

"మీరేం అర్చేవారా తీర్చేవారా స్వామీ?" అన్నాడు.

"వాళ్లిద్దరూ ఎవరో నాకు తెలీదుగాని మీరు నా మానిన గాయాలూ, మరచిన ఆ (శ) యాలూ రేపారు. ఇంకెందుకు చెబుతున్నా నేనోహ కారక్టర్ యాక్టర్ని లెండి" అన్నాడు బైరాగి బాధగా తలవంచుకుని.

"భా!...నాకు తెలిదుసుమండీ. కల్లో కూడా అనుకోలేదు. అయితే మీ రూ మెడ్రాసేనన్నమాట ... సినిమాల్లోనే చేరుతారా?"

"కాపోతే పెరంబూరు కోచి ఫాక్టరీలో చేరతానండీ? మీరు మరీ ఇదిగాని...బీడి ఇచ్చారుగాదు."

"అయితే మీకు అందరి ఎడ్రసులూ తెలుసున్నమాట—".

బి. ఎ. ప్యాసైనవాణ్ణి ఎ. బి. సి. డీలు వచ్చునా అంటూ చిన్న పిల్లాడు అడిగే ప్రశ్నకి, జవాబులా నవ్వాడు బైరాగి· "ఎ. నాగేశ్వరరావుకి, 38 సారంగపాణి స్ట్రీటు టీనగర్, ఎన్. టి. రామారావు 63 బజుల్లా రోడ్డు టీనగర్..." అంటూ ఏ బీ సీ డీల వరుసగా ఏకబిగిన ఏకరువు పెట్టాడు.

రాజుకి అతనిమీద ఎవలేని భక్తి తాత్పర్యాలు కలిగాయి.

"నివురుగప్పిన నిప్పులా–" అన్నాడు ఆనందగాద్గదిక స్వరంతో

"వెదకబోయిన తీగలా – బీ డీ లే దా?" అన్నాడు బైరాగి ఉత్సాహంగా.

"సార్ తీగల డైలాగులు వద్దండి. ఇందాక నా పెట్టి ఎత్తుకుపోయిన వాడితో మాటాడుతూ ఇదే అన్నాను. ఇప్పటికి రెండు తీగలు తగిలాయి వెతక్కుండానే. వాటిలో చిక్కుడి బోల్తా కొట్టాను"

"అలా భయపడితే ఎలా? సినిమాలో చేరి పైకిరావాలంటే ఎంతధైర్యం ఉండాలి, ఎంతశక్తి ఉండాలి."

"అదేం ఫరవాలేదు సార్, ఒక్కసారి భయపడ్డవాళ్ళకీ, ఎవరూ తెలీని చిన్నవాళ్ళకీ ఛాన్సులు వస్తాయి. లెండి. దేవికా రాణి కంటబడేదాకా దిలీప్‌కుమార్ పళ్ళదుకాణం నడిపేవాడట ఆవిడ, అతను మంచి నటుడవుతాడని పసిగట్టి, సిఫార్సు చేసి సినిమా ఛాన్సు ఇప్పించిందట. అలాగే, లైట్‌బాయ్‌గా ప్రవేశించి ధారాపధాన బ్రహ్మాండమైన కీర్తి ప్రతిష్ఠ లార్జించి పెద్ద యాక్టర్ ప్రొడ్యూసర్ డైరెక్టరయిన రాజ్‌కపూర్ —"

"హూఁ...ఈ కథలు అందరికీ తెలుసు. వాళ్ళకి తెలివితేటలూ అదృష్ట మూకూడా కలిసొచ్చాయి. వుత్త తెలితేటలతో ఛాన్సులు సాంపాదించిన సూర్‌దాస్ కథ చెబుతా విను" అన్నాడు బైరాగి.

సూర్‌దాస్ కథ

సూర్‌దాస్ మొదట సూరత్‌లో ఒక దుకాణంమీద రైటరుగా ఉండేవాడు. హఠాత్తుగా పరారై బొంబాయిలో తేలి, అక్కడో ఇంగ్లీషు హోటలులో వెయిటరుగా చేరాడు. నీలాగే డైలాగులూ సాంగులూ, కథలూ రాసేవాడు తీరిక వేళలో ఇలా ఉంటూ ఉండగా, రోజూ ఆ హోటలుకి కాఫీ తాగవచ్చే ఒక డిస్ట్రిబ్యూటరు కొడుకుతో పరిచయరి కలిగింది. అదెలాగంటావేమో, ఇంగ్లీషుహోటేలు కదూ మరి. అందుకని, అక్కడ వెయిటర్లంటే మామూలు సర్వర్లలా సామాన్యులు కారు. మాన్యులు. డైలాగు గుర్తుంచుకో బాగుంటుంది ఏం కాఫ తాగబోయేవారికి కూడా వాళ్ళంటే ఒక రకమైన భయభక్తులుండేవి. వేడ కాఫి తాగి, పావలా 'టిప్' అంటే బహుమానం ఇచ్చి, అణా ఎత్తు సలాం పుచ్చుకు మురిసిపోతారులే. కాఫీ బాగుండకపోయినా ఫర్వాలేదనుకో. ఈ హోటేలుకి లాలారాం అనే డిస్ట్రిబ్యూటరు కొడుకు రోజూ వచ్చేవాడు. అతను ఫలానా అని సూరదాసు పసికట్టేశాడు. అక్కణ్ణించి అతనికి సకల మర్యాదలూ చెయడం మొదలెట్టాడు. కాఫీ అడిగిన 30 నిముషాలకల్లా కలిపి తెచ్చిచ్చేవాడు. పావలా టిప్ ఇస్తే రూపాయెత్తు సలాంపెట్టి "ఆప్‌కే గులాం జనాబ్" అన్నంత పని చేసేవాడు.

లాలారాం కొడుక్కి ఆనందంపట్ట శక్యం కాక, వత్సా వరము దుగు అన్నాడు హిందీలో.

"సినిమా ఛాన్సు" అన్నాడు సూరదాసు దర్జాగా.

"అది తప్పు" అన్నముక్క అనడం పొరబాటున మర్చిపోయిన ఆ డిస్ట్రిబ్యూటరుకు నాలిక్కొరచుకుని, ఇది వీడి అదృష్టంలే అనుకుని, సరే రేపురా మాపురా అని కొన్నాళ్ళు తిప్పి, చివరకు ఒకరోజున తండ్రి ఎదట నిలబెట్టి తన మాట నిలబెట్టుకున్నాడు.

ఇంగ్లీషు హోటలు వారికిచ్చే వాగ్దానాలు అవశ్యం నిలబెట్టుకోవలసినవిగదా!

సరే, లాలారాంగారు ఆవేళ మంచి హుషారుగా ఉన్నారు. సూరదాసును చూస్తూనే ఏంకావాలన్నారు.

"సినిమా ఛాన్సు" అన్నాడు సూరదాసు ముక్తసరిగా.

"ఎందులో? యాక్టింగా, రాయడమా, ఫొటోగ్రఫీయా, డైరెక్షనా? ఏమిటి?" అన్నాడు లాలారాం.

"ఏదేనా సరేండి. అన్నీ చెయ్యగల్ను అందుకే చెప్పలేదు." అన్నాడు సూరదాసు ఠీవిగా.

లాలారాంగారు మురిసి పోయాడు ఈ ఆసామి తెలివితేటలకు. ఫలానా అని చెబితే 'అయ్యో అందులో కాళీలేదు' అని చెప్పి తప్పించుకోవడం లాలారాంకు అలవాటు. ఆ సంగతి సూరదాసుకు తెలుసు.

"ఇన్నాళ్ళకి తెలివైన వాడిని చూశాను. నీకేమివ్వడానికీ నాకభ్యంతరం లేదుగాని, కొత్తవాడివి కాబట్టి కొన్నాళ్ళు కథలూ, డైలాగులూ పాటలూరాయి" అన్నాడు లాలారాం.

"పోనీ డైరెక్షన్ చెయ్యమనరాదూ నాన్నా?" అన్నాడు పక్కనేవున్న అతని

(49-వ పేజీ చూడండి)

పండిత డి.గోపాలాచార్యులవారి
అరుణ
గర్భాశయ రోగనివారిణి
ఆయుర్వేదాశ్రమం,
(ప్రైవేటు) లిమిటెడ్., మద్రాసు-17.

రామం తమాషా

రోజులాగే నేను, మా రామం, తమ్ముళ్ళు ప్రక్కింటి సుబ్బారావు షైగు బయలు దేరాం. మా రామం ఎటువంటవాడో ముందు మీకే తెలుస్తుంది. అల్లా అల్లా తిరిగివస్తుంటే మధ్యలో చౌదరిగారి చెరకుతోట కన్పించింది. చెరుకుగడలు బాగా ఏపుగా పెరిగి చాలలావుగా వున్నాయి. వాటిని చూడ్డంతోటే మా అందరికీ తినాలని బుద్ధిపుట్టింది. కాని ఎట్లా? మావూరి ఆ చౌదరిగారు ఎవర్నీ కన్నెత్తి అప్రక్క చూడనియ్యడు. అటువంటి చౌదరిగారి చేలోనుండి మాకు చెరుకు కర్రలు ఎలావస్తయ్? ఆ చేలోనే గట్టు ప్రక్కను చౌదరిగారి చెరుకుగానుగ కూడ

"యలమాటి"

వుంది. చెరకుగడలు సంపాదించుట మావల్ల కాదు. మేమందరం మా రామంగాడిని ఎలాగైనా చెరకుగడలు సంపాదించిపెట్టమని బ్రతిమాలాము. ఆఖరికి ఎలాగైతేనేమి "సరే" అన్నాడు.

అందరము కలిసి తోటగట్టునబడి నడుస్తున్నాము. మేమింకా నాలుగడుగులు వేయకముందే చౌదరిగారికేక కర్ణకఠోరంగా వినిపించింది.

"ఓయ్! ఎవరావచ్చేది! ఆగండి" అని.

"మేము! మేము!" అని అరిచాడు మా రామం.

"ఎవరు? మీరు? రావడానికి వీల్లేదు. ఆగండి!" అంటూ పరుగునవచ్చాడు చౌదరి. వచ్చి "ఎవరయ్యా! మీరు. మీ కేం పని. చెప్పండి" అని గద్దించాడు.


మీ ఉద్యోగమేమి?


వ్యాపారియా, ఫ్రూనుసామానులు తయారు చేయు వారా...ఎలెక్ట్రిషియనా., మెకానిక్కా...హాబీయిస్టా?

అయితే మీ కత్యవసరమైనది 'ఉల్ఫుకబ్బు'—దృఢమైన, శక్తివంతమైన, ఇంతకు ముందు ఎన్నడు లభించని మీ శక్తికి తగిన ఖరీదులో దొరకు శ్రేష్ఠం. ఎలెక్ట్రిక్ డ్రిల్లు.

'ఉల్ఫుకబ్బు' డ్రిల్లుతో ప్రారంభించి మీ కర్మాగారమును ఇతర విద్యుచ్ఛక్తితో పనిచేయు పనిముట్లతో నింపుడు.

'ఉల్ఫుకబ్బు.' డ్రిల్లింగ్, పాలిషింగ్, సాయింగ్, మరియు చేతి పనిముట్లతో చేయుట వలన కలుగు అలసట, ఇబ్బందుల లేక చేయుచున్నది. అది బహు వ్యాపకమైనది, తేలికైనది మరియు ఉపయోగించుటకు సులభమైనది. మీరు తక్కువ శ్రమతో ఎక్కువ ఫలము పొంద గలరు.





PSR11

రాలీస్ ఇండియా లిమిటెడ్.

320, లింగిచెట్టి స్ట్రీట్, మదరాసు. బొంబాయి • కలకత్తా • ఢిల్లీ.

నేషనల్ ఇంజనీరింగ్ కంపెనీ (మద్రాసు) ప్రైవేట్ లి॥

379, నేతాజీ రోడ్, మద్రాసు-1.

మెసర్సు: స్కోడా ఎక్స్‌పోర్ట్, జకోస్లవేకియా వారికి

దక్షిణ ఇండియా కంతటికి సోల్ ఏజెంట్లు

స్కోడా ఇంజనులు

పారిశ్రామిక, వ్యవసాయిక, నౌకా సర్వీసులకు

2,000 H. P. వరకు

జనరేటర్లు

స్టేషనరీ మరియు, పోర్టబుల్

1250 KVA వరకు

ప్రతిజిల్లా ఏజన్సీ దరఖాస్తులు కోరడమైనది.

మనోహరమైన కేశములకు సులభమైన కటుకు

తాతావారి

సుగంధిత కొబ్బరి తలనూనె

మరియు షాంపూ



ది తాతా ఆయిల్ మిల్స్ కంపెనీ లిమిటెడ్.

"ఆ! ఆ! మేమేనండి చౌదరిగారు. ఆ! మరేంలేదు" అంటూ అందుకున్నాడు మా వాడు. "మీఎద్దుకి మీదిపళ్లు ఉన్నయ్యా?" అన్నాడు

"అబ్బాయిలూ! మీ కేమన్నా మతి పోయిందా? ఎద్దులకు ఆవులకువలె దవడమీద పళ్లుఉండవని మీకు తెలియదూ?" అన్నాడు చౌదరిగారు.

"అదేమిటండీ! చౌదరిగారూ! మాఎద్దుకి మీదిపళ్లువుంటే. మీఎద్దుకు నేను మీదిపళ్లు చూపెడతానుపదండి" అన్నాడు మారామం.

"నీకేంపిచ్చెక్కిందా? నడు, నడుఅవతలకు"

"అదికాదండీ చౌదరిగారు! మీఎద్దుకు మీదిపళ్లు చూపెడతాను. చూపిస్తే మాకు చెరుకుగడలిస్తారా?"

"అలాగే! కాని ఇటుచూడు. చూపించక పోతే నీవీపు చితకగొడ్తా ఏం? సరేనా?"

"ఓ! అలాగే! మరైతే ఎవరినైన మధ్యవర్తిగా పిలవండి."

"సరే! మాపాలేరు ఉన్నాడు. రండి" అంటూ చౌదరి గానుగ వద్దకు దారి తీశాడు. మేమందరమూ వాని వెనకాలే వెళ్తున్నాము. కాని మాఅందరి గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయ్. "ఈ రామం గాడు ఎద్దుకు మీది పళ్ళు ఎలా చూపగలడు ఇది అసంభవం. దేవుడే దానికి పళ్ళు ఇవ్వలేదు. వీడెలా చూపించగలడు? ఎలాగా దెబ్బలు తప్పవురా" అనుకుంటున్నాము మాలో మేము.

అంతలో చౌదరి గారు ఒక ఎద్దుని తీసుకొనివచ్చి మాముందు నిలిపారు. మేం ఎగాదిగా చూస్తున్నాము.

"చూపవయ్యా! చూపు. చూస్తావేం" అన్నాడు చౌదరి.

"అలాగే నండి! అందరూ బాగా చూడండి" అంటూ మా రామం ఎద్దు ముందరకు వెళ్ళి తన మీది పళ్ళు ఎద్దుకు చూపిస్తూ "ఇహీ! ఇహీ! ఇహీ" అని నవ్వడం మొదలు పెట్టాడు.

"ఏమిటయ్యా! ఆనవ్వు. ఎద్దుకు మీది పళ్ళు చూపించవే" అన్నాడు చౌదరిగారు.

"ఇదిగో మీ ఎద్దుకు మీది పళ్ళు చూపెడుతున్నా!" అంటూ తిరిగి తన మీది పళ్ళు ఎద్దుకు చూపెట్టాడు.

అది చూచి మేమందరం కడుపుబ్బ నవ్వసాగేము. చౌదరిగారు మొదట తన తెలివి తక్కువతనానికి తెల్లబోయి కోపం తెచ్చుకున్నారు. కాని మా రామంగాడి తమాషా చూసి నవ్వేశారు.

ఇంకేం! మాకందరకు కావలసినన్ని చెరుకుగడలు త్రాగినంత చెరుకురసం — తిన్నంత బెల్లం దొరికింది. మా రామంగాడు మాత్రం ఓ బెల్లంముక్క లాగుజేబులో నిక్కి పోనిచ్చాడు. ★

ట..ట..ట!

"ట్రు టట ట అన వే గుంట పిల్ల కానా! నీ వయసెంతో తెలుసునే?"

అని అత్తయ్య గద్దించేసరికి నాచుట్టుపరిధి క్రిందవున్న భూదేవితోసహా నా పాపిటలో మొండి కత్తి నిటాగ్గానిల్చున్న కేసరపు కొస దాకా కంపించిపోయాం క్షణంపాటు! ఆవిడ గర్జింపువింటే కేసరులు కూడా తోకముడు స్తాయి అరి!

అత్తయ్యని అవహేళన చేస్తున్నానని ఎవరైనా అనుకునేరు! అత్తయ్యలాంటి వ్యక్తిని గురించి చెప్తున్నాను. ఆమెలాంటి వారి గురించి మీకు తెలీదని కాదుసుమండీ! అయితే అనేకతరహాల వ్యక్తులని చూస్తాం! ప్రతి వ్యక్తికీ ఒకొక్క ప్రత్యేకత వుంటుంది. ఆప్రత్యేకవిశేషం వ్యక్తిగతమైనప్పుడు తంటాలేదు. అదిమాత్రంఒకొక్క సందర్భంలో ఇలా-అంటే అత్తయ్యమాదిరి, ఇతర్ల మీద విరుచుకుపడుతూంటుంది! ఇలా విరుచుకుపడ్డప్పుడే దానిఘాటు మనని వుక్కిరిబిక్కిరి చేసేస్తుంది!

అయితే ఈ సందర్భంలో నా పొరబాటేమీ లేదని నేను చెప్పటంలేదు.

అత్తయ్య ఆవీధిలో వుందన్నా మనం మాట జాగ్రత్తపడాలి. అక్కడే వచ్చింది పేచీఅంతా! నేను కొంచెం సరదాగా ఆరిందాలా వాగేరకం!

అటు అత్తయ్య!

అత్తయ్య వయసుకి పెద్దది (అధమం మా పిల్ల సజ్జుకంటె!) కాబట్టి తాను చాలా ప్రపంచం చూశాను అంటుంది! కాబట్టి తను చూసిన ప్రపంచంగురించి మనకి చెప్తానంటుంది! మనమంతా వినాలంటుంది. కాని ఆవిడ చెప్పగా విన్నవిశేషాన్ని ఎక్కడ ఎవరితో తిరిగి చెప్పినా-ఆవిశేషానికీ-తద్విశేషంలోవున్న వాక్యవాక్యానికి 'ట' అనే అక్షరం తగల్చాలట! ఆ విశేష సంఘటనను మనం చూసివుండకపోతే, ఆవిశేష సంఘటనకు మనం ప్రత్యక్షసాక్షులం కానిపక్షాన దాన్ని మనం 'ట'కారం తగల్చకుండా చెప్పినట్లయితే ఆవిశేషాన్ని మనం స్వంతం చేసుకో ప్రయత్నించినట్లవుతుందట! దానివల్ల అత్తయ్య 'కాపీరైటు'కి భంగం కలుగుతుందికాబోలు!

కాలచక్రంక్రిందపడి నలిగిపోయిన ఈ సంఘటనలకూ, వానియందు పాత్ర వహించిన వ్యక్తుల ప్రత్యేకహక్కులకూ ఏటు వంటి భంగం వాటిల్లకుండా అన్యాయం జరగకుండా కాపాడేపూచీ, బాధ్యతా ఆవిడగారు స్వంతం చేసేసుకుంది! ఈ బాధ్యతా నిర్వహణలో ఆమె దీక్ష అనిర్వచనీయం, అనుపమానం, అనంతం. కాబట్టి ఏదైనా ఒక సంఘటనగురించి ఆ సంఘటనలో పాత్రవహించిన వ్యక్తులందరూ ఏకగ్రీవంగా, అభిప్రాయభేదం లేకుండా, జరిగినది జరిగినట్లూ మనకి చెప్పినదానిని అక్షరం పొల్లుపోకుండా మనం-పై వాళ్ళం-అంటే ఆ సంఘటనకు సంబంధించనివాళ్ళం చెప్పకోవాలంటే, ఆసంఘటనాభివర్ణనలో సాధ్యమైనన్ని 'ట' లు తగిల్చి మరీ ఇదవాలి! లేదా అత్తయ్యదంచే రెండు గంటల లెక్చరుని కిక్కురుమనకుండా వినాలి! మనం ఆదమరపుగానో పొరబాటునో 'ట'కారం తగల్చకపోయామో వెంటనే అత్తయ్య మనని

కోటమర్తి భ్రమరాంబ

సవాల్ చేసి 'క్రాసెగ్జామిన్' చేసి, మనకీ విషయంలో ప్రత్యక్షానుభవం లేదని రూఢి చేసి, మనకి ప్రత్యక్షానుభవం లేని విషయానికి 'ట' కారాన్ని తగల్చనందుకు వెటకారం చేసి, హేళనచేసి, మందలించి, చీదరించి, ఛీత్కారంచేసి తల వాయగొట్టేస్తుంది!

ఈ అనుభవం నాకు బాగా వుండీ, ఆవేళ ఏవో కబుర్లు చెప్పకుంటూ, సావిట్లో అత్తయ్య వున్న సంగతి మరిచిపోయి అన్నా—"ఓస్! వీళ్ళేమిటి మహా! అసలు కోతంటే తాతయ్య!"

సంభాషణాంశం ఇక్కడ చెప్పటం అసందర్భం కాదనుకుంటా?

మామయ్యచుట్టూ కుర్రాళ్ళు చేరి ఆడుతున్నారు! మామయ్య నేలమీద తేలు బొమ్మని గీశాడు. కుర్రాళ్ళని సంబోధిస్తూ సవాల్ చేశాడు: "దీనితోకచివర్న వేలెవడు పెట్టగలడురా? మంత్రంవేసి నిముషంలో విషం ఎక్కించేస్తా!"

మహావీరుడనని బయల్దేరుతాడు ప్రతిదానికీ మొండి జెగ్గడు! "ఓ ఏదీ చూద్దాం" అంటూ బోర విరుచుకు చుట్టూ చూశాడు, గర్వంగా! మిగిలిన కుర్రకారు వాడిని రంగస్థలం మధ్యకు తోసి చుట్టూ గుమికూడారు.

వాడిని భయపెడ్తూ మామయ్య అన్నాడు-"ఒకే ఎక్కిన తరువాత దిగడం ఒక అరగంట పైన పడుతుంది సుమా!"

"భయమేమిటి!" అన్నాడు జెగ్గడు జంకుగా.

"సరే! బొమ్మ తేలుబొమ్మ! తేలుకి తోకవుంది. తోకచివరన కొండివుంది; కొండికిముల్లు. ముల్లుసూదికొసని నీ కుడిచేతి చూపుడువేలు కొసనిఆన్చి గట్టిగానొక్కిపట్టు" గారడీవాడు 'మెస్మరైజ్' చేస్తున్నట్లు, చూస్తూ అదోరకం భయంకరంగా అన్నాడు మామయ్య! బొమ్మకు దగ్గరగా మోకాళ్ళమీదపడి, వణుకుతున్న కుడిచేతి చూపుడు వ్రేలిని జాలిగాచూస్తూ భయం భయంగా తేలుతోక చివరివైపు జాపుతూ మధ్యలోఆగి, నిండుకొచ్చిన గొంతుకతో, "మరి నీకు తేలుమంత్రం వచ్చునా?" అని అడిగాడు నాగమ్మ!

"ఓ!" అన్నాడు మామయ్య ధీమాగా.

వీడికితప్పలేదు. కళ్ళుమూసుకుని ఘుబుక్కున వేలుపెట్టేశాడు...ఏదీ! ఎక్కిందా? కళ్ళుతెరచి ఎందాకాఎక్కిందో చూడబోయాడు.

"నువ్వు చెయ్యిపెట్టి వూరుకోవటం కాదురా! 'ఎక్క, ఎక్క ఎక్క' అంటూండాలి"అని మామయ్య ఈగారడీకి ఓచిన్నచిట్కా చెప్పాడు!

వాడుఏడుపుకి ఏమాత్రమూ దూరంలేని గొంతుకతో "ఎక్క ఎక్క, ఎ—" అన్నాడు.

ఇంకేముంది! రెండోమాటు ఎక్క

కలవరపడు స్త్రీలకు



"కుమారి" మాత్రలు మరువకండి. మీ ఆరోగ్యం రక్షించును. చింతఅనవసరం

వెం (సాదా) రు. 3/-

(స్పెషల్) రు. 5/-


(ఎక్స్ట్రా స్పెషల్) 8/-

పోస్టేజిప్యాకింగుప్రత్యేకం

Mrs. P. Devee, F.D.S. (AP) Calcutta-40.

Stockists.—(1) Indo Medical Supplies, 3, Pauliappan St., G. T. Madras; (2) L. M. Mukerji & Sons Ltd., 167, Dharamtola St., Cal—13.

కుటుంబంలో అందరకూ వస్త్రాలు



తరతరాలుగా ఆదరింపబడుతున్నవి; ఈనాటి అభిరుచులకు సరిపడేవి - <u>చేనేత వస్త్రాలు</u> - కుటుంబంలో పెద్దా, పిన్నా ధరించేందుకు, గృహాలు చక్కగా అలంకరించుకొనేందుకు - <u>చేనేత వస్త్రాలు</u> - దేశీయ చేనేత కళాకారులు మీ కోసం తయారు చేస్తున్నవి.

నాణ్యతకూ, చౌకైన ధరలకూ పేరెన్నిక గన్నవి కనుకనే చేనేత వస్త్రాలంటే అంతటా ఇంత మోజు.

చేనేత
వస్త్రాలు

ALL INDIA HANDLOOM BOARD

ఆల్ ఇండియా హాండ్‌లూమ్ బోర్డు
షాహీబాగ్ హౌస్, విట్టెట్ రోడ్, బొంబాయి.

DA-57/193

టు ...టు...టా!

మనటంతోనే తపీమని వాడిబుజాలమీద ఎక్కేసికూర్చున్నాడు మామయ్య! నఱ్ఱాళ్ళంతా ఘొల్లుననవ్వేశారు. మొండిజెగడూ పవ్వేడు! ఆనవ్వులో 'స్పోర్ట్స్‌మన్ స్పిరిట్' కన్నఎక్కింది తేలువిషం కాదు మామయ్యే కదా అనే 'రిలీఫ్' ఎక్కువగా ధ్వనించింది.

ఇలా నఱ్ఱాళ్ళలో చేరిపోయి, నఱ్ఱాళ్ళైపోయి, వాళ్ళని ఏడిపించి, నానాఅల్లరిచేసి అత్తయ్యలచేత చెవులు మెలేయించుకునే మామయ్యలకోతిచేష్టల చర్చజరుగుతూంది! పూరుకోక ఆరిందాలా నేనుఅన్నా— "ఓస్! వీళ్ళమిటిమహా! అసలు కోతంటే తాతయ్య!"—అని, అక్కడే సావిట్లో అత్తయ్యవుందన్న సంగతి మరచిపోయి!

దాంతో ఓ ఫెళఫెళార్భాటం విరిగి పడ్డాది నాయీచిన్నబుఱ్ఱపైన!

"'ట!' 'ట!' 'ట!' 'ట' అనవే గుంట పిల్లకానా! నీవయసెంతో తెలుసునే?"

నేను ఏంచెయ్యాలో తోచక అత్తయ్య ప్రతిపాదించిన ఈ 'ఎమెండ్‌మెంటు'ని తేమరతుగా అంగీకరించి, "ఆటసటలుటకోట తటంటటేట తాటతటయ్యట!" అని ఆమె ప్రశ్నకు సమాధానంగా "నాటవటయట స్నట పటదిట హేటనుట ఏటళ్ళట అట త్తటయ్యాట!" అన్నాను.

... ...

ఆసాయంత్రం ఏడుగంటలకే అత్తయ్య వెళ్లేక అందరంజట్టుకలసి గంధంతీసి ఒకరి నుదురుకొకరం సానుభూతితో పట్టించుకున్నాం! మూల్గుతూ మూలుగుతూ పడుకున్నామేగాని నిద్దరలేదు. పొరబాటు కనుకుపట్టిందో మరుక్షణమే అత్తయ్య భీకరస్వరూపం తాండవమాడుతూ వీపుమీద ఛెళ్ళనకొట్టినట్లులేపి కూర్చోపెట్టి మరీ శాంతించేది.

మర్నాటిపుదయం 'ట' భాషని అత్తయ్య సమక్షంలో మాట్లాడనని హామీ రాసిచ్చే వరకూ నాకు గుక్కెడు కాఫీనీళ్ళివ్వకుండా పేచీపెట్టారు మావాళ్ళు!

ఒక్కప్రార్థన! దీన్ని మీ రెవరుచదివినా, లోపలేచదువుకోండి. వీలైనంతవరకూ దీన్ని గురించి చర్చించుకోకండి. కాక దీన్ని చర్చించుకోవాలనే ముచ్చట ఎక్కువగా వుంటే నాలుగుమూలలా పరకాయించి చూసి మరీ ఆరంభించండి! ఎందుకైనా మంచిది ఇటూ అటూ 'సెంట్రీ'ని పెట్టుకుంటే! ఎందుచేతంటే అత్తయ్యదగ్గిర మరో అవలక్షణంవుంది—అనుకోకుండా, ఆసమయాల్లో అమాంతంగా కొనిచోట్ల ప్రత్యక్షమై మనని బేజారెత్తించేయగలదు అత్తయ్య!

పారాహుషార్! ★

ముకుందాయు

ప్రయాణమై బయటికి వచ్చేవరికి వీధిలో రాజశేఖరంగారు ఎదురయ్యారు. ఎక్కడికని అడిగే అలవాటు ఆయనకు లేకపోయినా, అడిగితే అపశకునమవుతుందని "సెల్లూరు వెళ్ళొస్తానండీ" అన్నాను.

"సెల్లూరా!" వీధిలో ఆగి నాకేసి చిత్రంగా చూస్తూ అడిగారు రాజశేఖరం గారు.

"అవును ఎవరితోనైనా మాట్లాడి రమ్మంటారా?"

"ఊహు వద్దు" అనేశారు రాజశేఖరం గారు.

ఆ వదన్న ధోరణిలో తనకు కావలసిన వాళ్ళెవరో సెల్లూరులో వున్నట్టు, ఉన్నా వాళ్ళతో నేను మాట్లాడ్డం రాజశేఖరం గారికి ఇష్టంలేనట్టు నాకు స్ఫురించింది

కొంపదీసి ఆ సెల్లూరులో వున్నవాళ్ళు రాజశేఖరంగారి కూతురూ, అల్లుడూ కారు గదా!

* * *

బస్సు పట్నం పొలిమేర సమీపించేవరికి సన్నసన్నగా వర్షం జారసాగింది. ప్రొద్దుపోయి నాలుగైదు గడియలై వుంటుంది నీల మేఘాచ్ఛన్నమైన ఆకాశంక్రింద, సాంద్ర తిమిరావృతమైన పట్టణంలో వీధుల తాలూకు విద్యుద్దీపాలు మాత్రం మినుకు మినుకుమంటున్నాయి బస్సు హైరోడ్డులో, పరుగెడుతోంది బస్సు పరుగుతో పందెం వేసుకున్నట్టు వర్షం క్రమక్రమంగా ఉద్ధృతమై పోతోంది. సమయానికి డ్రయివరుకో మంచి ఉపాయం తట్టింది. అతడొక హోటలు ముఖద్వారం ముందు బస్సు ఆపి "ఊ, త్వరగా దాటుకోండి. స్టాండులో దిగితే తలదాచూ దొరకదు" అని హెచ్చరించాడు. అదృష్టవశాత్తు హోటలంతా ఖాళీగా వుంది. ప్రయాణికుల్లో చాలమందికి గమ్యస్థానాల పైనే కలవరం వుండటంచేత కాబోలు, వర్షం ఎప్పుడు వెలుస్తుందా అన్నట్టు ద్వారందగ్గర నిల్చుని వర్షధారల వైపు చూస్తున్నారు. ప్రొప్రయిటరు "ఉప్మా వేడిగా వుందండీ! లోపలికి వెళ్ళి కూచో గూడదూ" అంటూ విజ్ఞప్తి చేసుకుంటున్నాడు. అసలు సంగతేమిటంటే లోపల యింకా భోజనాలు తయారైనట్టు లేదు. లేకుంటే ప్రొప్రయిటరు అందరినీ కూచోబెట్టి వరుసగా ఆకులు వేయమని చెప్పి వుండేవాడు. కాసేపాగి, ఆ కాబోయే భోజనాన్నే వేడివేడిగా అరగించి వెళ్దామనుకుని కుర్చీలో కూచున్నాను అప్పుడో విచిత్రం జరిగింది. రెండు నిమిషాలపాటు ఎక్కడి వారక్కడ స్థాణువులై నిలిచిపోయారు బ్రహ్మాండ భాండం ఒక్కసారిగా పెటిల్లని పగిలిపోయిందేమో ననిపించింది ఆ ఉరిమిన ఉరుము ఆకాశంలో ఎక్కడో గాక, క్రిందికి దిగివచ్చి ప్రాణుల కర్ణకుహరాల్లోకి చొచ్చుకపోయి అక్కడ ఉరిమినట్టు తోచింది. విద్యుద్దీపాలన్నీ కలసి మాట్లాడుకున్నట్టు హఠాత్తుగా ఆరిపోయాయి. ప్రొప్రయిటరు "లైట్, లైట్" అని కేక వేయసాగాడు. కానీ ఆ లైటు రంగం మీదికి రాక మునుపే వ్యక్తిగతంగా నేనొక యిక్కట్టుపాలై పోయాను.

మధురాంతకం రాజారాం

ఎవడో యినప కడ్డీలాంటి మనిషి ఎక్కడా తావులేనట్టు ఆ చీకటిలో నా పైన కూలబడిపోయాడు చేసింది చాలక ప్రాధేయపూర్వకంగా "సారీ, సారీ! క్షమించండిసార్" అన్నాడు. ఆ గొంతు నాకు చిరపరిచితం "ఏమిటోయ్ నువ్వా! ఎక్కడున్నావ్, ఏంచేస్తున్నావ్" అంటూ పరామర్శించాను "ఇప్పుడంత తీరికెక్కడిదండీ. మాష్టారూ! అత్యవసర కార్యార్థం డాక్టరుగారికోసం పరుగెడుతున్నాను. ఈ ఉరుమొకటి వచ్చి లైట్లు పోయాయి త్రోవ తెలియక ఈ హోటల్లోకి వచ్చేశాను వర్షం వెలసినట్టుంది. వెళ్తున్నాను," అంటూ పారిపోబోయాడు. "అదేమిటోయ్! బోలెడు విషయాలడగాలనుకుంటే పరుగు తీస్తున్నావు" అంటూ అతడి చేయి పట్టుకున్నాను "మన్నించండి మాష్టారూ! తొందరపని రేపొకసారి యింటికి రండి జండామానువీధి నంబరు అరవై నాలుగు" అంటూ అతడు చేతిని విడిపించుకొని చరచరా చీకటిలో జారిపోయాడు.

అతడిపేరు రామరత్నం!

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఈ నాడతడు నన్ను విడిపించుకొని చీకటిలోకి జారిపోయినట్టే, రెండేళ్ళనాడు నాతో కబురైనా చెప్పకుండా చీకటిలోకి కాకపోయినా అంతకంటే దిక్కులు దోచని భవిష్యత్తును చీల్చుకుంటూ ఎక్కడికో వెళ్ళిపోయాడు

అలా వెళ్ళిపోయినవాడు, ఈనాడు ఈ హోటల్లో తేలి మళ్ళీ యిట్టే మాయమైపోయాడు.

టికెట్టు తీయకుండా, గమ్యస్థానం యిది అని నిర్ణయించుకోకుండా జీవితపు రైలుబండిలో కూచున్న రామరత్నం నిజంగా చిత్రమైన మనిషి!

* * *

పదారేళ్ళ నాటిమాట! ఒక సుప్రభాతం. వరండాలో కూచుని పేపరు చూచుకుంటున్న వాణ్ణి, వీధిమెట్లపైన కాలిచప్పుడు విని తల పైకెత్తాను. "బాగున్నారా మేష్టారూ! చాలాకాలం తర్వాత చూస్తున్నాను." అంటూ నరసయ్య లోపలికి వచ్చాడు. మెడలో వెండికంటె, చెవుల్లో అంటుజోళ్ళు, దట్టంగా మీసాలు, పెద్ద తలపాగా, వీటితో కళ్ళాటిపీరుడిలా ద్యోతకమయ్యే నరసయ్యను ఛాయలా వెంబడిస్తూ ఒకకుర్రాడు లోపలికి వచ్చాడు.

"మీ అబ్బాయా నరసయ్యా! బాగా ఎదిగినట్టున్నాడే" అన్నాను. "ఏముందండీ! చూస్తుండగానే కాలం గడిచిపోతుంది. మీ పెళ్ళి నిన్ననో మొన్ననో జరిగినట్టుంది తలుచుకుంటే! కానీ అప్పుడే పదిహేనేళ్లు దొర్లిపోయినట్టున్నాయి. మీ పెళ్ళినాటికి వీడికి నాలుగేళ్ళు" అన్నాడు నరసయ్య.

ఆ మాటల్లో నరసయ్య హృదయంలోని మధురస్మృతుల్ని ఉసికొలిపి మేల్కొలిపినట్టయింది. రెండెడ్లబళ్ళల్లో మగపెళ్ళివాళ్ళం బయల్దేరడమూ, మార్గమధ్యంలో చల్దిభోజనాలు తినడమూ, ఆ ఊరేగింపూ, ఆచారాల్లో ఏఒక్కటీ వీడుపోకుండా జరిగిన ఆ అయిదురోజుల పెళ్ళి అవన్నీ మరపుకురాని మధురానుభవాలు! ఆ పెళ్ళిలోనే నేను నరసయ్యను తొలిసారిగా చూడ్డం తటస్థించింది. మామగారు పనులు పురమాయిస్తుంటే ఇంటా బయటా, పందిరిలో, వంటగదిలో అన్నిచోట్లా తానుగా విహరిస్తూ వివాహకార్యాలు నిర్వర్తించిన ఆ నడికారుమనిషి నరసయ్య ముఖంలో నేడు వృద్ధాప్యం తొంగిచూస్తున్నది.

ము క్కు— దా డు

“ఓహో నరసయ్యా అలా వెంటిపైన ఉంటావో!” అంటూ ద్వారందగ్గరికి వెళ్ళి రుక్మిణిని పిలిచాను. “రాక రాక వచ్చావే నరసయ్యా! ఉండు, కాఫీ తెస్తాను” అంటూ ద్వారందాకా వచ్చిన రుక్మిణి మళ్ళీ లోపలికి పోయింది. “నేనే కాదమ్మాయ్! నీ అల్లుణ్ణి కూడా తీసుకొచ్చాను. మాకు కాఫీలు త్రాగే అలవాటులేదు గానీ నువ్వొక అడుగు నిలబడు” అన్నాడు నరసయ్య. “అల్లుడైతే తెచ్చావుగానీ మాకు అమ్మాయిలేదే” అంటూ నవ్వింది రుక్మిణి.

నరసయ్య వచ్చిన పనేమిటో సంగ్రహంగా చెప్పేశాడు. కుర్రాడి హైస్కూలు చదువు పోయిన మార్చితో పూర్తయింది. కాలేజీకి అప్లికేషను పెట్టారు. సీటు దొరికింది. భోజనమైతే ఏ హోటల్లోనైనా పెడ్తారు. కానీ హోటల్లో అన్నం తినడం కన్నా, వాడు కాలేజీకి వెళ్ళి శ్రద్ధగా చదువుకోడం ముఖ్యం! ఎవరో ఒకరు తనపైన నిశితంగా నిఘావేసి వుంచకపోతే యిరవైయేళ్ళ కుర్రాడు పట్నంలో చెడుతిరుగుళ్ళు పోవడానికి అవకాశం వుంది. “నాకే మేలు చేసిపెట్టాలి మేష్టారుగారూ!...అమ్మాయ్! పిడిక నీబిడ్డే అనుకోవాలి! నాకేం తెలియదు. నెల నెలా పైకం పంపిస్తుంటానంతే! వాడి చదువూ, ప్రవర్తనా మీదే పూచీ!” అంటూ ముగించాడు నరసయ్య.

కుర్రాడికోసం వీధివైపు గది ఖాళీచేయించాము. ప్రక్క వీధిలోనే ఒక హోటలుంటే అక్కడ భోజనం ఏర్పాటుచేశాను. రామరత్నం కాలేజీలో చేరి చదువుకోసాగాడు.

‘రామరత్నం నెమ్మదైనవాడు. శ్రద్ధగా చదువుకుంటాడు. క్లాసు తెచ్చుకుంటాడు. అతడికి మంచి ఉద్యోగం దొరుకుతుంది.’ ఆదిలో నేనూ, రుక్మిణీ రామరత్నాన్ని గురించి యిలాటి నిర్ణయానికే వచ్చాము. కానీ సూర్యాస్తమయం తర్వాత మెల్లమెల్లగా వచ్చి లోకాన్ని క్రమ్ముకునే చీకట్ల కోకలా రామరత్నం స్వభావంలో క్రమక్రమంగా మార్పు కనపడసాగింది. అసలే మురుకుపాలెక్కువైన కుర్రాడేమో, పట్టణ వాతావరణం పైపైని నివురుని ఊఫమని ఊదివేయగా రామరత్నం కేవలం నిప్పుగా మిగిలిపోయాడు!

రామరత్నంలో ఈడుకుమించిన తెలివితేటలు! ఏ ముహూర్తాన అతడికి కాలేజీ చదువులు నిస్సారంగా, నిరర్థకంగా గోచరించాయో నాకు తెలియదు. ఆ క్షణాన్నే అతడు పాఠ్యగ్రంధాలన్నిటినీ కట్టగట్టి ఓ మూల పారవేశాడు. ఆ తరువాత అతడి పుస్తకాల అల్మారాలోకి మరోరకం సాహిత్యం దిగుమతి కాసాగింది. ఆ మధ్య శృంగారాన్ని సరసమైన ధరకు ప్రచారంచేస్తూ కొన్ని పత్రికలు వచ్చాయి. తాళపత్రాల్ని శోధించి గొప్ప ‘థీసిస్’ వ్రాయదలచుకున్న యూనివర్సిటీ లెక్చరరు కుండవలసిన దీక్ష రామరత్నానికి ఆ పత్రికలు చదవడంలో పట్టుబడింది!

ఓ రోజు సాయంత్రం రుక్మిణిని వీధివైపు గదిలోకి తీసుకెళ్ళి “నేను చెప్పలేదనుకోవు రుక్మిణీ! నీ అల్లుడు చెడిపోతున్నాడు” అన్నాను.

“ఏమిటి మరీ చాదస్తపువాలకమండీ! పుస్తకాలు చదివితేనే చెడిపోతారా ఎవరైనా!” అంటూ రుక్మిణి ఆశ్చర్యం వెలిబుచ్చింది.

“సరేలే! రామరత్నం లాంటివాళ్ళు యిలాటి పుస్తకాల్ని చదవకపోయినా చెడిపోగలరనా నీ వుద్దేశం?” అన్నాను. రుక్మిణికర్థంకాలేదు. కానీ ఆమెకు నేను అర్థం విడమరచి చెప్పవలసిన అవసరం లేకపోయింది. పదిరోజుల తర్వాత, ఓరోజు సాయంత్రంపూట కాఫీ కలుపుతూవుండి, ఉన్నట్టుండి తలపైకెత్తి రుక్మిణి “ఏమండీ! ఆ అబ్బాయి వాటం నాకూ ఏమాత్రం నచ్చటంలేదు. మనకెందుకని చూసీ చూడనట్లు ఊరుకుంటున్నాను” అంది.


“ఊరుకోక మనమేంచేయాలో తెలియడంలేదు రుక్మిణీ!” అన్నాను. అతనేం చేస్తున్నాడో నాకూ చూచాయగా తెలుసు. కాలేజీ ఎలక్షన్లలో పోటీచేసి రెండు నెలలపాటు పట్టణమంతా చెడతిరిగాడు. ఆ ఎన్నికల్లో కలిగిన ఓటమిని మరచిపోవడానికని పోయినవెల హంపీ శిధిలాలు చూచి వచ్చాడు. బాగా డ్రెస్ చేసుకుని, ఒక పుస్తకం చేతబట్టుకుని తొమ్మిది గంటలకల్లా వీధిలోకి వెళ్తాడు. మళ్లీ పదకొండుకే గదిలో వుంటాడు. దాదాపు వారానికి నాలుగైదుసార్లు సినిమా చూడకపోతే బ్రతకలేడు. కానీ రుక్మిణికి ఈ కుర్రాడి వాటం నచ్చకపోవడానికి యిదే గాక, మరోక ప్రత్యేక కారణం కూడా వుందని మాత్రం నా కప్పటికి తెలియదు!

“ఆ మాట నే నెందుకు చెప్పాలిగానీ మీరీరోజు షికారు వెళ్లకుండా యింటిదగ్గరే వుండండి. మీకే తెలుస్తుంది” అంది రుక్మిణి కాఫీగ్లాసు చేతి కందిస్తూ.

నిజమే! రామరత్నం అత్యద్భుతమైన వ్యవహారాన్ని ప్రారంభించి వున్నాడు. అతడు డాబాపైన వున్నాడన్న విషయం ఎదిరింటి రాజశేఖరంగారి అమ్మాయికెలా తెలుస్తుందోగానీ ఆమె అటువైపు డాబాపైకి వచ్చేస్తుంది. డాబాపైన ఆ కౌముదీ విహారాలకు అంతూ పొంతూ కనపడ్డంలేదు. ఆ రాత్రి పదిగంటలకుగానీ రామరత్నం క్రిందికి దిగి రాలేకపోయాడు. వచ్చినవాడు లోపల పడుకున్న మాకు వినిపించదన్న ధీమాతో కాబోలు దేవదాసులా, సలీములా, ఖయస్‌లా విరహగీతాలు పాడుకుంటున్నాడు.

“విరహం చాలా పాపిష్టిది! అది మనిషిని పిల్చి పిప్పిచేస్తుంది” అని రుక్మిణికి వివరించబోయాను! ఆవిడ మగతనిద్దురలో ‘ఊఁ ఊఁహూ’ అని, ఆ సంగతి తనకేం పట్టనట్టు నిద్రపోసాగింది.

ఎదురింటి రాజశేఖరంగారి అమ్మాయి కింకా పదహారేళ్లు నిండలేదు. —



అమ్మాయి పేరు సంగ్రహంగా లత. నాగలతో, స్వర్ణలతో, ప్రేమలతో రుక్మిణి నడిగితే తెలుస్తుంది. ఏ లతైనా, వనితా, లతా ఆశ్రయం లేకుండా శోభించవు గాబట్టి ఆ అమ్మాయి ఎదురింటి అబ్బాయిచేత ఆక ర్షింపబడడంలో ఆశ్చర్యము లేదు. కానీ సర్వదా ప్రేమికుల ఆగ్రహానికిమాత్రమే నోచుకున్న ఈ సంఘంమాటేమిటి? ఈ ప్రణయ వృత్తాంతం రాజశేఖరంగారి కెంత వరకూ రుచిస్తుంది? అప్పోసప్పో చేసి కుమా రుణ్ని చదివిస్తున్న వరసయ్యమీద యీ ప్రణయగాథ యొక్క ప్రభావం ఎలా వుం టుంది?

రాజశేఖరంగారు ఖండితవాది. ఆయనలో తన సంతానంపట్ల మమకారం యెంత యెక్కువో, తనమాట నెగ్గాలన్న పంతమూ అంత ఎక్కువే! చేసింది గవర్మెంటు నౌఖరీ కావడంవల్ల సూటిగా మాటాడ్డమూ, అభి ప్రాయభేదం కలిగినప్పుడు యెదుటి వాణ్ని ఘాటుగా విమర్శించడమూ ఆయన రక్తంలో జీర్ణించిపోయిన గుణాలు. రాజశేఖరంగారి సంగతలా ఉండగా, ఆయనకు వస్తాదుల్లాటి కుమారులు నలుగురున్నారు. గోటితో పోయే వ్యవహారాన్నయినా, బాహుబలంతో పరి ష్కరించుకోవడం వాళ్ళ పద్ధతి! కొంపదీసి వాళ్ళు నలుగురూ కలసి ఈ రామరత్నంపైన బడితే వీడి గతేంకావాలి?

కానీ ఆ చల్లటి రాత్రివేళ, అనాగత పరిణామాన్ని గురించి నా మనసులో లీలగా ఏర్పడిన ఈ అనుమానం, తరువాత కొద్ది రోజులకు వీధిలో నలుగురూ గుమిగూడి ఆనందించడానికి వీలుగా ఒక యదార్థదృశ్య ముగా మారగలదని మాత్రం నేననుకోలేదు.

కానీ అది అలా జరిగింది!

సంధ్యాసమయం. నేను స్కూలునుంచి ఇంటికి వస్తున్నాను. రాజశేఖరంగారి కుమా రులు నలుగురూ చొక్కా చేతులు పైకి తీసు కొని వీధిలో నిలబడి రామరత్నాన్ని పిలుస్తు న్నారు.

"ఎందుకండీ! అతడితో మీ కేంపనితగి లింది?" అన్నాను.

"ఏంలేదు. ఒక చేయి చూడాలనివుంది" అన్నాడు కుమారచతుష్టయంలో ఒక్కడు.

వాళ్ళకు నచ్చచెప్పి, అక్కడినుంచీ పంపి వేసేలోపల నాకూ, మరికొందరు పెద్దమనుషు లకూ తలప్రాణం తోకకు వచ్చింది. అప్పటికీ ఒక షరతుపెట్టిగానీ వాళ్ళు వెళ్ళలేదు. మరు నాటి వుదయంనుంచీ రామరత్నం వాళ్ళ కళ్ళకు కనిపించగూడదు! అలా కనిపిస్తే వాడి చేతులకూ, కాళ్ళకూ వాళ్ళు జనాబుదారీ కారు!

భగవంతుడిచ్చిన కాళ్ళు చేతులు హూనం కావడం రామరత్నానికిష్టంలేదు. అతడు గదిలోనుంచి ఎప్పుడు బయటికి వెళ్ళి పోయాడోగానీ, నాలుగైదు రోజులు గడి చినా యింటికి తిరిగిరాలేదు. పీడ విరగడయిం దని రుక్మిణీ, నేనూ సంతోషించాము. కానీ అయిదోరోజు తెల్లవారేసరికి ఎదురింటి రాజ శేఖరంగారి అమ్మాయి యింట్లో కనిపించడం లేదని తెలిసినప్పుడుమాత్రం రుక్మిణి ముక్కు మీద వ్రేలేసుకుని కాసేపు విచారించకుండా వుండలేకపోయింది.

నాకూ విచారం కలిగినమాట నిజమే! రామరత్నం తన జీవితంలో నేర్చుకున్న విద్య ఒక్కటే ఒక్కటి! అది నియమోల్లంఘనం. అతడేమూ తాడు? తననే నమ్ముకున్న అమ్మాయినేంచేస్తాడు? ఇదంతా కడకు 'నాకా భంగం'గా పరిణమించదుగదా!

* * *

జండామాను వీధిలో అరవై నాలుగో నంబరు యిల్లు. అది చుట్టూ భవంతిగా కట్టిన పెంకుటిల్లు. ఆ యింటి వాలకం చూస్తుంటే అది మనుషులకు గాకుండా బల్లులూ, నల్లులూ, తేళ్ళూ, జెర్రులూ, దోమల్లాంటి ప్రాణిసముదాయానికి నివాస యోగ్యంగా ఏకరువా మయుడైన



★ ముక్కుదాడు ★

దుశ్శాసనీయుడో కట్టించినట్లు తోస్తుంది. లోపల అడుగు పెడుతుండగానే "ఎవరూ? ఎవరికోసం" అంటూ నాలుగువైపులనుంచీ నలుగురు అరిచారు. రామరత్నంకోసమని చెప్పాను. "ఐతే యిటు, యిటు" అంటూ పంపక్రౌత నాటకాల్లోలా దారి చూపించారు. గదిలోపల ప్రవేశించాను. ఓమూలగా నులకమంచంమీద పడుకునివున్న రాజశేఖరంగారి అమ్మాయి "ఎన్నిరోజుల కెన్ని రోజులకు! అలా కుర్చీలో కూచోండి. ఆయన యింతవరకూ యిక్కడే వుండి, యిప్పుడే బయటికి వెళ్ళారు" అంది.

మరెప్పుడైనా అయితే లేచి మర్యాద చేయనందుకు ఆ అమ్మాయిపైన నాకు కోపం వచ్చివుండేదేమో! ఆమె తలకు వేసుకున్న ముసుగు, గదిలోపలి ఆవాతావరణం, ప్రక్కన పాతగుడ్డలమధ్య పడుకుని పైకప్పుకేసి చూస్తున్న వేలెడంత పసినిసుగు, విషయమేమిటో నాకు విశదీకరించి చెప్పేశాయి.

"ఏమిటమ్మాయ్, పుత్రోత్సాహమా" అన్నాను.

"అదిప్పుడే ఎలా కలుగుతుంది మీరంతా వీక్షించి పొగడొద్దా?" అంటూ మెల్లగా నవ్వింది లత.

కాసేపు మౌనంగా వుండి, ఉత్కంఠను ఆపుకోలేక "తొందరపడి అడుగుతున్నందుకు మరేమీ అనుకోకమ్మాయ్! అబ్బాయి ఎలా వున్నాడు" అన్నాను.

"బాగానే వున్నారే ఆయనకేం!"

తెల్లబోయి, తెప్పరిల్లుకుని "కాదు. ఉద్యోగం, అదీ ఏమైనా చేస్తున్నాడా? లేదా అని" అంటూ సందేహం వెలిబుచ్చాను.

"ఉద్యోగం చేయకపోతే కాపురం ఎలా జరుగుతుందండీ? అదేదో ఫ్యాక్టరీలో ఆయన లెక్కలు వ్రాస్తున్నారు. నేనూ ఈమధ్య కుట్టుపని నేర్చుకున్నాను. నాలుగైదు నెలలుగా ఓపిక లేక నేను మిషనుపైన కూచోవడంలేదు. ఆయనే ఎలాగో కాపురం నెట్టుకొస్తున్నారు."

"నిజంగానా అమ్మాయ్! రామరత్నంలో యిలాంటిమార్పు వచ్చిందంటే నమ్మశక్యంగా లేదు."

"ఎల్లకాలమూ ఒకేరీతిగా జరుగుతుందండీ?" అందిలత.

"బాగానేవుంది. మీ కాపురాన్ని చూస్తుంటే నాకెంతో ఆనందం కలుగుతోంది. కానీ ఒకటే అతి..." అర్థోక్తిలో ఆగిపోయాను.

"నిజమే! నేను మావాళ్ళకీ, ఆయన తనవాళ్ళకీ దూరంగా బ్రతుకుతున్నాము. ఈ వేరుబందరాల్ని ఎవరు సర్దుతారు మాష్టరుగారూ!"

"అన్నీ ఈ వేళే సర్దుకోవాలమ్మాయ్! అబ్బాయిని ఒకదోవలోకి తెచ్చిందెవరు? తల్లి, తండ్రి, గురువుచేయలేనిపని నువ్వు చేశావు. ఒకవేళ మీనాన్నగారికి నీమీద కోపంవున్నప్పటికీ నరసయ్యకుండటంలో న్యాయంలేదంటాను... ఇంతకూ అబ్బాయి ఎవరిపోలిక" అంటూ పైకిలేచాను.

లత ఉన్నట్టుండి లేచి కూచుంటూ "మాష్టరుగారూ! మీకు పుణ్యముంటుంది. ఆయన నామాటవింటారో, వినరో సందేహంగావుంది. మీరు నాకోసం ఒకపనిచేసి పెట్టాలి" అంది.

"ఏమిటో చెప్పు" అన్నాను.

"సరాసరి యిక్కడనుంచీ పోష్టాఫీసుకు వెళ్ళండి."

"వెళ్తాను"

"రెండు కార్డులు కొనండి"

"కొంటాను"

"రెండు ముక్కలు వ్రాయండి. ఎక్కువ అవసరం లేదు"

"సరే సరే! అర్థమైందమ్మాయ్" అన్నాను నవ్వుతూ!

* * *

రెండు ఉత్తరాల్లో ఒకటి రాజశేఖరంగారికీ, మరొకటి నరసయ్యకు పోస్టుచేశానని ప్రత్యేకించి చెప్పవలసిన అవసరంలేదనుకుంటాను. ఐతే నేను వాటిల్లో ఏదో గొప్ప చిదంబర రహస్యం వ్రాసివుంటానని మాత్రం ఎవ్వరూ అనుకోగూడదు!

ఎందుకైనా మంచిది. ముచ్చటైన ఆ మూడు వాక్యాల్నీ క్రింద ఉదహరించేస్తున్నాను.

"మీకు మనవడు పుట్టాడు. ఏం వారా లేదు. ముక్కూ, మొగమూ అంతా మీ పోలికే! ★





మమత

నిజానికి మా పెద్దబ్బాయి దారి వేరు. నీళ్ళు పోసి అన్నంపెట్టి అవతలకు పంపిస్తే వాడి ఆటలేమో, చదువేమో తప్ప వాడితో ఇక పేచీ ఉండదు. కాని చిన్నబ్బాయితో ముంప తెగిపోతుంది. వాళ్ళనాన్నగారు ఆఫీసుకు పోకుండా ఇంట్లో ఉన్నంతసేపూ కుక్కినపేనులా ఉంటాడు గాని, వారవతలకు పోతే సరి కుబుసము విప్పి రేగుతాడు. మరీ వాడడిగే ప్రశ్నలకు జవాబివ్వటం కూడా కష్టమే అవుతున్నది. ప్రొద్దుకూకేవరికి ఒకలక్ష ప్రశ్నలు. పైగా ఒక్క నిమిషం ఊర్కోడు. మాటిమాటికీ ఆ పిల్లిపిల్లల దగ్గరకు పోతాడు. తోకపట్టుకుని గుంజుతాడు. చెవులు పట్టుకొని పైకెత్తుతాడు. ఆ పిల్లిపిల్లలదగ్గరకు వాణ్ణి పోనీయవద్దని రోజూ వారు నామీద కసురుకోవడమే. వద్దంటే వీడు మానడు. ఎన్నడూ పల్లెత్తి కటువుగా ఒక్కమాటైనా అనని వారు—పిల్లిపిల్లలదగ్గరకు పోవడంతో—నా మీద చేయిచేసుకోవడం కూడా జరిగింది.

అయినా అదేమి చిత్రమో, ఆ పిల్లిపిల్లలు కూడా వాడు దగ్గరకుపోయి నానాహింసలు పెట్టినా, కిక్కురుమనవు. మావారు దగ్గరకు వెళ్ళితే తోకలు పైకెత్తి భయంకరంగా అరుస్తూ మెల్లగా ముందుకు వస్తాయి. వారికసలు పిల్లంటే మాచెడ్డ భయం. అందుకనే వారి కాపిల్లల విషయంలో అంత జాగ్రత్త.

ఆరోజు వారు ఆఫీసునుంచి పెందలాడే వచ్చారు. స్నేహితులతో మొదటాట సినీమాకు వెళ్లారు. పెద్దవాణ్ణి కూడా వెంట తీసుకొని వెళ్ళారు. రెండోవాడు నా చెంగుపట్టుకొని "నేనూ పోతా" అని ప్రారంభించాడు. నిదానంగా, "నాన్నగార్ని అడుగూ" అన్నాడు. అసలు రెండోవాడు సినీమాకు వెళ్లటం నాకు ఇష్టంలేదు. ఇంట్లో ఒక్కదాన్ని ఉండటం కష్టంగదూ? అందుకే "నాన్నగార్ని అడగ" మన్నాను. వాడిక మళ్ళీ నోరెత్తలేదు. వారంటే వాడికి వల్లమాలిన భయం.

చిన్నవాడికి అన్నంపెట్టి, దొడ్లో నా దగ్గర పండుకోబెట్టుకున్నాను. వెన్నెల పిండారబోస్తున్నట్టుంది. అంతవరకూ వాడి పళ్లెందగ్గర పప్పూ పెరుగుముద్దలూ మింగి 'కుయ్‌కుయ్' లాగుతూన్న పిల్లిపిల్లలు కూడా మామంచం క్రింద చేరి చిందులు ప్రారంభించాయి. ఆ రెండుపిల్లల్లో ఒకటి బాగా తెలుపు. రెండోది బాగా నలుపు. నల్లదిగండు. అది అరుస్తుంటే, కొంచెం భయంగా ఉంటుంది. అదంటే మావారికి మరీ భయం, అదంటేనే మా చిన్నవాడికి మరీ ముద్దు. ఉన్నట్టుండి మావాడు నల్లపిల్లిని తెచ్చి నాకూ వాడికీ మధ్య పడుకోపెట్టాడు. తెల్లదికూడా ఒక్కదూకుతో వచ్చి మా మధ్య వాలింది. నాకు ఒళ్లు మండింది. రెండింటినీ రెండు చేతులతో మెడల దగ్గర పట్టుకొని వాకిట్లో విడిచిపెట్టి వచ్చి పండుకున్నాను.

చిన్నవాడు 'మారాం' ప్రారంభించాడు. మొండికి దిగితే వాడితో మహాకష్టం. తలుపు తీసి పిల్లుల్ని లోపలికి రానిచ్చేవరకూ ప్రాణాలు తోడాడు.

ఒక్క నిమిషం మంచంలోపిల్లుల్ని ఒళ్ళు నిమురుతూ కూర్చొన్నాడు. రెండు పిల్లుల్నీ చంకలో పొదువుకొని మెల్లగా పండుకున్నాడు. ఉన్నట్లుండి హఠాత్తుగా లేచాడు

వి. అనసూయ

అప్పుడే కునుకుపట్టిన నన్ను రెక్కపట్టి అటూ ఇటూ ఊపుతూ లేపాడు. విసుక్కుంటూ "అబ్బా పడుకోరా" అన్నాను.

"అహాఁ, అది కాదమ్మా......మొన్న మొన్నటిదాకా ఇక్కడ కనిపించేదే...ఈ పిల్లి పిల్లల తల్లి. ఇప్పుడు కనపడదేమమ్మా?" అన్నాడు.

"ఎక్కడ చచ్చిందో. పడుకోరా!" అన్నాను.

"అంత పెద్దపిల్లి, అంత బలంగా ఉంటుంది. అది చావనే చావదు. ఎక్కడకు పోయిందమ్మా?" అని నా రెక్క తెగ ఊపుతూ మొదలుపెట్టాడు మారాం. ఓమానాన వాడూరుకోడని నాకు తెలుసు. నాలుగు మాటలు చెప్పి నిద్ర పుచ్చుదామనుకొన్నాను. ఈ పిల్లుల తల్లికి సంబంధించిన కథే మొదలుపెట్టాను.

"నిజంగా, ఈ పిల్లిపిల్లల తల్లి—పుట్టిన తర్వాత పదిహేను రోజుల కనుకుంటాను, ఎంత గండం గడిచి బయటపడ్డదనీ? ఆపిల్లితల్లి బలే పౌరుషం గలది - అంటే ఈ పిల్లల అమమ్మ సంగతన్నమాట నే చెప్పేది.

"అసలు పిల్లి—పిల్లల్ని పెట్టిన తర్వాత కొన్నాళ్ళవరకూ-ఆ దాపులోకి మనుషుల్ని మెసలనీయదు. అప్పుడు దాన్ని చూడటానికే భయమేస్తుంది," అన్నాను.

"అయితే మనుషుల్లో కూడా అంతేనా అమ్మా. మొన్న అత్తయ్యకు బాబు పుట్టినే అత్తయ్యను చూస్తే నాకు భయం పుట్టలేదేం?" అన్నాడు.

"మనుషుల సంగతి వేరు నాయనా. పిల్లలకు కాళ్లు వచ్చిందాకా తల్లిపిల్లి చాలా జాగ్రత్తగా ఉంటుంది. ఇంతకూ ఈ పిల్లి పిల్లల అమ్మమ్మ సంగతికదూ......అది మన దొడ్లోనే రెండు పిల్లల్ని పెట్టింది. అప్పుడు మన యిల్లు ఇప్పటికిమల్లే డాబా కాదు. పూరిల్లు. చుట్టూతా కాకరపాదులు, గుమ్మడితీగలు, సొరతీగలు, పూలమొక్కలు నిండుగా అందంగా ఉండేవి. ఇదుగో ఇప్పుడా స్నానాలదొడ్డి ఉన్నచోట పెద్ద మఱ్ఱిచెట్టు కూడా ఉండేది. దాని మొదట్లో ఒక పాముపుట్ట ఉండేది. అందులో ఒక త్రాచుపాము కూడా ఉండేది. అప్పుడు మన దొడ్లో మంచి మల్లెపూలు పూచేవి. ఆ మల్లె వాసనలకు వెన్నెలరాత్రుల్లో త్రాచుపాము జరాజరా వచ్చి పడగవిప్పి నాట్యంతొక్కేదట!"

మా చిన్నవాడు అంతవరకూ పిల్లిపిల్లల వళ్లు నిమురుతూ కూర్చున్నవాడల్లా వాటిని వదిలిపెట్టి నాకుదగ్గరగా వచ్చాడు: "అమ్మా, పిల్లిసంగతి మానేసి, పాము సంగతి చెబుతావేమే!" అన్నాడు.

"అదే చెప్తున్నా రా బాబూ," అంటూ అందుకున్నాను.

"అదెంత ధైర్యంగల పిల్లనీ! ఒక రోజున దాని పిల్లల్ని కొఱకడానికి గండుబిల్లి వస్తే.. నిజంగా ఆరోజున దానిఉమ్రను చూడాలి. రెండు చెవులూ రిక్కించి, తోక పైకెత్తి, వెంట్రుకలు నిక్కబొడిచి, చెవులు గింగురుమనేట్లుగా అరుస్తూ ఆ గండుపిల్లిని తరిమికొట్టింది! వెంటనే వచ్చి పిల్లలకు పాలిస్తూ పండుకొంది.

"ఆ పిల్లలు దానిఒంటిమీద కెక్కి దూకుతున్నా ఊరుకుంటుంది. ఒళ్లంతా నాకుతూ వాటిని ముద్దుగా చూచుకునేది. అవంటే దాని కెంత ప్రేమనీ! మనుషుల మాదిరే అవి కూడా ఎంతో ప్రేమగా ఉంటై."

"అయితే అమ్మా, ఎంతసేపటికీ తల్లి సంగతే చెబుతావు, వాటి నాన్న సంగతి చెప్పవే?" అన్నాడు.

నాకు సమాధానం చెప్పడం కొంచెం

★ మమత ★

కష్టమైంది. చెప్పకపోతే వాడూరుకోడు. "నాన్న వుంటాడు బాబూ, అయితే నాన్న పిల్లలనుగాని పిల్లలు నాన్ననుగాని గుర్తించలేవు" అన్నాను.

"అదేమిటమ్మా, నాన్నా, మనమూ ఒకళ్లనొకళ్లం గుర్తుపట్టడంలా?" అన్నాడు.

"ప్రతిదానికి మనుషుల పోలిక తేబోకురా నాయనా! మనుషులు వేరు పిల్లులు వేరు," అన్నాను.

"మనుషుల మాదిరే ప్రేమగా ఉంటా" యనిఅంటే అడిగానులేవే అమ్మా, కోప్పడతావేం?" అన్నాడు వాడు.

"ఒకరోజున మీ నాన్నగారు గుమ్మడితీగపక్కగా కూర్చొని గుమ్మడికాయ కోస్తూఉంటే ఆ పక్కనే పిల్లి పిల్లలు కూడా ఉన్నాయి గామాలె......ఎక్కడినుంచి చూచిందో తల్లి, గబగబా పరుగెత్తుకుంటూ వచ్చి మీ నాన్నగారి ఎడంచేతిమీద పంజావిప్పి కొట్టి కొరకబోయింది. నాన్నగారు పరుగెత్తుకుంటూ లోపలికి వచ్చారు. అప్పటికి నీవింకా పుట్టలేదు బాబూ! అన్నాయికి నీకుమల్లే ఐదోయేడు."

"అప్పుడేమయిందమ్మా?" అన్నాడు వాడు.

"ఏమయిందీ పెద్ద గంటుపడ్డది. ఇప్పటికీ ఉంది చూడలా?"

"చూచా, అయితే అమ్మా ఈ పిల్లల్ని ఈనినప్పుడు నేను దగ్గరకు పోయినాగదా, తల్లిపిల్లి నన్నేమీ చేయలేదేం?"

"నిన్ను సరిగా చూచిఉండదులే...... అసలు కథ చెప్పనీయకుండా అడ్డుప్రశ్నలు వేస్తావేం?... అన్నయ్యకు ఐదేళ్లప్పుడు, ఒకసారి అత్తయ్యగారూరు పోయి తిరిగి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. అప్పుడు కూడా ఇట్లాగే హాయిగా వెన్నెల కాస్తూంది. నాన్నగారు అన్నయ్య నెత్తుకుని ఉన్నారు. బైట తలుపు తాళం తీయడానికి అన్నాయిని నాచేతికిచ్చారు. నాన్నగారు తలుపుతాళం గబగబా తీసి లోపలి గడపమీద అడుగుపెట్టేరు. గభాలున "అమ్మో" అని ఒక కేక పెట్టి వెనక్కు ఒక్కదూకు దూకారు! మెల్లగా తలుపులు రెండూ దగ్గరకు లాగి నన్ను దగ్గరకుపిల్చి "నిదానంగా సందులోనుంచీ చూడూ" అన్నారు. నాకళ్లు బైర్లుగమ్మాయి! నా కాళ్లూ చేతులూ వణికిపోయాయి! ఒళ్ళంతా చెమటలు గ్రమ్మాయి!"

"అబ్బా, ఏం జరిగిందో చెప్పవే..."

"తోకమీద నిలిచి, నేలమీద గజం ఎత్తున లేచి పడగవిప్పి పెద్దగా బుసలుకొడుతూ పాము కనిపించింది. బహుశా మనదొడ్లో పుట్టలో త్రాచే నేమో ఇంకా చిత్రం చూడూ, ఆ పాముకెదురుగా చెవులు రిక్కించి, తోక వెంట్రుకలు నిక్కించి గుండెలు పగిలేటట్లు అరుస్తూ వెనుక కాళ్ళమీదలేచి ఈనిన పిల్లి పాము పడగ మీదకు దూకింది. మీ నాన్నగారు "అబ్బాయిని తీసుకొని అవతలకు పద"మని తను తలుపుసందుగుండా చూడ మొదలుపెట్టారు. ఒక ప్రక్క గుండెల్లో భయంగా ఉన్నా, పామూ - పిల్లీ చేస్తున్న యుద్ధం చూడాలని బుద్ధిపుట్టింది."

"అబ్బా, చెప్పవే" అబ్బాయి విసుక్కున్నాడు.

"అరెరెరే, ఏమిచిత్రం! అంత ఎత్తున లేచినపాము ఒక్కసారి భలే విసురుగా పిల్లి తలమీద తక్కువ కాటువేసింది. పిల్లికి పౌరుషంరేగింది. గోంగ్రుమని ఒక్క అరుపు అరిచి, ఒక్కదూకు దూకి, పాము పడుము పట్టుకొని నోటితో కొరక మొదలుపెట్టింది. త్రాచు సర్రున ముందుకుజారి పిల్లి దవడకేసి పడగతో ఒక్కదెబ్బకొట్టింది. పిల్లి రెండడుగులు వెనక్కు వేసింది. ఈసారి త్రాచు తారాజువ్వలా లేచింది. సరిగా పిల్లితలమీద కోర గుచ్చుకుపోయేలా మరొక్క దెబ్బ కొట్టింది, తక్కువన్న మోతకూడా వినిపించింది. పిల్లి పెద్దగా అరిచి బాగా వెనక్కు వచ్చింది. పాముకూడా తోకమీదగా జరిగి ముందుకు రా మొదలుపెట్టింది. మీ నాన్నగారు నా రెక్క పట్టుకొని నాలుగడుగులు వెనక్కు లాగారు.

వెనక్కువచ్చిన పిల్లి చివాలున పైకిలేచి పాము మెడ పడగ క్రిందగా నోటితో పట్టింది. పాము తటాలున క్రిందకుజారి మెరుపుతీగలా అటూ ఇటూ కదులూ పైకిలేచింది. పాము కళ్ళల్లోకి చూస్తూ పిల్లీ, పిల్లికళ్లలోకి చూస్తూ పామూ చెడుగుడులాడినట్లు కదిలాడాయి. ఉన్నట్టుండి పాము పిల్లిమెడమీద నెత్తురు కారేలాగు ఒక్కదెబ్బ కొట్టింది. పిల్లికళ్లు నిప్పురవ్వల్లా మెరిసిపోతున్నాయి. వెనకాళ్లమీద లేచి ఒక్కసారి త్రాచు పడగ లంకించుకున్నది. పిల్లి నోట్లోనుంచి పడగ లాక్కోలేక పాము తోక నేలకేసి తెగ బాదింది. పిల్లిమాత్రం పట్టువదల్లేదు. పిల్లినోటోనుంచీ నెత్తురుబొట్లు క్రిందపడుతున్నాయి. నాకళ్లు మిరుమిట్లు గొల్పాయి.

"భలే, భలే, అంతే కావాలే" అని మావాడు చప్పట్లు కొడుతూ అరిచాడు.

"ఆ తర్వాత వినూ! పామేమి చేసిందో, పిల్లిముందు రెండుకాళ్ల మధ్యనుంచీ తోకను పోనిచ్చి పొట్టచుట్టూ తాడు చుట్టినట్టుచుట్టి గట్టిగా బిగించి పారేసింది. పిల్లికి ఊపిరాడలేదు గామాలె, గభాలున నోరు తెరిచింది. పాము అంతటితో ఊరుకుందా? చిటికెగండ్లు పడ్డ పడగ విదిలించుకొని పిల్లి మెడకు కూడా గట్టిగా చుట్టకొన్నది. పిల్లి కదల్లేక మెదల్లేక నోరు తెరిచి అలాగే నిలువబడ్డది. పిల్లితలమీదగా పాము జానెడెత్తు పడగెత్తి పిల్లి మాడుమీద టపటపా బాదమొదలెట్టింది. పిల్లిపక్కకు వాలింది.

"అమ్మో, అమ్మో నాకు భయంగా ఉందే" చిన్నబ్బాయి నన్ను గట్టిగా పట్టుకున్నాడు.

"ఆ తరువాత వినూ... పిల్లి మెడచుట్టూ



పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, నీ సరియైన చర్యననుసరించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన నీకు యిష్టమగు ఒక పువ్వుము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డు వ్రాసిన తేదిలగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము పొందుటకు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన ఫోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించిచూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

పొట్టచుట్టూ చుట్టుకొన్న పాము మెల్ల మెల్లగా చుట్టలు విడిలించి, కదల్లేక కదల్లేక తలుపువైపుగా కదలి రాసాగింది.

పాము కదలివస్తుంటే మీనాన్నగారి రెక్క నేనూ, నారెక్క మీనాన్నగారూ పట్టుకొని అలాగే నోళ్లుతెరచి కదల్లేక నిలబడిపోయాం. ఎందుకో కాళ్లు కదిలించబోయినా కదల్లేదు.

"తర్వాతేమైందీ?...గజగజ వణుకుతూనే వాడు నన్నడిగాడు.

"పక్కకు పాముకసిల్లి పడిపోయిందనుకున్నాదూ...పిల్లి గభాలున ఒక్కదూకు దూకి పాముపడగ నోటితోపట్టి నడుము మీదా, తోకమీదా కాళ్ళుపెట్టి అణిచిపెట్టింది. ఇక పాము కదల్లేకపోయింది. ఇక చూడూ, పిల్లి పాము పడగంతా ఒళ్ళంతా గుడ్డ పీలికలు చించినట్లు చించేసి అటూ ఇటూ విసిరి పారేసింది.

మీ నాన్నగారు సంతోషం పట్టలేక వింతగా ఓ అరుపు అరిచారు. ఏమైనా పిల్లి ఇంట్లో ఉండాల్సిందే అన్నారు, నావీపు తట్టి.

"అతర్వాత ఏమైందే?" అని చిన్నవాడు విసుగుపడ్డాడు.

"ఏమైందీ యుద్ధంలో ఎంతోమందిని చంపి అలిసిపోయి ఠీవిగా ఆనందంగా, తీరుబడిగా కూర్చున్న గొప్ప వీరుడిలాగా పిల్లి-వెనక కాళ్లమీద కూర్చొని ముందుకాళ్లు ఆసరాగా నిలిపి అటూఇటూ ఒక్కసారి చూచింది.

దూరంగా బీరపాదుక్రిందగా పిల్లికూన ఒకటి కుయ్‌కుయ్ మంటూంది. పెద్దపిల్లి కూనదగ్గరకు నడవలేక నడవలేక పోయింది. పిల్లికూన తల్లిదగ్గర పాలుతాగ పోయింది. ఒళ్లంతా గంటుపడి నెత్తురు చిమ్ముతూంది. కూన పాదుకు ముట్టలేదు. కూన వొళ్ళంతా తల్లి తన కాళ్ళతో నిమురుతూ లాలనగా పరున్నది.

నేనూ, మీ నాన్నగారూ ఇంకా వాకిట్లోనే ఉండి చూస్తున్నాం. ఇంతలోకే మనపక్కింటి వెంకయ్యబాబాయి "ఏమిట్రా అరగంటనుంచీ చూస్తున్నా నులోపలికి పోరూ, బైటకూరారూ ఊరికే తొక్కిట్లాడతారు?" అంటూ వచ్చాడు.

"ఆ ఏమిలా" అంటూ జరిగిన కథంతా చెప్పి మీనాన్న వెంకయ్యబాబాయితో లోపల కడుగుబెట్టారు.

"ఓస్, ఇంతేగదా, పోయే పాము పోకుండా పిల్లికూనల మీదకు ఎగబడ్డదేమో. తల్లి ఊరుకుంటుందా? చీల్చిపారేసిఉంటుంది. చిత్రం చూస్తూ నిలబడ్డారా, అదిలిస్తే పొయ్యేదిగాదూ? ఓరి మీ ఇల్లు బంగారుగానూ, పోయి పడుకోండి" అంటూ వెంకయ్య అవతలకు పోబోయ్యాడు.

"కాస్తా ఈ రాత్రి కిక్కడే ఉండండీ" అని నేనే అనబోతూ ఉండగా, మీ నాన్నగారే అన్నారు వెంకయ్యతో ఆ మాట.

వెంకయ్య నవ్వుతూనే బీరపాదు పక్కన చుట్ట కాలుస్తూ, పైపంచ పరుచుకొని కూర్చొన్నాడు.

ఒక్కనిమిషం ఆగి వెంకయ్య పెద్దగా కేకపెట్టి, "ఏమర్రోయ్ చూచారా నేను, చెప్పలా, అదుగో ఒకకూనను త్రాచు కాటు వేసింది. ఒకటే బ్రతికిఉంది. ఒకటి చచ్చిపడి ఉంది. అందుకనే తల్లి పాముమీద మళ్లబడి ఉంటుంది. ఆహాహా!... ఏమి సృష్టయ్యా!! విధవ పిల్లికి కూడా పిల్లలమీద ఎంత మమత?" అంటూ అక్కడే ఆవులిస్తూ నిద్రపోయాడు.

"ఇట్లా ఇవతలకన్నా వచ్చి పడుకో బాబాయ్" అని నే నంటున్నా...అట్లాగే పండుకొని ఒక్కనిమిషంలో గుఱక మొదలు పెట్టాడు.

"అయితే అమ్మా, అప్పుడు బతికివున్న కూన...ఇప్పుడీ రెండు కూనలకూ ఏమవుతుందే?" అన్నాడు చిన్నబ్బాయి.

"కనుక్కో" అన్నాను నేను.

"ఓస్, ఇంతేనా? అమ్మబోతుంది. ఆఁ.... అవునే నేను దాన్నిగూర్చే నిన్నడిగింది. నిన్న మొన్నటిదాకా ఇక్కడే కనిపించిందే ఇప్పుడేమైంది?"

"అదేరా బాబూ వెంకయ్య బాబాయ్ చెప్తున్నాడు నిన్న పొద్దున...నీళ్లు తోడుతుంటే బావిలో ఓ పిల్లిశవం తేలిందట. తీసి బైటపారేశారట. బహుశా వీటి తల్లేమో!" అన్నాను.

"అమ్మా, పిల్లిపిల్లలకు అన్నం ముద్దలు పెడితే నాన్నగారు కోప్పడి కొట్టబోతారే- తల్లి చచ్చిపోయిందిగదా ఈ పిల్లలకు పాలెట్లాగమ్మా, చచ్చిపోవూ? అంటూ వాటిని తనదగ్గరగా లాక్కొని దుప్పటికప్పుతున్నాడు.

"మా బంగారు తండ్రి మనస్సు ఎంత మెత్తనిది!" అంటూ మెల్లగా కునుకు తీస్తున్న చిన్నబ్బాయితల ముద్దుపెట్టుకున్నాను.

"ఇదుగో! తలుపు" అంటూ బయటినుంచి మావారి గొంతుఖంగున మ్రోగింది. గడియతీయడానికి మెల్లగా లేచి ఇవతలకొచ్చాను. ★


గొంతు నొప్పి
శమనానికి
పెప్స్‌ను సేవించుడు

గొంతునొప్పి, దగ్గులు, జలుబులు, ఇన్‌ఫ్లుయెంజ మరియు రొమ్ముపడిసెముకు దారి తీస్తుంది— మీరు తక్షణం పెప్స్‌ను సేవించకపోతే. పెప్స్‌లోని శమనకర, అంటు విరోధక ఔషధ సారములు, గుండెలు ఊపిరితిత్తులలోకి లోతుగా పొచ్చి, కఫమును వెలువడజేసి మంటతో గూడిన వాపును శమనపర్చును. డాక్టర్లు పెప్స్‌ను సిఫారసుచేసియున్నారు, హానికర ఓషధులు ఇందు లేవు.



PEPS

పెప్స్ గొంతు మరియు గుండెం అంటు విరోధక బిళ్లలు

PPY-40-TEL

సోల్ ఏజెంట్లు : దాదా & కంపెనీ, 86, సైనప్పన్‌నాయకన్‌వీధి, మద్రాసు.



మరియు హైదరాబాదు.

అధైర్యపడవద్దు


శాస్త్రీయమైన, నిజమైన SEX— ADVICE పొందవచ్చును. మీకు ఉండుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టర్ రత్నంసన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్స్, హైద్రాబాద్ - 2.
(దక్కన్)

అసంప్రేక్ష్యకారిత్వము... పంచతంత్రము ...అయిదవ భాగము

దాని పలుకుల నాదరింపక భళ్ళున
వానరమ్ములు పొట్టపగులగ నవ్వెను





'చేటుకాలము వచ్చెనో' కని కోతియు
కోట వీడి యరణ్యమార్గము పట్టెను



కొన్ని నాళ్ళది అడవిలో నటులుండగ
విన్నదాక నాడాత్మ దారుణ వార్తను



తాను చెప్పిన దెల్ల జరిగెను। కోటలో
వానరమ్ములు వంశనాశన మాయెను!



రాజుపై పగ తీర్చుకోవలె నంచును
రాజుకున్నది కోతి ఎదలో ద్వేషము




గేయరచన
నండూరి. రామమోహనరావు
బొమ్మలు.. బాపు
అంత నాకనాడమిత దాహము గొన్నదై
ఎంత వెదకగ చెరువు చెంత కు చేరెను.
చెరువు లోనికి పోవు జాడలు పోతెడు!
మరలి వచ్చెడి జాడ తోకనుపింపవు!
'గట్టిచిక్కే' ననుచు వానర మప్పుడు
గట్టునే నిలుచుండి నీటిని గ్రోలెను
తోడనే జలమధ్యమందొక రక్కసి
తాడి ఎత్తున తోచి నిలచెను వింతగ
అక్కజంపడి 'ఎవరునే' వని కోతియు
రక్కసిని ప్రశ్నింపగా నది ఇట్లనె
నీట నడుగిడు వాని మ్రింగుట నాపని
దాటిపోయిన దాక్క నవే నేటికి!
32

డైరీలో రాధ

గరిమెళ్ల
వెంకటసీతారాం

[illegible]

అప్పుడే భోజనం అయింది. పెరట్లో చెయ్యి కడుక్కొంటూంటే వెనకాలే కాంతం వొచ్చి,

'కిళ్లీ కట్టి టేబుల్ మీద పెట్టేను. తీసుకోండి' అని చెప్పింది.

'సరేలే' అని తువ్వాలతో చెయ్యి తుడుచుకొని గదిలో ప్రవేశించేసరికి మళ్లా కాంతం హాజరు.

'ఇదుగో ఆ పార్కరు పెన్నులో ఇంకు పోసి కోటుజేబులో పెట్టేను సూక్రి పెన్సిల్ చొక్కాజేబుకు తగిలించి రుమాలేమో పాంటుజేబులో ఉంచేను. చూసుకోండి.

'అలాగేలే'

'ఇవాళ మంగళవారం కదూ. ఆ షేక్స్పియర్, షెల్లీ, సెకిల్ కాలేజీకి కట్టేను. ఆ రెండు చాలా, లేక యింకేమైనా కట్టాలా' అని కాంతం ప్రశ్న.

నేను కాలేజీకి బయలుదేరేవరకు నన్ను అంటిపెట్టుకొని నా క్కావాలసిన ప్రతి చిన్నపని చేసిపెట్టుంది, మా కాంతం కాలేజీలో ఏరోజు ఏ పాఠాలు చెప్పాలో నా టైమ్‌టేబుల్ అంతా మా కాంతానికి కంఠస్థం.

'ఆ ఇద్దరిని కట్టేశావు కదూ చాలులే.'

'ఫ్లాస్కు మూడుకప్పులు కాఫీ పట్టింది. మీకు సెకండు, ఫోర్తు పీరియడ్స్ కదూ వర్కు. ఆ రెండుసార్లకు రెండు కప్పులు పోగా మిగతా కప్పు ఎవరికైనా దానం చేసెయ్యండి.'

'క్లాసుకి పోయేముందర వేడి వేడి కాఫీ ఇంజనులో పోస్తేనేగాని బండి హుషారుగా నడవదని మా కాంతం అభిప్రాయం.

'ఇదంతా సరేకాని ..యిదుగో ఓమాట.'

'ఏమిటో వేగంగా తెముల్చండి. అవతల అంట్లూ, ఎంగిళ్లు తీసి అంతా సవరించుకోవాలి.'

'మరేంలేదు. నిన్న వ్రాసిన కథ ఫెయిర్ చేసి ఆంధ్రపత్రికకు పోష్టు చేసెయ్యి."

నేను కాలేజీలో లెక్చరర్‌గా చేరకముందు నుంచి కథలు వ్రాయడం, పత్రికలకు పంపడం నాకు హాబీ. ఆ హాబీ క్రమేణా అలవాటుగా మారి, ఆ అలవాటు ఆఖరుకు అభ్యాసమై వొదుల్చుకోలేని వ్యాపారంగా తాదుమాత్రై కూర్చుంది.

'వ్యాపారం అని ఎందుకన్నానంటే వ్యాపారంలోలాగ దీనిలో పెట్టుబడులు, లాభ నష్టాలు లేకపోయినప్పటికి దానిలో ఉండే కలిపివేతలు, కొట్టివేతలు, అందనాలు, ఆశ్రయించడాలు బుర్రలోకట్టుపెట్టి పేరు గడించడం మొదలైనవన్నీ ఇందులో కూడా ఉన్నాయి.

నా యీ వ్యాపారంలో సహాయ కార్యదర్శిని మా కాంతం.

అంచేతనే యిప్పుడీ కథ ఫెయిల్ చేసి పోష్టుచేయించమని మా ఆవిడకు పురమాయించడమైనది.

'అలాగేలెండి' అని కాంతం వంటింట్లోకి వెళ్ళింది.

నేనేమో సైకిల్ తీసుకొని కాలేజీకి బయదేరేను. కాలేజీ గేటుదగ్గిరికి వచ్చేవరకు కాంతాన్ని గురించే ఆలోచిస్తున్నాను.

ప్రాణంఅయినాసరే అర్పించేందుకు వెనకాడదు. దాసీది ఉన్నా ఇంటిపనంతా తనే పూనుకొని చేస్తుంది. అనవసరంగా యీ కథలుగూడ కాంతంచేతనే వ్రాయిస్తున్నా ఏం బాధపడుతున్నదో.

సాయంకాలం కాలేజీనుండి యింటికి వచ్చేశాను. డ్రస్ మార్చుకొంటూ

'ఏమైనా వుత్తరాలు వొచ్చాయా' అని అడిగాను.

'ఆ...మూడు ఉత్తరాలొచ్చేయి. షెడ్‌లో పెట్టేను'.

నాకువొచ్చిన వుత్తరాలన్నీ మా ఆవిడే చింపి సార్టుచేసి రెడీగా ఉంచుతుంది నే వొచ్చేసరికి. ఒకొక్కప్పుడు జవాబులు కూడ తనే వ్రాసిఉంచుతుంది.

షెడ్‌లో ఉత్తరాలు చూడకుండానే 'ఎక్కడనుండి వచ్చేయేమిటి' అని అడిగాను.

'ఆ "కాలవాహిని" ఎడిటర్ మీరు మొన్న పంపించిన కథ టైటిల్ మార్చి మరో కొత్త టైటిల్ యిస్తే బాగుంటుందేమోనని వ్రాశాడు. మరొకటి బెజవాడనుండి ఎవరో నాటకసమితివాళ్లు మీరు వ్రాసిన నాటకం రంగంమీద ప్రదర్శించడానికి అనుమతి అర్థిస్తూ వ్రాశారు. ఇంకొకటి మీ మిత్రుడొకాయన వ్రాశాడు. క్రిందటి వారపత్రికలోఉన్న మీ కథ అత్యద్భుతంగాఉందని పొగుడ్తూ వ్రాశాడు.'

'అంతేనా...సరే — ఉదయం చెప్పిన కథ పూర్తిచేసి పంపించేశావా?'

'పంపించేశాను. కాని పంపించేముందు కథలో ఉపసంహారం ంపించేను.'

'దుఃఖాంతాన్ని ం చేశావా?'

'అంతే.'

'మంచిపనే చేశావు ఏదో తీరుబాటు సమయంలో కాస్త ఊసుపోవటానికి చదివే చదువరులకు కళ్లంట నీళ్లు తెప్పించడం భావ్యంకాదు.'

'వాళ్లమాట దేవుడెరుగుగాని మొదట నాకే మీ కథ చదవగానె గుండె దడపట్టుకొంది. అంచేత మార్చేశాను'.

'వేగం బట్టలు మార్చుకో, సినిమాకు పోదాం' అని తొందరపెట్టేను.

ఇవాళే కాదు. రోజూ ఇదే వరస. కాలేజీలో ఉన్న క్షణాలు తప్పిస్తే అనుక్షణం నన్ను అంటిపెట్టుకొనిఉంటుంది మా కాంతం.

బూట్లు పాలిష్ చెయ్యడం, పెన్నులో ఇంకు పొయ్యడం మొదలైన ప్రతి చిన్న విషయంతో ఆరంభించి నేను ఏరోజు ఏయే బట్టలు వేసుకోవాలో, క్లాసులో ఏ రోజు ఏ పాఠం చెప్పాలో జ్ఞాపకం చెయ్యడం మొదలైన అన్ని పనులు మా కాంతం చేసిపెట్టుంది నాకు.

ఈనిత్యకృత్యాలే కాకుండా నేను పత్రికలకు పంపే కథలు ఫెయిర్ చెయ్యడం, వాటికి టైటిల్స్ తగిలించి పోస్టు చెయ్యడం, నా కాలేజీ ప్రిపరేషన్ వర్కుకు సంబంధించిన డిక్షనరీ మీనింగులు చూసిపెట్టడం, అప్పటా అప్పటా ఏమైనా డిక్టేటుచేస్తే వ్రాయడం—అన్ని పనులూ మహా ఓపిగ్గా నావద్ద కూర్చొని చేస్తుంది.

ఇన్ని పనులు నెరవేరుస్తూ కూడా సంసారాన్ని ఎలాంటి ఒడుదొడుకులు లేకుండా లాగించేస్తున్నది.

ఒడుదుడుకు లేకపోవడమే కాదు, సంసారం స్వర్గతుల్యం, ఆనందమయం చేస్తున్నదని ఇవతల ఇరుగు—అవతల పొరుగువాళ్లకు

ఈర్ష్యా అసూయలు.

మా సంసారంలో రాగళోకాలు కానీ, హింసాద్వేషాలు కాని, దారిద్ర్య దౌర్భాగ్యాలు కాని ఎక్కడా మచ్చుకైనా లేవు నేనేమీ ఉత్ప్రేక్షించి చెప్పలేదు.

కాంతం నా జీవితానికో అద్భుతశోభ, ఓ మహా సౌందర్యం తెచ్చిపెట్టింది.

లోక దాంపత్య చరిత్రలో మా దాంపత్యం ఒక ప్రత్యేక ప్రకరణము.

వెనకటికి 'సంసారం సాగరం దుఃఖం' అని అన్నారు. ఆ అన్నవాళ్ళెవరో నాకంట బడితే పనిమేర వాళ్ళని ఇంటికి తీసుకొనిపోయి కాంతం సంసారం చూపించి ఇప్పటికయినా మరేం తొందరలేదు మార్చెయ్యి ఆ సామెత, అని బోధ చేసేవాణ్ని

బహుశా ఆ సామెత ఎవరో సంసారం కిట్టని సన్యాసులు తమ స్వార్థంకోసం, 'పార్టీ ప్రోపగాండా' నిమిత్తం ఉపయోగించే నినాదం అని నా ఉద్దేశం

ఏది ఏమైనప్పటికీ కాంతం లేని సంసారం నాకు చెట్టుచేమలు లేని ఎడారి ప్రాయం,పంచదార వెయ్యడం మర్చిపోయిన పాయసం, చిలక లేని పంజరం.

ఇలా వుంటున్న సమయంలో హఠాత్తుగా అనుకోకుండా మా ఆవిడ పుట్టింటికి వెళ్ళవలసి వచ్చింది.

పదిహేను రోజులలో తిరిగి వచ్చేస్తానని వెళ్ళింది ఇక చూడండి నా అవస్థ రోజుకో యుగంలా గడిచేది. రోజులో చాలా సమయం అక్కడా అక్కడా లైబ్రరీలలోను, థియేటర్స్‌లోనూ కాలక్షేపం చేస్తూండేవాణ్ని. శరత్ బాబు వ్రాసిన కథలన్నీ పూర్తి చేసేను. కాని మాఆవిడింకా రాలేదు.

నా ఆ వేదన ఆరాటం సప్తమస్థాయిలోకి వెళ్ళేయి. బహుశా నా ఆ వేదన మహోన్నత స్థితికి పోకపోతే అదే నన్ను అధోగతిపాలు చేస్తుందేమో.

ఎలాగయితేనేం రెండు వారాలు గడిచాయి. మా ఆవిడ ఓ మంచిరోజు చూసుకొని బండి దిగింది.

'అమ్మయ్య' అనుకొన్నాను మనస్సుకు శాంతి కాళ్ళకు బలం వచ్చింది. కాంతాన్ని చూడగానే ఎక్కడికో క్రింది అంతస్థులోకి దిగజారిపోయిన గుండెకాయ తిన యథాస్థానాన్ని ఆక్రమించుకుంది. తుప్పుపట్టిన తలకాయ దానంతట అదే తుప్పుగులుపుకొని అప్పుడే నిద్రలో నుండి హఠాత్తుగా లేచిన వాడి మల్లే తను సిద్ధంగా ఉన్నానని తలపూపింది.

గబగబ భోంచేసి హుషారుగా కాలేజీకి వెళ్ళేను.

సాయంకాలం కాలేజీలో పని అయిపోగానే మళ్లా అంత హుషారుగా తిరిగి యింటికి వచ్చేను.

ఇంటికొచ్చేసరికి మా యింట్లో ఓ పెద్ద గాలి దుమారం లేచింది.

గాలేం మామూలు గాలా! కాదు. సుడిగాలి సుడి చుట్టిచుట్టి యింట్లో సామానన్నీ చిందరవందర చేసింది.

వీధిలోని ఇసకంతా ఒక్కుమ్మడి ఎవరో వెంట తరుముకొస్తే మా ఇంట్లో తలదాచుకొంది కామోసు. లేకపోతే గదినిండా యీ ఇసకంతా ఏమిటి?

టేబిల్ మీద వస్తువులన్నీ చెల్లా చెదురుగా ఉన్నాయి డ్రాయరులో వస్తువులు కూడ డైరీ, పుస్తకాలు, పెన్ను వగైరా అన్నీ చెదిరిపడి ఉన్నాయి నేను గదిలో ప్రవేశించే సరికి అవన్నీ నా వైపు దీనంగా చూస్తున్నాయి

టేబిల్ మీద టైమ్‌పీస్ కూడ భయపడి పట్టు ఉంది గుండె టక టక కొట్టుకుంటుంది.

నాకేం తోచటం లేదు. ప్రతిరోజు నేను వొచ్చేసరికి ఎదురుగా వచ్చి ఆహ్వానించే మా ఆవిడ నాకీవేళ కనబడలేదు.

వంటింట్లోకి వెళ్ళేను. ఓ మూల ముసుగు పెట్టుకొని పడుకొనిఉంది కాంతం.

'నేను వొచ్చేను' అని అన్నాను

'ఆ చూసేను' అని ముక్తసరిగా జవాబిచ్చింది.

నా అభిమానం దెబ్బతింది. వెంటనే గదిలోకి వచ్చేశాను. పనిమనిషిచేత కాఫీ, ఫలహారం పంపించింది. కాని, తను రాలేదు. మాటామంతీ లేదు.

ఆ రాత్రికూడ అంతే కారణం కాంతం చెప్పలేదు; నేను అడగలేదు.

ఎప్పుడూ నవ్వుతో నిండులాఉండే ఆమె ముఖం ఇప్పుడు కారు మేఘాలతో నిండిన ఆకాశంలా ఉంది.

నామీద ఏదో అనుమానం పట్టుకొని ఉంటుంది లేకపోతే ఊరునుంచి దిగగానే డ్రాయరు సొరుగులు అన్నీ తీసి ఇల్లా వెస్ట్ గేట్ చెయ్యడానికి కారణం ఏమిటి?

ఆ మరునాటిరోజు మధ్యాహ్నం భోజనాల సమయంలో నేనే కల్పించుకొని,


'సెలవల్లో ఓ మంచి కథ వ్రాశాను. ఫెయిర్ చేసే వాళ్ళెవరు లేక అలా పడివుంది' అని అన్నాను.

'ఏం నేనే ఉన్నానా?' అని ఎగురు ప్రశ్న వేసింది

'మరి?' అని అడిగె'

'ఏమో నాకేం తెల్సు'

హరి భగవాన్, ఇదేమిటి ఏమి ఎరగని దీనుడి జీవిత చరిత్రలో చిన్న గాలిదుమారం లేచి మహా ప్రళయం లోకి దింపేట్టుగ ఉంది, ప్రళయమే కాని ప్రారంభమైతే గాని కింకేమైనా అదుపుందా? మహా మహా వృక్షాలు సైతం వేళ్ళతో సహా పెకలింపబడతాయి. అటువంటప్పుడు యిటువంటి చిన్న సంసారాలొక లెక్కా?



★ డైరీలో రాధ ★

నాకేం తోచలేదు. వెంటనే పోస్టాఫీసుకి వెళ్లి మా అత్తగారికి ఓ టెలిగ్రాం ఇచ్చేను. వెంటనే బయలుదేరి రమ్మని.

ఆ మర్నాడు కాలేజీనుండి యింటికి రాగానే మాటలు వినపడుతున్నాయి మా అత్తగారు వచ్చినట్టుగా ఉంది.

నేను బట్టలు అవి మార్చుకొని కాఫీ తాగేక మా అత్తయ్య క్షేమ సమాచారం అడిగాను.

అందరూ క్షేమంగా ఉన్నారని చెప్పి, 'ఏం నాయనా కాంతం లేనప్పుడు మనింటికి ఎవ్వరైనా వచ్చేవారా?' అని అడిగింది.

'ఎవరొస్తారత్తయ్యా. అసలు నేను ఇంట్లో ఉంటేగా. చాలా సమయం లైబ్రరీల లోను రీడింగు రూములలోను కాలక్షేపం చేసేవాణ్ని.

'మరి తెలీకపోతే ఏం అమాయకంగా మాట్లాడుతాడు!' అని కేసంతా స్టడీచేసి తనకి తెలియనివిషయం ఏదీలేదని వాదించే ప్లీడరులాగా తన ఉద్దేశం వెలిబుచ్చింది మా కాంతం

'అది కాదబ్బాయి. కాంతం లేనప్పుడు ఎవరో రాధట యిక్కడకు వొచ్చేది అని దానికి అనుమానం'

నేను అనుకొన్నంతా అయింది. పెళ్లయిన కొత్తలో ఎవరికైనా భార్య ప్రవర్తన మీద అనుమానం కలుగుతూ ఉంటుంది. కాని నా విషయంలో కాంతమే నన్ను అనుమానిస్తు ఉన్నట్టుగా మాటలలో దొరికిపోతూ ఉండేది. కాని ఎప్పుడూ అదేమీ నేను పట్టించుకోలేదు. ఇప్పుడాలోచిస్తే యీ అనుమానం కాంతంలో ప్రగాఢంగా నాటుకు పోయి ఉందని, యిప్పుడు ఆ అనుమానం పెనుభూతమై ఆమెచేత యిల్లంతా చిందరవందర చేయించిందని తేలుతున్న సారాంశము.

నాకు ఆశ్చర్యం వేసింది. రాధ వచ్చిందా? ఎవరీ రాధ? తనకేమి తెలియదే. బహుశా తను లేని సమయంలో వచ్చిందేమో.

'ఎవరో ఆ రాధ! ఆ రాధసంగతి నాకేం తెలీదత్తయ్యా'

'తెలీదంటే సరిపోతుందా ప్రత్యక్ష ప్రమాణంఉంటే' అని మా ఆవిడ అర్గ్యుమెంటు.

'ప్రత్యక్ష ప్రమాణమా' అని నాలో నేను గొణుక్కున్నాను.

'అవును ప్రత్యక్షప్రమాణమే' అని అంటూ డ్రాయరులో డైరీతీసి బయటపెట్టి.

'తీసి చదవండి 15 వ తారీఖున మీస్వహస్తాలతో ఏం రాసుకున్నారో.. ఆ రాధ ఎవరో జ్ఞాపకం వొస్తుంది.'

డైరీతీసి పైకి చదివేను.

"15 వ తారీఖు.

పగలంతా కాలేజీ సాయంకాలం లైబ్రరీ.. బీచ్‌లో మిత్రులతో యిష్టాగోష్ఠి ...రాత్రి భోజనం ముగించేక రాత్రి 12 గంటల వరకు రాధతో కాలక్షేపం."

ఇంకా చదవడం పూర్తిచెయ్యలేదు. మా కాంతం అందుకొంది.

'12 గం|| వరకే ఏం. రాత్రంతా ఉంచుకో లేకపోయారు? ఎవరు అడ్డు పెట్టేరు మిమ్మల్ని?'

మిగతాకూడ చదివేశాను.

"రాధ కేరక్టరు ఏమి అర్థం కాకుండా ఊహకు అతీతమైఉంది."

'మీసరదాలు తీరిపోతుంటే రాధ కేరక్టరు సంగతి మీకెందుకు' అని మాఆవిడ కామెంటరీ.

నాకిప్పటికి అర్థమైంది. ఈ అల్లరి అంతటికీ కారణం డైరీ అన్నమాట.

నాకాశ్చర్యం, ఆరాటం అంతా మటుమాయం లేకుండా ఎగిరిపోయి ఫకాలున నవ్వొచ్చింది.

నేను నవ్వుతుంటే మా కాంతానికి మరీ కోపం ఎక్కువైంది.

'నవ్వండి యింకా నవ్వండి. నవ్వి నన్ను పరిహాసం చెయ్యండి ఇంకెందుకు రేపే నా ప్రయాణం. ఆరాధను ఇక్కడకే తెచ్చి అట్టే పెట్టుకోండి' మాకాంతం ఉక్రోషంతో అన్నమాటలు.

'నన్నేమైనా చెప్పనిస్తావా, అంతా నీ సొదేనా'

'ఏంనాయనా ఏం జరిగిందేమిటి?' అని మా అత్తయ్య ఆత్రుతగా అడిగింది

'మరేం లేదు అత్తయ్యా. ఆరాధ శరత్ బాబుగారి రాధ.'

'ఎవరా శరత్ బాబు? ఈ వీధిలోనే ఉన్నాడా?' అని మాఅత్తయ్య అమాయక ప్రశ్న.

'అదికాదత్తయ్యా' శరత్ బాబు ప్రసిద్ధ బెంగాలీరచయిత. అతను వ్రాసిన పుస్తకాలలో "రాధ" అనే పుస్తకం ఒకటి. "

'అయితే 12 గం|| వరకు రాధతో కాల క్షేపం ఏమిటి?' అని మాకాంతం ప్రశ్న.

'రాధతో కాలక్షేపం అంటే 'రాధ' అనే నవల చదువుతూ కాలక్షేపం చేశానని మా ఆవిడ ఆశ్చర్యానికి అంతులేదు.

'డైరీలో రాధ ఎంతపని చేసింది' అని మాత్రం తనలో తను అనుకొని నాముందు నిల్చోడానికి సిగ్గువేసింది కామోసు, వంటింట్లోకి ఒక్క పరుగు తీసింది

అది మొదలుమాసంసారం మళ్లా స్వర్గసీమ. ఆనందమయం నిత్యకళ్యాణం పచ్చతోరణం. ★



చర్మబాధలన్నిటికి

"సైబాల్"

చర్మవ్యాధులన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విష క్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, మొటిమలు, తామర, కాలిపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది

బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధిచెందినది.

"రమణీస్ బేబీ గ్రైప్"

తయారుచేయువారు

దిసౌత్ ఇండియన్ మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు:

సీతారామ జనరల్ స్టోర్సు ఏజన్సీస్ విజయవాడ, సికింద్రాబాద్.

బరంపురం (గంజాం), బొంబాయి. బెంగుళూరుసిటీ.



ఫలించని తాంబూలాలు

"చదువది యెంతగల్గిన రసజ్ఞత ఇంచుక చాలకున్న ఆ చదువు నిరర్థకంబు" అని భాస్కర శతకం—ఆ కాలంలో ఒక్క రసజ్ఞతే లోపించింది కాబోలు చదువుకున్న వారిలో కొంతమందికి ఈ రోజుల్లోనే ఆ కవి ఉంటే రసజ్ఞతతో పాటు "సంస్కారం" కూడా చేర్చి ఉండేవాడు

స్నానసంధ్యలు ముగించుకుని అవధాన్లు గారు కావ్య పఠనం చేస్తున్నారు.

"అబ్బ! ఇంకా ఎప్పుడు లేస్తారండి భోజనానికి? ఒకప్రక్క పన్నెండు గంటలు దాటుతూంటే ఎంత పెందరాళే వంట చేసుకుంటే ఏం లాభం. మన వేళ మాత్రం మన కవ్వాలి ఒంటిగంట దాటకుండా ఏనాడు భోజనం చేశారని! ఆ గ్రంథ పఠనంలో పడితే ఇంక అన్నం నీళ్ళుకూడా అక్కర్లేదు ఆ దేమిటో అంత పిచ్చి!" అంటూ కామాక్షమ్మ గారు వంట గదిలోనుంచి మహా విసుగ్గా వచ్చి అవధాని గారి దగ్గరనుంచుంది.

"ఉండువస్తున్నా మంచిపట్టులో ఉన్నపుడే వస్తావు. దీనిలో ఆనందం నీకెలా తెలుస్తుంది?" అంటూ యథాప్రకారం తన ధోరణిలో పడి పోయాడు అవధాన్లు.

"మీకేనండీ చెప్తున్నది. ఒంటిగంట కూడా అవుతున్నది. ఎంత పిచ్చి ఉంటే మాత్రం దానికి కూడా ఒక అంతుండద్దూ? ఎంత సేపని వంటగదిలో ఇట్లా మడిగట్టుక్కూచోమంటారూ. ఎదుటి వాళ్ళ కష్టసుఖాలు మాత్రం ఊహించ నక్కరలేదూ! ఇంటి విషయాల్లోకూడా బొత్తిగా పట్టించుకోటమే మానేశారు. ఒక్కదాన్ని ఎన్నింటికని తంటాలు పడేదండి! తనకోపమంతా ఒక్కసారి వెళ్ళబుచ్చింది కామాక్షమ్మ.

"అబ్బబ్బ! ఏంగోల! పదనే వస్తున్నా, వడ్డించు, ఇంతలోకే"

"వడ్డించటం ఎంతసేపు" చాలా సేపైంది వడ్డించి అంటూ కామాక్షమ్మ వంటింట్లోకి దారితీసింది.

ఇహాతప్పదురా భగవంతుడా అనుకుంటూ ఆమెను అనుసరించాడు అవధాన్లు.

నెమ్మదిగా భోజనం ముగించుకుని వచ్చి భుక్తాయాసం తీర్చుకుంటున్న అవధాన్ల గారితో మళ్ళీ సంభాషణ ప్రారంభించింది కామాక్షమ్మ

"అయితే మొన్న బెజవాడనుంచి వచ్చిన ఉత్తరం సంగతి ఏమైనా ఆలోచించారా?"

"ఏ ఉత్తరం సంగతి"

"అదేనండీ అబ్బాయి పెండ్లి సంబంధము విషయం."

"అదే చూస్తున్నా "

"చూడటం ఏమిటండీ అసలు ఆ ఉత్తరం ఎక్కడ పడేశారు? పోనీ సంగతు లేమిటో చెప్తారా అంటే అదీ లేదు. అసలా విషయమే మర్చిపోయినట్లున్నారే!"

"ఆ! ఏముంది! అబ్బాయిని వచ్చి వాళ్ళ పిల్లని చూసుకోమని వ్రాశారు."

"అవును నేనూ అదే అంటున్నా అబ్బాయి మళ్ళీ మళ్ళీ మీతో అంటానికి సిగ్గుపడ్తాడు కదా. ఆ విషయంలో మీరు తొందరపడకపోతే ఎలా చెప్పండి. ఇంకా ఆ విషయంలో వాడే నయం. మీరా వయస్సులో ఎలా తహ తహలాడి పోయారో జ్ఞాపకం తెచ్చుకుంటే తెలుస్తుంది వాడిబాధ" అంది కామాక్షమ్మ నవ్వుతూ.

శ్రీ బి. యల్. సీతారామ్

"సరేలే! పెద్ద చెప్పొచ్చావు. నా పెళ్లి కాకముందు విషయాలు, నేను చెప్పకపోతే నీకెలా తెలిసేవి? ఇంతకీ వాడికంటే నీ తొందర ఎక్కువయిందే? కోడలుచేత మర్యాదలు పొందుదామనిగాబోలు!" చిన్నగా నవ్వుతూ అన్నాడు అవధాని.

"ఆ! ఈ రోజుల్లో కోడళ్లు వచ్చి చేస్తారన్న ఆశకూడానా! అదంతా మా కాలంలోనే! మన మాటలకేంగాని ఇంతకీ ప్రయాణం ఎప్పుడంటారూ?

"ఎల్లుండి దశమి, మంచిరోజు. ఆ రోజు ప్రొద్దున్న బండికి బయలుదేరుదాం. అబ్బాయికి కూడా చెప్పి ఉంచు," అంటూ కండువా మీదవేసుకుని ఏదో పనిమీద బయటికి వెళ్ళిపోయాడు అవధాన్లు:

సాయంత్రం ఆరు గంటలవేళ కావస్తుంది ప్రకాశం అప్పుడే ఆఫీసునుండి తన గదిలోకి వచ్చి బట్టలు మార్చుకుని ఈజీ చైరులో కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నాడు. చల్లని గాలి వీస్తుంటే ఏవో ఆలోచనా పరంపరలతో నిట్టూర్పులు విడుస్తున్నాడు. "అబ్బ! తన కీపాటికి పెండ్లయి ఉంటే హాయిగా ఆఫీసునుంచి రాగానే చిరునవ్వుతో తనకెదురై వేడి వేడి కాఫీ అందిస్తూ నవ్వుతూ తన వైపు ఓరగా చూస్తూ తన ఆఫీసు శ్రమనంతా మరపించివేసేది గదా! తన ప్రియురాలు! ఆలోచనా లోకంనుంచి "ఏంరా! ప్రకాశం!" అన్న తల్లిపిలుపు ఈ లోకంలోకి లాక్కొచ్చింది!"

"ఆఫీసునుంచి వచ్చి ఎంతసేపైందిరా? ఏం అట్లా కూచున్నావు. ఒంట్లో బాగుంటే లేదా!"

"ఆ! ఏంలేదమ్మా. ఇవాళ ఆఫీసులో పని కాస్త ఎక్కువయింది. కొంచెం విశ్రాంతి తీసుకుందామని ఇలా కూర్చున్నా"


"మరి రేపు ఆదివారంనాడే ముహూర్తం పెట్టారు రా మీ నాన్నగారు. మన ప్రయాణానికి."

"ఎక్కడికమ్మా"?

"అదే! మొన్న లక్ష్మీనారాయణగారు ఉత్తరం రాయలా? బెజవాడనుండి, వాళ్ళమ్మాయిని వచ్చి చూసుకొమ్మని? అందుకని బెజవాడ వెళ్ళద్దూ" అని కామాక్షమ్మ తన పనిమీద వెళ్ళిపోయింది. ఆమాటలకి ప్రకాశం హృదయకమలం ఆనంద వికసితమైంది. ఎప్పుడౌస్తుందా? ఆదివారం అని రోజులు లెక్క పెట్టుకుంటున్నాడు.

ప్రకాశం రైల్వేలో గుమాస్తాగా చేరి అప్పుడే రెండేళ్ళయింది. అతను బి. యే. లోకి రావటంతోటే సంబంధాలు రావటం మొదలుపెట్టాయి. కానీ ఈ నాలుగేళ్ళలోనూ ఒక్కటీ స్థిరపడలేదు. మరి తనకు పిల్లనచ్చితే తండ్రికి కట్నం నచ్చదాయె—తండ్రికి కట్నంనచ్చితే తనకు పిల్ల బాగుండదు. ఇలా ఎంతకాలం జరుగుతుంది! ఇక విసుగుపుట్టి ఎట్లాగయినా ఈ సంబంధం చేసుకు తీరాలిసిందే అనే నిశ్చయానికి వచ్చేశాడు.

ఆదివారం వచ్చేసింది. ఉదయం పది గంటలకల్లా భోజనం చేసి ప్రయాణం. మూడి



★ ఫలించని తాంబూలాలు ★

మంచిడ్రెస్సు వేసుకుపోవాలి. ప్రకాశం ఆలోచనలో పడ్డాడు. ఏ డ్రెసులో వెళ్తే బాగుంటుంది? ఒకవేళ ఆపిల్ల తనకు నచ్చినా తను ఆ పిల్లకు నచ్చాలాయె! మరి ఆ పిల్ల స్కూలు ఫైనలు వరకూ చదివిందట. డ్రస్సుల ఆర్భాటానికి లోబడుతుందో లేదో! కొంద రికి "నాచురల్ బ్యూటీ" కావాలి. కొంద రికి మోడరన్ ఫాషన్లు నచ్చుతాయి. ఏమైనా పరే తనుచాలా "అప్ టు డేట్" గా తయారై వెళ్లాలిసిందే! మరి ఇప్పుడు పెళ్ళికాకపోతే మరో సంబంధం వచ్చేవరకూ ఈ ఒంటరి జీవితం గడపటం ఎలా! పెట్టెలోని డ్రస్సు లన్నీ తిరగేస్తూ ఆలోచనలతో మునిగి తేలు తున్నాడు.

"రైలు వేళవుతోందిరా! తొందరగా రా" అంటూ తండ్రి కేకవినిపించేటప్పటికి రెండు నిమిషాల్లో బాగా డ్రస్ చేసుకొని బయలు దేరాడు.

బెజవాడలో లక్ష్మీనారాయణ గారిల్లు చేరేటప్పటికి సాయంత్రం నాలుగయింది. గుమ్మంలోనే లక్ష్మీనారాయణ గారు ఎదురై మర్యాదగా ఆహ్వానించారు. ప్రయా ణం ముచ్చటలతోనూ, కాఫీ ఫలహారాల తోనూ ఒకగండం గడిచింది. పాపం! ప్రకాశం తొందర వాళ్ళకేలా తెలుస్తుంది? ఇదంతా కనిపెడుతున్న కామాక్షమ్మ పిల్లను తీసుకురమ్మంటూ సుందరమ్మగారికి పుర మాయించింది. ఆమాట అనటం తరవాయిగా "శారద" వచ్చి అక్కడే చాప మీద కూర్చుంది. ఒక్కసారి అందరూ చూపులు ఆమె వైపు మరల్చారు.

"సంగీతం నేర్పిస్తున్నారా?" కామాక్షమ్మ అడిగింది.

"ఆ! ఇప్పుడే కృతులు నేర్చుకుంటోంది" "అమ్మా! శారదా! ఒక త్యాగరాజ కృతి పాడమ్మా" అని తల్లిఅనడంతో శారద గొంతు విప్పి చక్కగా పాడటం మొదలు పెట్టింది. ఆమె గానమాధుర్యానికి అందరూ ఆనం దంలో మునిగిపోయారు. పాట అయి పోయింది.

ఇంతలో శారద చూసిన ఓరచూపుకి ప్రకాశం యథాస్థితికి వచ్చేలోగా అందరూ చూశారేమోనని చాలా సిగ్గుపడ్డాడు. వెంటనే ప్రకాశం అంగీకారం తెలుసుకుని నలుగురు పెద్దలనిపిల్చి తాంబూలాలు పుచ్చుకున్నారు.

'అనాసిన్'

నాలుగు మందులు గలది వైద్యుని ఔషధయోగమువంటిది

1. క్వైనైన్ సల్ఫేట్ 2. ఫినాసిటిన్
3. కఫీన్ 4. అసిటిల్ సాలిసిలిక్ ఏసిడ్

'అనాసిన్'—గొప్ప బాధానివారణి—వైజ్ఞానికంగా కూర్చబడిన నాలుగుమందులను గలిగియున్నది, అవి నరముల ముఖ్యస్థానము లందు సంయుక్తచర్యను జరిపి, తలనొప్పులు, జలుబులు, జ్వరము, దంతబాధ, కండ నొప్పులనుండి రూఢిగా, సురక్షితమైన శీఘ్రవిముక్తిని గలిగించును. బాధానివారణకు 'అనాసిన్' కంటె అతివేగముగా పనిచేయునట్టిది మరేదీ లేదు. సేవించుటకు 'అనాసిన్' కంటె అతి సురక్షితమైనట్టిది మరేదీ లేదు. జ్ఞాపకముంచుకొనుడు! 'అనాసిన్' వైద్యుని ఔషధయోగము వంటిది. అది గుండెలకు హానిగాని కడుపు ఉబ్బరముగాని కలిగించదు. 'అనాసిన్' లక్షలాది జనులకు బాధానివారణి ఎందుకనగా ప్రతివారును 'అనాసిన్' ను కొనగలరు.
ఒక ప్యాకెట్ ధర 12 నయా పైసలు మాత్రమే.

నాలుగు మందుల సూత్రమైన 'అనాసిన్' వాడుడు



జెఫ్రీ మేనర్స్ అండ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, బొంబాయి ఉపయోగకులు.   ఒక ప్యాకెట్ ధర 12 నయా పైసలు మాత్రమే

నాలుగురోజులలో ముహూర్తాలు చూసి రాస్తానంటూ అవధాన్లుగారు, వాళ్ళు వెళ్ళిపోయారు.

తను మూడువేలకన్నా ఎక్కువ ఇచ్చుకోలేక పోవటంతో ఇన్నాళ్ళనుండి కుదరకపోయినా ఇక కొద్దిరోజుల్లో తనకూతురు పెళ్ళి అయిపోతుందని ఇన్నాళ్ళూ తనుపడ్డ అవస్థలు ఇక కొద్దిరోజుల్లో గట్టెక్కిపోతాయని ఒక్కనిశ్వాసం విడిచారు నారాయణగారు.

వారం అయింది. పదిరోజులయింది, నెలవుతోంది. ఎన్నాళ్ళకూ అవధాన్లుగారి దగ్గరనుండి ఉత్తరంరాదు. నారాయణగారిభార్య అందుకుంది "ఏమండీ! అవధాన్లుగారు వాళ్లు నాలుగురోజులలోనే ముహూర్తం పెట్టి రాస్తామన్నారే? "మరి ఉత్తరం ఏమన్నా వ్రాశారా?"

"ఇంతవరకూ రాలేదు. తాంబూలాలు కూడా పుచ్చుకున్నాక ఇన్నాళ్ళు ఆలస్యం ఎందుకో?"

"వాళ్ళకు కట్నం చాలకనా, లేకపోతే మనమ్మాయి కొంచెంనల్లగా ఉంటుందని ఇష్టం లేక అభిప్రాయం మార్చుకున్నారో" అడిగింది సుందరమ్మ.

"ఏమోఇష్టం లేకపోతే వెంటనే సూచిస్తే సరిపోయేదిగా. తాంబూలాలు పుచ్చుకుని పదిమందిలోను ఒప్పుకున్నాక అట్లా ఎట్లా జరుగుతుంది? అయినా ఒకసారి వెళ్ళివద్దామనుకుంటున్నా. తాంబూలాలు పుచ్చుకుని స్థిర పర్చుకున్నాక ఇక ఆలస్యాలు జరుగకూడదు," అంటూ పడకకుర్చీలో పడుకుని పంచాంగం తిరగేస్తున్నాడు నారాయణగారు.

"ఏమిటండోయ్! పంచాంగం తిరిగేస్తున్నట్లున్నారే. అమ్మాయిపెళ్ళి కుదిరిందేమిటి?" నారాయణగారి స్నేహితుడు వచ్చి కుర్చీలో కూర్చుంటూ అన్నాడు.

"అవునండీ టంగుటూరిలో అవధాన్లుగారున్నారే వారి అబ్బాయికి స్థిరపర్చుకున్నాం"

"అదేమిటీ! ఆయన నాకు తెలియక పోవటం ఏమిటి? వారి అబ్బాయికి పెళ్ళయి అప్పుడే ఇరవైరోజులైందే!" ఆశ్చర్యంగా అన్నాడు స్నేహితుడు.

"ఆ! ఎట్లా అవుతుంది? మనింట్లో పదిమందిలోనూ తాంబూలాలు పుచ్చుకున్నారే! అందులో అవధాన్లుగారివంటి ఆయన అలాచేస్తాడా?" ఎంతో ఆవేశంతో అన్నాడు నారాయణగారు.

"నారాయణగారూ! ఇదివరకటి కాలం కాదండీ! ఇప్పుడు రోజులు మారాయిగా! పెళ్ళయినమాట వాస్తవం. ఇంకా నాకు తెలిసిందేమిటంటే అవధాన్లుగారు కోరినట్లు ఆరువేల కట్నం ఇచ్చారుట! ఆ పిల్లాడికి కూడ ఆ పిల్లపై మనస్సు కుదిరిందని విన్నాను. అంటే యీ కాలం "మోడరను ఫాషను లన్నీ చేసుకునేరకం పిల్లట. కొస్త బాగా చదువుకున్నది కూడా నండీ. వీటన్నిటికీ తోడు కొస్త ఎఱ్ఱగా అందంగా ఉండటంతో వెంటనే ఆ అబ్బాయికి నచ్చింది. పెళ్ళి చేసేశారు."

"ఆరీ అవధాన్లూ! ఎంతపనిచేశాడు! పదిమందిలో తాంబూలాలు పుచ్చుకుని చివరికి ఇంత అప్రతిష్ఠకి పూనుకుంటాడా? నలుగురిని తీసుకువెళ్ళి ఆ పిల్లనిచ్చినాయన్ను ఎట్లా ఇచ్చాడో ఇంత పరువులేని వాడికి, పోయి హంగామాచేసి వస్తానంటూ" పట్టరాని కోపంతో లేచాడు నారాయణగారు.

"ఆ! ఇంకా ఇప్పుడెందుకు లెండి! అంతా అయిపోయింతర్వాత! జరిగినదానికి విచారించి ఏం లాభం?"

"అదికాదయ్యా! ఇప్పుడు నాపిల్లకిక పెళ్ళి ఎట్లాకాను? తాంబూలాలు పుచ్చుకుని మానేశారని పేరుపడిందంటే ఇక కొత్తగా వచ్చేవాళ్ళకు కూడా నా పిల్లలో ఏదో పెద్దలోపం ఉందని, లేకపోతే అవధానువంటి ఆయన ఎట్లా మానుకున్నాడని అందరూ అనుమానిస్తుంటారే! ఇంక నాపిల్లని చేసుకుంటానికి ఎవరొస్తారు." తల పట్టుకుని కుర్చీలో కూలబడ్డాడు నారాయణ.

"ఎందుకండీ అప్పుడే అట్లా దిగులు పడ్తారు. అంతా అట్లాగే ఉంటారుటండీ! ఇదిగాకపోతే దీని తాతలాంటి సంబంధం తీసుకొస్తాం. మావూరులోనే ఒక మంచి సంబంధంఉంది. మీరుఒప్పుకుంటే తక్షణమే తీసుకొస్తా." కానీ...

"ఎందుకండీ సందేహిస్తారు. కొస్తవెళ్ళి ఏదన్నా సంబంధం కుదిర్చి ఈ మాసంలోనే పిల్లపెళ్ళి అయింది అనిపించారంటే మీ ఋణం మర్చిపోలేను" ప్రాధేయపడ్తూ అడిగాడు నారాయణ.

"ఓ దానికేముందండి. ఇవాళే వెడదామనుకుంటున్నాగాని, కొంచెం డబ్బు ఇబ్బందిగా ఉంటంతో వచ్చే నెలలో ప్రయాణం పెట్టుకోవాలనుకుంటున్నా. ఇంతకీ ఒక ఇరవై రూపాయలుంటే చాలు ఇవాళే బయలుదేరి వెళ్ళొచ్చు?" సందర్భానుసారంగా తన ఇబ్బందిని బయటపెట్టాడు. నారాయణగారి స్నేహితుడు.

"అంతకన్నాటండీ. మీరే వెళ్ళి ఆ సంబంధం కుదుర్చుకొచ్చి మా పిల్ల పెళ్ళి చేయిస్తే ఈ ఇరవై రూపాయలు ఒక లెక్కటండీ. ఇప్పటికీ నాలుగేళ్ళనుండీ ఇలా చూసి పోయేవాళ్ళకోసం. రెండువేలన్నా ఖర్చయి ఉంటుంది. అందులో ఇదొక లెక్కా. కాని మీరైనంత త్వరలో కుదిర్చారా మీ మేలు యావజ్జీవం మర్చిపోను" అంటూ ఇరవై రూపాయలు అతనిచేతిలో పెట్టాడు నారాయణ నిట్టూర్పుతో.

"నాల్గురోజులలో ఏసంగతీ చెప్తానంటూ సంతోషంగా సెలవు తీసుకున్నాడు స్నేహితుడు.

ఇదంతా ప్రక్కగదిలోనుంచి చూస్తూ వింటున్న "శారద" లేతహృదయంలో ఆశాసౌధాలన్నీ కూలిపోయి, మళ్ళీ అంతా మొదటికి రావటంతో ఒక్కసారి బావురుమంది. దిగాలుపడి నారాయణగారు కుర్చీలో కూలబడ్డాడు. ★

అతిమూత్రవ్యాధి
నెమ్మదించును

మూత్రంలో చక్కెరపోవటం అతిమూత్ర వ్యాధి (DIABETES) అంటారు. ఇది ఎంత ఉపద్రవకరమైన వ్యాధి అంటే, దీని పాలబడినవారు ఆరోజుకారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి ఎక్కువగా దాహం, ఆకలి, తరచుగా చక్కెరతోగాని, లేక చక్కెరలేకుండగాని మూత్రం బయలు వెడలటము, దురద మొదలైనవి. వీనస్ ఛారమ్ అనేక సంవత్సరముల పరిశోధనల ఫలితంగా తయారు కాబడినది. దీన్ని వాడటంవల్ల వేనకు వేల మందిమృత్యుముఖమునుండి బయటపడ్డారు దీన్ని వాడితే రెండవలేక మూడవ రోజు నుండేమూత్రంలోచక్కెర తగ్గించి అత్యధిక మూత్రంకూడా నివారిస్తుంది మూడురోజుల తర్వాత మీకు బాగా తేలిక ఇస్తుంది దీనికి పత్యంలేదు. ఇన్‌జెక్షన్లు అవసరం లేదు. వివరములు గల ఇంగ్లీషు కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపెదము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు.

ప్యాకింగు పోస్టేజి ఉచితము.

Venus Research Laboratory(A,P,W)
P. O Box No. 587, Calcutta.

స్కినెడెక్స్
గజ్జి, దురదలు, పుండ్లు మొ॥
చర్మవ్యాధులకు దివ్యాంజనము
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
లిమిటెడ్, మద్రాసు-౩౦.

★ భారత స్వాతంత్ర్యసమ

1857 నాటి మ



జగదీశ్ పురాధిపతి
రాణా కుమారసింగ్

ఆకర్ణాంత నేత్రాలలో క్రోధారుణ కాంతులు శిరీష కోమలగాత్రంపై వీరోచిత పురుషవేషం. తానెక్కినది జవనాశ్వం, తానున్నది కదనభూమి, చేతిలో రక్తసిక్తకరవాలం, నడిపిస్తున్నది మహావిప్లవం.

ఆమనోహర రౌద్రమూర్తి ఝాన్సీ లక్ష్మీబాయి. భావితరాల భారతీయుల స్వాతంత్ర్య కాంక్షను తన చితిమంటలతో రగిలించిన వీరనారి.

ఆనాటి చరిత్రపుటలు తిరగేస్తే, స్వర్ణాక్షర లిఖితమైన లక్ష్మీబాయి పేరు కనిపిస్తుంది. ఇంకా నానాసాహెబ్, తాత్యాతోపే, కుమార్ సింగ్, బాలాసాహెబ్, అయోధ్యమౌల్వీ, అజీముల్లా మొదలైనవారి పేర్లు కనిపిస్తాయి చరిత్రకెక్కని అజ్ఞాతవీరులెందరో భావవీధిలో సాక్షాత్కరిస్తారు. వీరందరూ స్వీయరక్తప్లావితమైన భారత భూమిలో విప్లవబీజాలు నాటారు అది నూరేళ్ళక్రిందటి మరపురాని మహోజ్వల గాథ!

ఈస్టిండియాకంపెనీ తరఫున గవర్నర్ జనరల్‌గా డల్హౌసీప్రభువు భారతదేశాన్ని పరిపాలిస్తున్న రోజులవి. భారతదేశంలో కొంత భాగంమాత్రమే బ్రిటిష్‌వారి ప్రత్యక్ష పరిపాలనలో ఉన్నది. మిగతాభాగంలో పెద్ద సంస్థానాలు, చిన్నసంస్థానాలు; బ్రిటిషువారికి లోబడి పరిపాలిస్తున్న సంస్థానాధీశ్వరులు; పేరుకుమాత్రం చక్రవర్తిగా చెలామణీ అవుతున్న ఢిల్లీశ్వరుడు బహదూర్ షా.

పంజాబ్ రాజు రంజిత్ సింగ్ ఒకసారి నిస్పృహలో అన్నాడు, "అంతా ఎర్రనౌతుంది" అని. భారతదేశమంతా బ్రిటిష్ ఆధిపత్యానికి లోబడిపోకతప్పదని దీనిభావం ఈభావాన్ని యదార్థంచేయాలని డల్హౌసీ సంకల్పం. దేశమంతటా బ్రిటిష్ పతాకచ్ఛాయలు విస్తరింపచేయాలని అతనిఆశయం. అతనికింకో "సదుద్దేశం" కూడా ఉంది అనాగరికులైన భారతీయులను నాగరికులను చేయాలని, పాపం అతని ఊహ. దీనికోసం ఇంగ్లీషువిద్యను దేశంలో వ్యాపింపజేయాలని ప్రయత్నించాడు. స్కూళ్లు, కాలేజీలు స్థాపించాడు. ఇంగ్లండునుంచి ఉపాధ్యాయులను రప్పించాడు. క్రైస్తవమతం వ్యాపింపచేయడానికి మిషనరీలు అసంఖ్యాకంగా దేశంలోకి చొరబడసాగారు. ఏసుక్రీస్తుగొప్పదనాన్ని పూసగ్రుచ్చినట్టు వర్ణించడంతో తృప్తిపడక, ఈమిషనరీలు హిందూ దేవుళ్లను, దేవాలయాలను, ఆచారాలను, విశ్వాసాలను, బండబూతులు తిట్టేవారు. మహమ్మదీయులప్రవక్తను మత విశ్వాసాలను దూషించేవారు ఈప్రచారాన్ని అంతాఅసహ్యించుకున్నారు. కాని ఎవరూ గట్టిగా నోరెత్తి ఎదిరించడానికి వీలులేదు. బ్రిటిష్‌వారిచేతుల్లో తుపాకులున్నాయి!

డల్హౌసీ దేశమంతటా "అయోమార్గాలు" వేసి "అగ్నిశకటాలు" నడిపించాడు. టెలిగ్రాఫుస్తంభాలు, తీగలు నెలకొల్పాడు. వీటివల్ల మామూలుగా బండ్లమీద, గుర్రాలమీద జరిగే రాకపోకలకు, రవాణాకు నష్టం కలిగింది వార్తాహరులుగా పనిచేసే అనేకులకు జీవనోపాధిపోయింది. నిరుద్యోగులు ప్రబలారు. అసంతృప్తి పెరిగింది.

సిపాయిల అసంతృప్తి

అయితే మొదట్లో ఈ అసంతృప్తి సిపాయిలదాకా రాలేదు. సిపాయిలకు మొదట్లో ఇంగ్లీషువారికింద పనిచేయడం బాగానే ఉంది కొత్తరకం డ్రిల్లు, డ్రస్సు, గడ్డం గీసుకునే పద్ధతి వారికి నచ్చాయి. ఏ సైనికుడైనా సమర్థత కనబరిస్తే హవల్దార్, జమాదార్, సుబేదార్, సుబేదార్ మేజర్ కావొచ్చు ఇంగ్లీషు సేనానుల సామర్థ్యంకూడా వారిని ఆకర్షించింది. అంతా బాగానే ఉంది. కాని ముస్లిమ్ సైనికులకు గడ్డాలు గీసుకోవడం హృదయశల్య



కదనభూమిలో తాం

...ర శతవార్షికోత్సవం ★

...హాజ్వాల గాథ



విప్లవనాయకుడు
నానాసాహెబ్

...మైంది. రాజపుత్ర సైనికులకు తమ శిరస్త్రాణాల బదులు క్రైస్తవ టోపీలు పెట్టుకోవడం బాధ కలిగించింది. 1806 లో వెల్లూరులో ఒక తిరుగుబాటు లేగింది దాన్ని బ్రిటిష్‌వారు నిర్దాక్షిణ్యంగా అణచివేశారు. అప్పటినుంచీ సిపాయీలను బానిసలుగా పరిగణించి హీనంగా చూసేవారు. వారి జీతాలు కోసేశారు. ప్రమోషన్లు నిలిపివేశారు. సిపాయి సుబేదార్ అయినా నెలకు 174 రూ. లే జీతం. అదే కొత్తగా వచ్చిన మామూలు ఇంగ్లీషు సైనికుడైనాసరే, ఇంకా ఎక్కువ జీతం. ఈ అన్యాయానికి సిపాయీల గుండెల్లు మండిపోయాయి.

భారతీయులకు సముద్రయానం నిషిద్ధం. బర్మాలో ఇంగ్లీషువారు చేస్తున్న యుద్ధాలకు భారత సిపాయీల సహాయం కావలిసి వచ్చింది. సిపాయీలు సముద్రం దాటి బర్మా వెళ్ళడానికి నిరాకరించారు. 1856 లో బారక్‌పూర్‌లో మరొక తిరుగుబాటు జరిగింది. దీన్ని కూడా బ్రిటిష్‌వారు క్రూరంగా అణచివేశారు. భారతీయుల మత విశ్వాసాలను నాశనం చేస్తేగాని లాభం లేదని అనుకున్నారు. మతం వదిలేస్తే హావల్దార్ హోదా ఇస్తామని ఆశపెట్టారు. కొందరు మతం వదిలేశారు. కాని అధిక సంఖ్యాకులు తరతరాలనుండీ వస్తున్న మతం విడిచిపెట్టడానికి అంగీకరించలేదు. వారిని అధికారులు హీనంగా చూసేవారు.

ఆ రోజుల్లో భూస్వాములు, తాలూకాదార్లు, జాగీర్దార్లు బలంగా ఉండేవారు. ఇంగ్లీషువారు వారి బలం తగ్గించివేయాలని నిశ్చయించారు. మణిపూర్ సంస్థానంలో 158 గ్రామాలు ఉండేవి. వీటిలో 116 గ్రామాలను బ్రిటిష్‌వారు కైవసం చేసుకున్నారు. రోహిల్‌ఖండ్‌లోని 216 గ్రామాల్లో 138 బ్రిటిష్‌వారి హస్తగతమైనాయి జగదీశ్‌పురాధీశ్వరుడు కుమార్ సింగ్. అతని జాగీరంతా స్వాహాఅయి, అతడు అడవుల్లో తలదాచుకోవలిసి వచ్చింది. అధివతుల కష్టాలిలా ఉండగా, సామాన్య రైతులపని మరీ దుర్భరమైంది. తలతాకట్టు పెట్టినా చెల్లించలేనంతగా శిస్తులు పెరిగిపోయాయి.


వారసత్వ సిద్ధాంతం

అప్పటికి బ్రిటిష్ అధికారంలో ఉన్నవి. బెంగాల్, బీహార్, ఒరిస్సా; మహారాష్ట్రం, మైసూరు; పంజాబు ప్రాంతాలు. కాని ఇంకా చాలెడు దేశమున్నది. అదంతా తమ ఏలుబడిలోకి తెచ్చుకోవాలనిడల్‌హౌసీ ఆశ. దానికోసం ఒక విచిత్ర సిద్ధాంతం కల్పించాడు కొడుకులు లేకపోతే, కొడుకును పెంచుకుని రాజ్యానికి వారసుణ్ణి చేయడం భారతీయ సంప్రదాయం. ఇది డల్హౌసీకి నచ్చలేదు. దత్త పుత్రుడికి వారసత్వపు హక్కు ఇవ్వడం నా కిష్టంలేదన్నాడు ఈ సాకుతో సతారా సంస్థానాన్ని స్వాధీనం చేసుకున్నాడు. తరవాత నాగపూర్, శంబల్‌పూర్ సంస్థానాలు భుక్తం చేసుకున్నాడు. అందరూ ఇది అన్యాయమని ఘోషించారు. కాని బాహాటంగా ఎదిరించే ధైర్యం ఎవరికీ లేకపోయింది.

ఒక్క లక్ష్మీబాయికి తప్ప. ఆమె మధ్య భారతంలోని బుందేల్‌ఖండ్ సంస్థానాల్లో ఒకటైన ఝాన్సీ అధీశ్వరి. ఆమె భర్త గంగాధరరావు అపుత్రకుడుగా మరణించాడు ఆమె ఒక బాలుణ్ణి పెంచుకున్నది. "అతడు నీకు వారసుడుకాడు; నీ సంస్థానం ఇక మాదే" అని డల్హౌసీ తెలియజేశాడు. లక్ష్మీబాయి అంతమాత్రంతో బెదరిపోలేదు "నా బొందిలో ప్రాణం ఉండగా నా రాజ్యం నీ స్వాధీనం కా"దని సమాధానం పంపింది ఆమె ధైర్యానికి తెల్లదొరలు ఆశ్చర్యపడ్డారు. ప్రజలంతా ఆమెకు అండగా నిలిచారు

నానా సాహెబ్

ఇంతలో బిఠూర్ అధిపతి బాజీరావు (II) అపుత్రకుడై ఒక బాలుణ్ణి



...్యతో ప్రవీరవిహారం.

1857 నాటి మహోజ్జ్వల గాథ

పెంచుకున్నాడు. ఆ బాలుని పేరు నానా సాహెబ్. అతని దత్తతను బ్రిటిష్ వారు అంగీకరించలేదు. కాని నానా సాహెబ్ పట్టుదల, ధైర్యంకల వ్యక్తి. అజీముల్లాఖాన్ అనే తన స్నేహితుణ్ణి లండన్ పంపించాడు. కంపెనీ డైరెక్టర్లతో మాట్లాడి డల్హౌసీ అక్రమాలను అరికట్టించమని అడగమన్నాడు. కాని అజీముల్లాఖాన్ రాయబారం విఫలమైంది. లండన్‌లో అతడు తనలాంటి రాయబారి నే మరొకర్ని కలుసుకున్నాడు. అతడు సతారా రాణీ కంపెనీ డైరెక్టర్లతో సంప్రదింపులకోసం పంపించిన రంగో బాపూజీ. ఈ యిద్దరూ తమ విఫల రాయబారాలను గూర్చి కలబోసుకుని ప్రతీకారం తీసుకో వలసిందేనని నిశ్చయించుకున్నారు.

అజీముల్లా భారతదేశానికి తిరిగి వచ్చాడు. తన రాయబారాన్ని గూర్చి, రంగో బాపూజీతో తన మంతనాలను గూర్చి నానా సాహెబ్‌కు తెలియజేశాడు. దారిలో తాను సెవాస్టపూల్‌లో ఆగినప్పుడు, అక్కడ జరుగుతున్న క్రిమియన్ యుద్ధంలో ఇంగ్లీషు వారు రష్యన్ల చేతిలో ఎలా చావు దెబ్బలు తింటున్నదీ వర్ణించి చెప్పాడు. ఇంగ్లీషు వారు భారతీయులనుకుంటున్నంత అజేయులు కారని చెప్పాడు. నానా సాహెబ్‌కు బ్రిటిష్ వారిని ఓడించి తరిమివేయడం కష్టం కాదని తోచింది. కాని దానికి చాలా ప్రయత్నం కావాలి. దేశంలో అందరికీ బ్రిటిష్ వారిమీద మంటగానే ఉంది. కాని వారందనీ సంఘటితం చేయాలి. ఒక పథకం తయారు చేయాలి. దీనికోసం నానా సాహెబ్, అజీముల్లాతో కలిసి పెద్ద పరివారాన్ని వెంటబెట్టుకుని తీర్థయాత్రలకని పేరుపెట్టి వివిధ ప్రధాన నగరాలను దర్శించాడు. ఒక నెలరోజుల్లో, యమునాతీరాన గల కల్పి సంస్థానం, ఢిల్లీ, లక్నో, కాన్పూర్ నగరాలు తిరిగాడు. అతడు వెళ్ళిన చోటల్లా ప్రజలు, రాజులు స్వాగత సత్కారం చేరపారు. అతడు ఎందుకీ పర్యటన చేస్తున్నదీ తెలియక బ్రిటిష్ అధికారులు కూడా వెళ్ళినచోటల్లా రాజమర్యాదలు చేశారు. అతడు చడీచప్పుడు లేకుండా ఢిల్లీ చక్రవర్తి బహదూర్ షా తోనూ, ఔధ్ బేగంతోనూ, మౌల్వీతోనూ తన పథకాన్ని గూర్చి సంప్రదించాడు. అందరూ తమ సంసిద్ధతను తెలిపారు. తిరిగి బిఠూర్ వచ్చేశాడు.

వీరందరూ నానా సాహెబ్ పథకానికి అంగీకారం తెలపడానికి ఎవరి కారణాలు వారికున్నాయి.

1854 లో కర్నాటక నవాబు, 1855 లో తంజావూర్ రాజా అపుత్రకులుగా మరణించారు. వారి సంస్థానాలు కంపెనీ స్వాధీన మైనాయి. సంస్థానాలను వశపరుచుకోవడానికి డల్హౌసీ పనికి వచ్చినప్పుడు వారసత్వ సిద్ధాంతం ప్రయోగించాడు; పనికి రానప్పుడు ఏ కారణం లేకుండానే వశపరుచుకున్నాడు. ఇలా వశపరుచుకున్న వాటిలో ఔధ్ ఒకటి. ఔధ్ నవాబు వజీద్ అలీషా సపుత్రకుడే కాని అసమర్థుడు, భోగలాలసుడు. అసమర్థుడనే సాకుతో వజీద్ అలీషాను డల్హౌసీ తొలగించి, 12 లక్షల రూ॥లు ఇచ్చి కలకత్తా పంపించేశాడు. ఈ అక్రమాన్ని కంపెనీ డైరెక్టర్ల వద్ద విన్నవించుకోవడానికి నవాబు సకుటుంబ సపరివారంగా లండన్ వెడదామనుకున్నాడు. కాని కలకత్తా దారిలోనే మరణించాడు. ఎంత అసమర్థుడైనా తమ నవాబు జీవితాన్ని ఇంత అవమానకరంగా ముగించడం ప్రజలందరికీ, ముఖ్యంగా ముస్లిములకు క్రోధకారణమైంది. ఔధ్‌కు చెందిన 60 వేల మంది సైనికులను బ్రిటిష్‌వారు తొలగించి వేశారు. వీరందరూ నిరుద్యోగులై దేశమంతటా తిరుగుతూ బ్రిటిష్‌వారి అక్రమాలను ప్రచారం చేస్తూ విద్వేషం రగిలించసాగారు.

ఔధ్ యోధుడు

ఔధ్ బేగంకు సన్నిహితుడైన ఒక అపూర్వ వ్యక్తి ఉన్నాడు. సన్నగా, పొడుగ్గా, దృఢంగా, విశాల నేత్రాలు, కొనదేరిన నాసిక చూడగానే అతడు మహాపురుషుడనిపిస్తుంది. అతడు ఫైజాబాద్‌కు చెందిన మౌల్వీ అహ్మదుల్లాషా. అతనిపట్టుదల, సాహసంసాటి లేనివి. అతడు ఆగ్రా, ఢిల్లీ, మీరట్, పాట్నా, కలకత్తా నగరాలు పర్యటించి ప్రతిచోటా ఆంగ్లేయులపై విద్వేషాగ్ని రగులుకొల్పాడు. అతని విప్లవ సంకల్పం గ్రహించిన బ్రిటిష్‌వారతన్ని బంధించి దోషిగా నిర్ణయించి,ఉరితీద్దామనుకున్నారు. ఈలోగానే తిరుగుబాటు ప్రారంభం కావడంతో, అతడు కారాగారం నుంచి తప్పించుకున్నాడు. అజ్ఞాతంగా తిరుగుతూ విప్లవం నడిపించాడు.

మొగల్ చక్రవర్తి బహదూర్ షా వృద్ధుడు; అసమర్థుడు. యాభైఏళ్ల నుంచీ నామ మాత్రంగా, కీలుబొమ్మగా సింహాసనం మీద ఉన్నాడు. బ్రిటిష్‌వారి కతడు విధేయుడైనా వారసత్వ విషయంలో పేచీ వచ్చింది. చక్రవర్తి, అతని రాణి జవాన్‌బఖ్త్ అనే యువరాజుకు పట్టంకట్టాలనీ, బ్రిటిష్ వారు ఫక్రుద్దీన్ అనే యువరాజుకు పట్టం కట్టాలనీ పట్టుపట్టారు. ఇంతలో బహుశా ఏదో విషప్రయోగ ఫలితంగా ఫక్రుద్దీన్ మరణించాడు జవాన్‌బఖ్త్‌కు పట్టం కట్టడం ఇష్టంలేక బ్రిటిష్‌వారు అసలు కుటుంబాన్నే తప్పించాలనుకున్నారు. ఇది ఢిల్లీపాదుషాకు కంటకమైంది. అతడు అసమర్థుడైనా, పూర్వపు మొగల్ వైభవానికి అతడే వారసుడు కనుక అతడిపైనే ప్రజలు ఆశపెట్టుకుని ఉన్నారు,

కొవ్వు తూటాలు

ఇదంతా ఇలా ఉండగా, సిపాయిలలో అసంతృప్తి ఒక్కుమ్మడిగా హింసాకాంక్షగా మారడానికి తగిన సంఘటనలు కొన్ని జరిగాయి. అంతవరకూ సిపాయిలు 'బ్రౌన్ బెస్' అనే ఒక రకం తుపాకి ఉపయోగిస్తున్నారు. బ్రిటిషువారు దానిస్థానే 'ఎన్‌ఫీల్డ్' అనే మరో మంచిరకం తుపాకి ప్రవేశపెట్టారు. ఈ తుపాకిలో ఉపయోగించే తూటాలకు ఆవుకొవ్వు, పంది కొవ్వు పూశారు. ఉపయోగించే ముందు కొవ్వు కొరికివేసి వాడాలని సిపాయిలకు చెప్పారు. ఈ తూటాలను దేశమంతటికీ సరఫరా చేయడానికి జో లేడు ఫ్యాక్టరీలు, వాటిని వాడడం నేర్పేందుకు దండం, కాన్పూర్, మీరట్‌లలో పాఠశాలలు స్థాపించారు.

1857 జనవరి 22 న ఒక చిత్రం జరిగింది. ఒక బ్రాహ్మణ సిపాయిని ఒక హరిజనసిపాయి కొస్త మంచినీళ్లు పోయమని కోరాడు. బ్రాహ్మణుడు మైలబడి పోతానేమోనని నిరాకరించాడు దానిమీద, హరిజనుడు "పందికొవ్వు, ఆవుకొవ్వు కొరకవలసివస్తే ఏంచేస్తావు? నీ కులం ఏమవుతుంది?" అని హేళన చేశాడు. బ్రాహ్మణ సిపాయి హడలిపోయాడు గబగబ వెళ్ళి తోటిసిపాయీలందరికీ కొవ్వు తూటాలసంగతి చెప్పేశాడు. పంది మహమ్మదీయులు ఏవగించుకునే జంతువు. ఆవు హిందువులకు పవిత్ర జంతువు. ఉభయ సైనికులూ ఇది తమ మతాలను నాశనం చేయాలని క్రైస్తవులు పన్నిన పన్నాగమనే భావించారు. మండిపడ్డారు. ఇంగ్లీషువారు ఫరవా లేదని నచ్చచెప్ప బోయారు. సిపాయీల పగ ఇంకా పెరిగి పోయింది.

అరుణ ప్రభాతం

కలకత్తాకు 16 మైళ్ళలోని బారక్‌పూర్‌లో నాలుగు సిపాయీ దళాలు ఉన్నాయి. వారికీ కొవ్వుతూటాల సంగతి తెలిసింది. క్రోధం మితిమీరింది. సైన్యంలో క్రమశిక్షణ సడలిపోయింది. ఇంగ్లీషువారు వసించే

కొళ్లను, ఆఫీసులను రాత్రిళ్లు దగ్ధం చేసేవారు. రహస్య సమావేశాలలో కుట్ర పథకాలు నిర్ణయించారు. నూరుమైళ్ళ దూరంలోని బరంపురంలో సైన్యానికి ఈ విషయం ప్రాకింది. కుట్ర పథకాలు ఒక సైన్యంనుంచి ఇంకో సైన్యానికి ఇలా ప్రాకాయి. ఒకరికొకరు ఎర్ర తామరపువ్వు లందించుకునేవారు. "అంతా ఎర్రనౌతుంది" అని దాని భావం. అయితే ఈసారి రంజిత్ సింగ్ అన్నట్లుకాదు. ఇంగ్లీషువారి రక్తంతో అంతా ఎర్రనౌతుందని దాని భావం.

ఇలాగ దేశమంతా తిరుగుబాటు చేయాలనే భావం ప్రబలింది. ఈ భావాగ్నికి నానా సాహెబ్ ఆజ్యం పోశాడు. వేగుల వారిని అందరివద్దకూ పంపించి విప్లవ సందేశం అందజేశాడు. దక్షిణాన రంగో బాపూజీ జమీందార్లను, భూస్వాములను కూడ గట్టాడు ఉత్తరాన అజీముల్లా కాన్పూరు, మీరట్, బారక్ పూరు, బరంపురం, అంబాలా, ఢిల్లీ అన్నిచోట్లా అన్నివేళలా ప్రత్యక్షమవుతూ అందరినీ ఆయత్తం చేశాడు కాశ్మీర్‌లో గులాబ్ సింగ్, ఔధ్‌లో తాలూకాదార్లు, జగదీశ్ పూర్ లో కుమారసింగ్, అమరసింగ్, సతారా, కొంబల్ పూర్, నాగపూర్ రాజకుటుంబాలు, పంజాబులో రాజకుటుంబాలు, అంతా యుద్ధానికి సన్నద్ధులయ్యారు

ముహూర్త నిర్ణయం

గ్రహబలం, తారాబలం అన్నీ చూసి 1857 మే 31 వ తేదీన దేశమంతటా ఒక్కుమ్మడిగా లేచి ఆంగ్లేయులను దెబ్బతీయాలని నానా సాహెబ్ నిర్ణయించాడు జూన్ 23 వ తేదీకి ముందరే భారతదేశం ఆంగ్లేయుల హస్తవిముక్తం కావాలని అతడు అందరికీ వర్తమానం పంపించాడు జూన్ 23 స్మరణీయదినం సరిగా అప్పటికి నూరేళ్ళక్రిందట ఆదేనాడు ప్లాసీవద్ద బెంగాల్ పతనమై ఆంగ్లేయుల వశమైంది సరిగా నూరేళ్ళకు బ్రిటిష్ ప్రభుత్వం అదేవిధంగా పతనమవుతుందని జ్యోతిష్కులు జోస్యం చెప్పారు ఈ జోస్యం ప్రజలమీద, రాజులమీద బాగా పనిచేసింది ఈ దెబ్బతో యూరపియనుల పని ఆఖరని విశ్వసించారు ఇది వారికి ద్విగుణీకృతోత్సాహ కారణమైంది

కాని నానా సాహెబ్ పథకం అంతా తారుమారైంది. అతడు పెట్టిన ముహూర్తానికి 21 రోజులుముందే మే 10 వ తేదీన మీరట్‌లో విప్లవం ప్రారంభమైంది ఎవరూ అనుకోకుండా రణభేరీ కఠోరనాదం వినిపించింది

కొవ్వుతోటాల వైనం తెలియగానే బరంపురంలోని 19 వ నేటివ్ ఇన్‌ఫెంట్రీ తిరగబడింది బ్రిటిష్‌వారు ఆ దళాన్ని అవమానించి రద్దుచేయాలనే ఉద్దేశంతో, ఆ



ఆంగ్లేయులను ముప్పతిప్పలు పెట్టిన విప్లవవీరుడు తాత్యాతోపే

సైనికులను బారక్‌పూర్ తీసుకుపోయారు వీరి సంగతి ముందుగానే తెలిసి అక్కడున్న 34 వ పటాలపు సైనికులు క్రోధోద్రిక్తులయ్యారు వారిలో మంగళ్ పాండే అనే యువకుడున్నాడు ఆంగ్లేయులపై ద్వేషంతో అతని ఉడుకు నెత్తురు పొంగింది తుపాకీ ఒకటి పుచ్చుకుని సైనికు లందరివద్దకు వెళ్లి తిరగబడదాం రండి అని ఉద్బోధించాడు అతన్ని శిక్షించాలని వచ్చిన లెఫ్టినెంట్ బాగ్‌ను, సార్జెంట్ మేజర్ హ్యూసన్‌ను తుపాకి పేల్చి తీవ్రంగా గాయపరచాడు చాలసేపు ఇంగ్లీషు అధికారులతో పోరాడిన తరవాత, చివరి కతడు తన్ను తానే పేల్చుకున్నాడు, కాని చావలేదు అతని గాయాలు మాన్పించి, చివరి కతన్ని రాజద్రోహిగా ఉరితీశారు

ఏప్రిల్ 24 వ తేదీన మీరట్‌లో సిపాయిలకు కొవ్వుతూటా లుపయోగించమని ఇచ్చారు అక్కడ ఒక దళంలోని 90 మంది సిపాయిలలో 85 మంది అందుకు నిరాకరించారు వారిని అధికారులు శృంఖలాలంకృతులను చేసి, మండు టెండలో చెప్పులు లేకుండా కవాతు చేయించారు అధికారులు తుపాకులు పట్టుకుని ఎదురుగా నిలబడడంచేత ఇతర సైనికులు కూడా వారికి ఏమీ సహాయం చేయలేక చూస్తూ నిలబడ్డారు తరవాత ఆ 85 మందినీ సైన్యం నుంచి తొలగించి వేశారు వారు ఆ రాత్రి రహస్యంగా సమావేశమై కుట్రపన్నారు

విప్లవ ప్రారంభం

మర్నాడు మే 10 వ తేదీ, ఆదివారం అంతా ప్రశాంతంగా ఉంది సాయంత్రమైంది. మీరట్‌లోని ఆంగ్లేయాధికారులు, వారి స్త్రీలు అంతా చర్చికి, షికార్లకి పోయారు. హఠాత్తుగా తుపాకులు పేలాయి. బజార్లలో అంగళ్లన్నీ అంటుకున్నాయి. షికారుపోయిన ఇంగ్లీషు స్త్రీపురుషులు అక్కడే వధించబడ్డారు ఊళ్లోని కసాయి దుకాణాలవారు, పౌరులు రౌడీలు సిపాయిలతో కలిశారు "మారో ఫిరంగీకో" అనే కేకలు మిన్నుముట్టాయి జైళ్లను ముట్టడించి ఖైదీలను విడుదలచేశారు ఖైదీలు కత్తులు, కటార్లు పట్టుకుని ఊళ్ళోకి బయల్దేరారు. 11 వ దళం, 20 వ దళం తిరుగుబాటులో కలిశాయి కర్నల్ ఫినిస్‌ను కాల్చి చంపేశారు ఎక్కడ చూసినా అగ్నిజ్వాలలు, లూటీలు, హత్యలు. అధికారులు యూరపియన్ ఫిరంగిదళాన్ని తోడతీసుకుని సిపాయిలకెదిర్చారు కాని సిపాయిల క్రోధానికి ఎవరూ ఆగలేకపోయారు తెల్లవారేసరికి నగరమంతా శ్మశానతుల్యమై, శవాలతో, కాలిపోయిన ఇళ్లతో, క్షతగాత్రులతో బీభత్సంగా ఉంది అధికారులు తమ సేనలను వెంటబెట్టుకుని వెడితే ఎక్కడా ఒక్క సిపాయి కనిపించలేదు రాత్రికి రాత్రే సిపాయిలు 40 మైళ్ళ దూరంలో ఉన్న ఢిల్లీ నడిచిపోయారు ప్రొద్దున్న 8 గంటలకు యమున దాటి, రాజఘాట్ ద్వారం తెరుచుకుని ఢిల్లీ ప్రవేశించారు కలకత్తా గేటువద్ద కాపలాఉన్న కెప్టెన్ డగ్లస్, కమీషనర్ ఫ్రేజర్, తదితర ఇంగ్లీషు అధికారులను ఎదుర్కొన్నారు 38 వ సిపాయిదళంకూడా వారితో కలిసింది కాని అధికారులు కొద్దిలో తప్పించుకుని బయటపడ్డారు మూడవ ఆశ్విక దళం, 38 వ దళం, మీరట్ కాల్బలంకలిసి రాచనగరులో జొరబడి అంతా ఆక్రమించుకున్నారు చక్రవర్తి అంగరక్షకులతో సహా అంతా వారిని కలిశారు చక్రవర్తి ఇదంతా ఎందుకు వచ్చిందోనని హడలిపోయాడు

ఢిల్లీలో ఇంగ్లీషు జనాభా నివసించే ప్రాంతమంతా నానాబీభత్సమైపోయింది లూటీ, రక్తపాతం విశేషంగా జరిగాయి ఢిల్లీబ్యాంకును సిపాయిలు దోచుకుని, తగలబెట్టి, అక్కడివారందరినీ వధించారు 'ఢిల్లీ ప్రెస్'కూ అదేగతి పట్టింది ఒక్క ఇంగ్లీషువాడు కూడా ప్రాణాలతో బ్రతికిపోగూడదని సిపాయిలు హింసాకాండ సాగించారు అలాగే జరిగింది మే 16 వ తేదీకల్లా ఢిల్లీలో ఆంగ్లేయుడొక్కడూ లేడు హతులైనవారు హతులుకాగా, మిగతావారు పలాయితులైనారు సిపాయిలు 'బహదూర్‌షా హిందూస్థాన్ చక్రవర్తి' అని ప్రకటించారు

దేశమంతటా జ్వాలలు

తిరుగుబాటు మీరట్‌నుంచి ఢిల్లీకి, ఢిల్లీ

1857 నాటి మహోజ్జ్వల గాథ

నుంచి మిగతాచోట్లకి ప్రాకింది. బెనారస్‌లో సైనికులు తిరగబడ్డారు. అలహాబాదు, ఔధ్‌లలో పితూరీలు జరిగాయి. అలహాబాదులో అధికారులని, వధించి, ఆఫీసులు తగలబెట్టి టెలిగ్రాఫు తీగలను తెంపివేశారు. వాయవ్య రాష్ట్రాలలో తిరుగుబాటు ప్రారంభమైంది. పెషావర్, ఫిరోజ్ పూర్, మైబూర్, ఘాజీఉద్దీన్, అలిఘర్, షాజహాన్‌పూర్, రోహిల్‌ఖండ్ జిల్లా, అంబాలా మొదలైనచోట్ల కలహపటహం మ్రోగింది. లక్నోలో మౌల్వీ నాయకత్వాన సిపాయిలు ఇంగ్లీషు రెసిడెన్సీని ముట్టడించారు. రెసిడెంట్ సర్ హెన్రీలారెన్స్ తన సైన్యమంతా కూర్చుకుని 'మచ్ఛీభవన్'లోకిపోయి అక్కడినుంచే పోరాటం సాగించాడు. ధాన్యం పుష్కలంగా సమకూర్చుకున్నాడు. బోలెడు ఫిరంగులు, మందుగుండుసామగ్రి ఉన్నాయి. అయినా సిపాయిల ధాటికాగలేకపోయాడు. జూన్ మొదటివారానికి 118 మంది బ్రిటిష్‌వారు, 128 మంది వారి విశ్వాసపాత్రులైన భారతీయులు మరణించారు. లారెన్స్‌కూడా మరణించాడు. కౌన్పూర్‌లోకూడా జనరల్ వీలర్ సైన్యం సిపాయిలచేతిలో చావుదెబ్బతిన్నది.

అప్పుడు నానాసాహెబ్ బితూర్‌లో ఉన్నాడు. అసలు విప్లవ పథకమంతా తయారుచేసిందతడు. కాని అతనితో ప్రమేయంలేకుండానే తిరుగుబాటు స్వచ్ఛందంగా ప్రారంభమైంది. చేసేదిలేక నానాసాహెబ్ రంగంలోకి ఉరికాడు. కౌన్పూర్ వెళ్ళి సిపాయిలకు నాయకత్వం వహించాడు. తన సోదరుడైన బాలాసాహెబ్‌ను న్యాయాధికారిగా నియమించి అల్లకల్లోలంగాఉన్న కౌన్పూర్‌ను అదుపులో పెట్టడానికి ప్రయత్నించాడు. కాని ఆంగ్లేయ సంహారకాండ యథావిధిగానే జరిగిపోయింది.

జూన్ 23వ తేది ప్లాసీ యుద్ధ శతవార్షికోత్సవదినం. ఆనాడు పెద్దపండుగ జరుపాలని నానాసాహెబ్ నిర్ణయించాడు ఇంకా నగరంలో మిగిలిన ఇంగ్లీషువారు తప్పించుకుపోవడానికి అతడవకాశమిచ్చాడు. డల్హౌసీ వారసత్వ సిద్ధాంతాన్ని కాదన్నవారందరినీ వెళ్ళిపోనిస్తానని ప్రకటించాడు. కలకత్తా వెళ్ళిపోడానికి వీలుగా ఇంగ్లీషువారికతడు పడవలు సప్లయి చేశాడు. అజీముల్లాఖాన్ ఏర్పాట్లన్నీ స్వయంగా చేయించాడు. మర్నాడు ఆంగ్లేయులంతా పడవల్లో బయలుదేరారు. కొంతదూరం వెళ్ళాక ఒడ్డున ఉన్న సిపాయిలు వారిపై తుపాకులు కాల్చి చంపివేశారు. చాలమంది మునిగి మరణించారు. అయితే ఈ చిత్రవధ నానాసాహెబ్ ఆజ్ఞమీద జరిగింది కాదు. సిపాయిల్లో ద్వేషం పెచ్చురేగిపోయి వారంతటవారే ఈ దారుణం చేశారు. నానాసాహెబ్‌కు. అజీమ్‌కు ఈ సంగతి తరవాత తెలిసింది. తెలిసి ఏంచేయగలరు?

ఝూన్సీ ముట్టడి

ఝూన్సీలో లక్ష్మీబాయి విప్లవ పతాకం ఎత్తింది. రెసిడెంట్‌ను, అతనితో ఉన్న ఇంగ్లీషువారిని ఊరువిడిచి పొమ్మని ఆజ్ఞాపించింది. కాని వారుకూడా అడవుల్లో పొంచిఉన్న సిపాయిల కత్తుల కెర అయ్యారు. లక్ష్మీబాయికిది తెలిసి జరిగిందేదో జరిగిందని తన సన్నాహాలు తాను చేసుకోసాగింది. తనవద్ద ఉన్న సైన్యం దుర్గరక్షణకు చాలదు. అందుచేత నానాసాహెబ్‌కు కబురు పంపించింది. నానాసాహెబ్, అతని అనుచరుడైన తాత్యాతోపే లక్ష్మీబాయికి బాల్యమిత్రులు. వెంటనే నానాసాహెబ్ తాత్యాకు పెద్ద సైన్యం ఇచ్చి ఝూన్సీ పంపించాడు. ఝూన్సీని తిరిగి వశపరుచుకోవడానికి వచ్చిన సర్ హ్యూరోజ్‌తో యుద్ధం భయంకరంగా సాగింది. రోజు రోజంతా ఎడతెరిపిలేని పోరాటం. లక్ష్మీబాయి పురుషవేషం ధరించి, గుర్రమెక్కి కదనభూమిలో అపర కాళిలా తిరిగి శత్రువులను చెండాడింది.

మహారాష్ట్ర సంస్థానాలన్నీ తిరగబడ్డాయి. కొల్హాపూర్‌లో సిపాయిలు కోశాగారాన్ని దోచుకుని, కర్నల్ మాగన్‌ను నిలవరించారు. సతారా తిరుగుబాటులో లెఫ్టినెంట్ కెర్‌ను నామరూపాలు లేకుండా చిత్రవధ చేశారు. పూనాలో కలహం విజృంభించింది. పంజాబులో మియాన్ మీర్, మర్దాన్, జింద్, లూధియానా, జలంధర్ తిరగబడ్డాయి. కాని పాటియాలా, నాభా, తరవాత జింద్, సంస్థానాలు మాత్రం విప్లవంలో కలగజేసుకోక బ్రిటిష్ వారికే సహాయం చేశాయి. రాజపుత్ర సంస్థానాలు, బుందేల్‌ఖండ్ బ్రిటిష్‌వారిని ఎదిర్చి విప్లవకేతనాలు ఎగరేశాయి. జగదీశ్‌పూర్‌లో కుమారసింగ్ అపర కుమారస్వామిలా విజృంభించాడు.


ఢిల్లీ ముట్టడి

కానింగ్ ప్రభువు అప్పుడు గవర్నర్ జనరల్‌గా ఉంటున్నాడు. సిపాయిల తిరుగుబాటుగా ప్రారంభమై మహావిప్లవంగా పరిణమించిన ఈ పోరాటాన్ని ఎలా ఎదిరించాలో అతనికి అంతుపట్టలేదు. విప్లవానికి ఢిల్లీ కేంద్రం. ముందు దాన్ని పడగొడితే, మిగతా ప్రాంతాలను ఒకటొక్కటే జయించుకు రావచ్చు అని ఆలోచించాడు. బ్రిటిష్ వారు అలహాబాదును తమ కేంద్రంగా చేసుకున్నారు. సర్ హెన్రీ బెర్నార్డ్ అధిపత్యాన ఒక సైన్యం ఢిల్లీ బయలుదేరింది. కాని ఈ సైన్యం బుందేల్‌కీసరాయ్‌వద్ద అటకాయించబడింది. అక్కడ జరిగిన యుద్ధంలో ఇంగ్లీషువారు చాలామంది హతులైనారు. ఢిల్లీకి అన్నిచోట్లనుంచీ సిపాయిలు వరదలాగా రాసాగారు. రోహిల్‌ఖండ్‌నుంచి మహామద్ బక్త్‌ఖాన్ తన సైన్యంతో వచ్చి చక్రవర్తిని కలుసుకున్నాడు. చక్రవర్తి అతన్ని తన సేనానిగా నియమించాడు.

1858 జూలై 5వ తేదీన బెర్నార్డ్ కలరావల్ల మరణించాడు. అతని స్థానే మేజర్ రీడ్ సేనాధిపతి అయ్యాడు. కాని అతను కూడా ఢిల్లీ ముట్టడిలో విఫలుడయ్యాడు. బ్రిగేడీర్ జనరల్ విల్సన్ సేనాధిపతి అయ్యాడు. కౌన్పూర్‌నుంచి జాన్ నికల్సన్ నాయకత్వాన కొత్తసేనలు వచ్చి చేరాయి. నికల్సన్ గొప్పయోధుడు. ఇతడు తన రెండువేలమంది సైనికులతోనూ నీమూచ్ సిపాయి దళాన్ని ఎదిరించి ఓడించాడు. ఇది ఆగస్టు 25న జరిగింది. ఈ మొదటి విజయంతో బ్రిటిష్‌వారికి ఆశలు చిగిరించాయి. సెప్టెంబరు 24 దాకా, అంటే మరొక నెలరోజుల దాకా ఢిల్లీవద్ద బ్రహ్మాండమైన యుద్ధం జరిగింది. అప్పటికి నగరంలో మూడువంతులు బ్రిటిష్‌వారి వశమైంది. బక్త్‌ఖాన్ చక్రవర్తిని పారిపోయి తలదాచుకోవలసిందని హితబోధచేశాడు. కాని చక్రవర్తి సందేహించాడు. బక్త్‌ఖాన్ సేనాధిపత్యం వదిలి వెళ్ళిపోయాడు. మీర్జా ఇలాహీ బక్ష్ అనే నీచుడు చక్రవర్తికి సలహాదారుగా చేరాడు. ఇతడు ఇంగ్లీషువారి దగ్గర డబ్బు తింటూ నగరాన్ని పట్టుకునే మార్గాలను ఎప్పటికప్పుడు తెలియజేశాడు. అతడే చివరికి చక్రవర్తిని లొంగిపొమ్మని హితబోధచేసి ఒప్పించాడు. సెప్టెంబరు 25కి చక్రవర్తి లొంగిపోయాడు. యుద్ధం ఆగిపోయింది. ఢిల్లీలో శ్మశానశాంతి నెలకొన్నది. కాని వెంటనే ఇంగ్లీషువారి ప్రతీకార హింసాకాండ ప్రారంభమైంది. భారతీయులపై ఇంగ్లీషు సైనికులు ఘోరాతిఘోరంగా కసితీర్చుకున్నారు. బహాదూర్ షాను బ్రిటిష్‌వారు ఖైదుచేసి బర్మాకు బహిష్కరించివేశారు.

లక్నో పతనం

ఢిల్లీ అయిన తరవాత లక్నో. లక్నో



విప్లవంలో పాల్గొన్న సిపాయిలనేకులను ఆంగ్లసేనాని నీల్ ఉరితీయిస్తున్న దృశ్యం

యుద్ధాన్ని కొత్త ఆంగ్లేయ సర్వసేనాని సర్ జేమ్స్ ఔట్రం నడిపించాడు. లక్నోలోని రెసిడెన్సీ 87 రోజులపాటు సిపాయిల నెదిరించి నిలిచింది. చివరికి సిపాయిలు ఓడిపోయారు. లక్నో తిరిగి ఆంగ్లేయుల వశమైంది. తరవాత కల్పిసంస్థాన దుర్గంవద్ద నానా సాహెబ్, తాత్యాతోపే, కుమారసింగ్ ఆంగ్లేయులచేతిలో పరాజయం పొందారు. కల్పి బ్రిటిష్‌వారి స్వాధీనమైంది.

కుమారసింగ్ అడవులకు పారిపోయాడు. నానాసాహెబ్, తాత్యాతోపే గ్వాలియర్ పారిపోయారు. బ్రిటిష్‌వారు కల్పి బిఠూర్‌లను ధ్వంసంచేసేశారు. కాన్పూరు కూడా బ్రిటిష్‌వారు వశపరుచుకున్నారు. దీనితో ఢిల్లీనుంచి అలహాబాదువరకూ అంతా బ్రిటిష్‌వారి స్వాధీనమైంది. 1858 మార్చిలో లక్నో పూర్తిగా పతనమైంది.

మిగిలినవారు ఝాన్సీలక్ష్మీబాయి, జగదీశ్‌పుర రాజా కుమారసింగ్, బిఠూర్ అధిపతి నానాసాహెబ్, ఔధ్ మౌల్వీ.

కుమార్ సింగ్

బ్రిటిష్‌వారు ముందు కుమార్ సింగ్‌తో ప్రారంభించారు. సర్ ఎవర్ తన సైన్యాలతో కుమారసింగ్‌ను అరణ్యాలలో వెంటాడాడు. కుమార్ సింగ్ గొప్ప ఉపాయశాలి. వేసిన ఎత్తు వేయకుండా బ్రిటిష్‌వారిని ముప్పుతిప్పలు పెట్టాడు. అతడు ఎప్పుడు, ఎక్కడ మీదపడతాడో ఎప్పుడు, ఎక్కడికి పారిపోతాడో ఎవరికీ తెలియదు. ఒకసారి అతడు తన మనుషులతో గంగానది దాటుతుండగా సర్ ఎవర్ ముట్టడించాడు. కుమార్ సింగ్ అప్పుడు పడవలో ఉన్నాడు. ఒక తూటావచ్చి అతని చేతికి తగిలి లోపల ఇరుక్కుపోయింది. కుమార్ సింగ్ ఆ చేతిని కోసివేసుకుని నది దాటిపోయాడు. 1858 ఏప్రిల్ 23న అతను తన జన్మస్థానమైన జగదీశ్‌పుర దుర్గం ప్రవేశించాడు. స్వాతంత్ర్య పతాకం బురుజులపై ఎగరేశాడు. 27వ తేదీన అతని చెయ్యి వాపుచేసి మరణించాడు. కాని స్వతంత్రుడుగానే మరణించాడు.

మౌల్వీ మరణం

ఔధ్ మౌల్వీ పరాజయం పొందినా ఊరుకోలేదు. తిరిగి లక్నోను వశంచేసుకోవాలని ఔధ్‌లోని సామంతులందర్నీ కూడగట్టాడు. పొవన్‌పాలకుడైన రాజాజగన్నాధసింగ్ సహాయం కూడా కోరాడు. రాజా అతన్ని తన భవనానికి ఆహ్వానించాడు. మౌల్వీ అమాయకంగా వెళ్ళాడు. అతడు ఎదురుపడగానే రాజా తమ్ముడొకడతన్ని కాల్చి చంపేశాడు. వెంటనే అతనితల నరికి బ్రిటిష్‌వారికి అందజేశాడు. వారు ఆ ద్రోహికి 50 వేల రూపాయలు బహుమతి ఇచ్చారు.

ఝాన్సీ లక్ష్మీబాయికి తోడుగా నానాసాహెబ్ తాంత్యాతోపేను పంపించాడు. కాని ఝాన్సీని ముట్టడించిన సర్ హ్యూరోజ్ వద్ద హైదరాబాదు, భోపాల్, ఢిల్లీ, మద్రాసు సేనలు దండిగా ఉన్నాయి. లక్ష్మీబాయి 1858 జనవరి 25 నుంచి ఏప్రిల్ 3 వరకు ధైర్యసాహసాలతో పోరాడింది. బ్రిటిష్‌వారు దుర్గానికి నీటిసరఫరా ఛేదించివేశారు. దీనితో ఝాన్సీ

(49-వ పేజీ చూడండి)



చూడండి! సన్‌లైట్
సగంబిళ్ల మాత్రమే ఈ
బట్టలన్నిటిని ఉతికింది!
అట్లు చేయున్నట్టిది ఆ
అధికమైన నురగ!
SUNLIGHT SOAP
SUNLIGHT SOAP
సన్ లైట్
సబ్బు
బట్టలను తెల్లగాను, కాంతివంతముగాను ఉతుకును,
S. 249-X52 TL

వనితా లోకం

శ్రావణలక్ష్మి

శ్రీ లక్ష్మి వరలక్ష్మి సౌభాగ్య లక్ష్మి
మా భాగ్య లక్ష్మివై తరలిరావమ్మ
ముక్కోటి దేవతలు నినుగొల్చుచుండ
కల్యాణకారిణీ కదలిరావమ్మ
నీరాక తెలియంగ గగనాంతరాన
మేఘకన్యలు వింతనాట్యంబుజేసె
విద్యుల్లతల్ మెఱసె జయభేరి మ్రోగ
ధారలై వర్షించె ధాత్రి పులకించె
స్వాగతము స్వాగతము సుస్వాగతమ్మ
శ్రీ మహాలక్ష్మికిదె ఘనస్వాగతమ్మ
శ్రావణంబే తేర స్త్రీజనాళికిని
ఆనంద ముప్పొంగు అమరవాహినులై
గృహము వెల్లలు వేయ ధావళ్య మరయా
పచ్చని తోరణాల్ చక్కంగ మెరయా
పసుపు కుంకుమ లంట గుమ్మాల పంటా
సౌభాగ్య శ్రీలలరు గృహలక్ష్మిలంటా
ఇంటింట గృహలక్ష్మి అంతర్యమందూ
నిన్ను పూజింపంగ నౌత్సుక్యమునను
రంగవల్లులు దిద్దు సౌరభ మ్మెకతో
రత్నాసనము వేయ రోచనం బొకతో
పసిడి పీటలు వేయ మదితలచు టొకతో
పుష్పాసనము వేయ కోర్కె వేరొకతో
పూజల్లులై కోర్కె లుల్లమలరంగా
వెన్నెల వెలుగులై మది ప్రతిఫలింపా
శ్రీలక్ష్మి శుభలక్ష్మి శృంగారలక్ష్మి
విష్ణు వక్షఃస్థలిని వెలసినా లక్ష్మి
పూర్ణిమా ముందైన శుక్రవారమునా
అభ్యంగన మొనర్చి యత్యంతభక్తి
గృహ మధ్యమంబునా స్థలశుద్ధిజేసి
రంగవల్లులు దిద్ది రమణీయ మొసగ
కదళి తరువులు దెచ్చి నలుదిశల్ నిల్పి



చూతపత్రములతో తోరణాల్ గట్టి
మండపం బేర్పరచి మధ్యభాగమున
తళతళా మెరసెడి రజత పళ్ళెమున
పుష్పాక్షతలు జల్లి అంజలిఘటించి
ఓంకార నాదముల శంఖాలు మ్రోగా
పూర్ణకలశము నిల్పి మూర్ధభాగమున
తెలితామరల్ నిల్పి కడుభక్తితోను
నిన్నధిష్ఠింపంగ నేత్రోత్సవంబౌ
శ్రీ మహాలక్ష్మిరో ఆవాహయామి.
పసుపువన్నెల మేను మిసిమినొప్పార
పన్నీరు గంధంబు పరిమళింపంగ
లేపల్లవంబులగు పదపద్మములకు
శతపత్ర రజమును చక్కంగబూసి
సొగసైన కలువలా తొగరులందిద్ది

పట్టు దుకూలముల్ మేన మెఱయంగ
రత్నకిరీటంబు రాజిత్వ మొప్ప
కనుల కాటుకరేఖ కాంతులీనంగ
ఫాల కుంకుమరేఖ ప్రజ్వలింపంగ
వరపుష్పదామంబు గళము శోభింపా
శంఖ చక్రంబు లిరుహస్తముల మెఱయ
చిరునవ్వు మోమునా చివురు పెట్టంగ
అభయహస్తంబొసగి ఆశీర్వదించు
నీమూర్తి కనువిందు మా జన్మమందు
నీలాలు గురియించు నేరేడుపండ్లూ
పండినా జామలు సీతాఫలాలూ
పసిమి వన్నెల నీను కదళీ ఫలాలు
శర్కరాఘృతమిళిత పంచామృతంబూ
భక్ష్యభోజ్యములతో మహాభోగమొసగి
ధూపదీపంబులతో నారాధ్యమొసగి
శ్రీలక్ష్మి మహాలక్ష్మి సౌభాగ్యలక్ష్మి
మాపాలి వరలక్ష్మి మమ్మేలుకొమ్మ
కనకాసనము నీయ కడుపేదనమ్మ
రత్నాసనమునీయ నిరుపేదనమ్మ
పసిడిపీటలు వేయ కలిమిలేదమ్మ
క్షీరాబ్ధితనయ నను క్షమియింపు మమ్మ
పద్మవాసినివని పేర్గంటి నమ్మ
నా హృదయ పద్మాన వసియింపవమ్మ
భక్తి భావనలచే నిన్నధిష్ఠించి
ఆనందబాష్పముల జలకమాడించి
హృదయ తంత్రులుమీటి నిన్ను బలికించి
పద్మాసనీయనీ పలుమారు దలచి
శ్రీ రమాయని నిన్ను శరణుగోరుచును
నారాయణీ యని నమోవాక మొసగి
త్రైలోక్య జననివని నిన్ను ధ్యానించి
ఆత్మార్పణముజేతు నమ్మరో నీకు.

డి. యస్.
రాజేశ్వరీ పట్నాయక్

తెల్లచీరెలూ, మల్లెపూవులూ, వెన్నెల రాత్రులూ

తెలుపు బట్టలు వేసుకునే మనుషులను చూస్తే తెలియకుండానే మనసులో గౌరవ భావం మెదులుతుంది. తెలియని ఆకర్షణ కలుగుతుంది. నిరాడంబరంగా, సుగుణాలన్నీ కుప్పబోసినట్లుంటారు గంభీరంగా గొప్ప మేధావులైనట్లు కన్పిస్తారు.

దేవలోకవాసులను వూహించబోతే అల్లలాడుతున్న తెల్లని బట్టల్లోనే కన్పిస్తారు

కాంతి గుణానికి తెలుపు చిహ్నం తెలుపులోనించే ఏడు రంగులూ పుట్టాయని రుజువు చేశారు శాస్త్రజ్ఞులు గొప్పవాళ్ళని తెలుపురంగులోనే ఊహించబోతాం. తెల్ల పిల్లను చూసి పెళ్ళాడటానికి సిద్ధపడతారు యువకులు. ఎవర్ని గురించైనా కనుక్కోబోయి 'తెలుపా నలుపా' అని అడుగుతాం ఇంటికి తెల్లని సున్నం వేస్తే వచ్చినఅందం పసుపు, నీలి మొదలైన రంగులు వేస్తేరాదు ఇదంతా చూస్తుంటే వెలుగు, విజ్ఞానం, అందం, ఆనందం అన్నీ తెలుపులోనే వున్నాయనిపిస్తోంది

ఏ నవల తెరవబోయినా, ఏకథ చదవబోయినా "తెల్లనిచీర కుచ్చెళ్లు..." ఏమిటిదంతా ! తెలుపంటే ఇంతఇష్టమా ! కాని రోజూ చూస్తూంటే తెల్లటిబట్టలు కట్టేవాళ్ళు చాల తక్కువగా కన్పిస్తారు ఆడవాళ్ళలోకన్నా మగవాళ్ళలో ఎక్కువగా తెలుపుబట్టలు కడతారు

ఏవిధంగా చూసినా తెలుపు బట్టలు అందాన్నే ఇస్తాయి. అనాకారైనా, అందగత్తెయినా తెలుపుబట్టలు వేసుకుంటే, వున్న అందంమాత్రం పోదు. కొంతమంది ఆ బట్టల్లో ఎక్కువ అందం చూస్తారు కొంతమంది మామూలుగా చూస్తారు. కాని తమకేదో అందం తగ్గిపోయినట్టుమటుకు భావించ రనుకుంటాను

ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క రంగుబట్టలు ఫాషనుగావుండి ఎన్నో రంగులు మారుతూనే వున్నాయి గాని తెలుపుస్థానం మాత్రం ఎప్పుడూ స్థిరంగా నేవుంది. తెలుపు మాపు వోర్చదు త్వరగా మాసిపోతుందనే భయంతో రంగుచీరలు కట్టుకుంటూంటారు చాలమంది అదీ నిజమే !

వేసవికాలం బాగా వుక్క పెడుతున్న రోజుల్లో పల్చని తెల్లబట్టలు చాల హాయిగా వుంటాయి. ముఖ్యం సాయంత్రపు వేళల్లో తెలుపుచీరలు బాగా రాణిస్తాయి. చంటి పిల్లలకు తెల్లని చొక్కాలే బావుంటాయి. 'జరీ అంచు తెల్లచీర' 'జరీఅంచు తెల్లచీర' ఎప్పుడో చదివిన ఆకథ నాకిప్పటికీ మనసులో మెదులుతూనే వుంటుంది. అందరూ తెల్లని చీరలే కట్టుకుంటే—బస్సుల్లో, రైళ్ళలో వీధుల్లో ఎలావుంటుందో ఊహించాలని పిస్తుంది. కాని ఈరంగులన్నీ వుండడం వల్లనే తెలుపుయొక్క విలువ తగ్గకుండా వుందనిపిస్తుంది.

వేసవికాలం పుచ్చపువ్వులాంటి వెన్నెల్లో పడుకుని కథలు చెప్పుకోవాలనిపిస్తుంది— చిన్నప్పుడు

పెద్దవాళ్ళయిన తరువాత జంటగా ఎక్కడో ఊరవతల, ఎంతదూరమైనా తెలియకుండా గంటలతరబడి నడవాలని పిస్తుంది.

పాలవెల్లిలాంటి చంద్రబింబం తళతళలాడుతూ వెన్నెలనిస్తోంటే నిద్రపోవాలనిపించదు. అలా ఏవేవో కబుర్లు చెప్పుకోవడమో, నిశ్శబ్దంగా కూర్చుని చూస్తూండడమో చేయాలనిపిస్తుంది. ఏవేవో ఆలోచనలు వెనుకటి స్మృతులో, రాబోయే అనుభవాల చాయలో, సినిమాల్లోని బొమ్మలో, పుస్తకాల్లోని నీడలో మెదడులో తిరుగుతుంటాయి

పి. సరళాదేవి

"భోజనం దేహి రాజేంద్ర, ఘృత, సూప సమన్వితం" అని ఒక శ్లోకం మొదలు పెట్టాడో పండితుడు.

అపుడు "మాహిషంచ శరచ్చంద్రచంద్రికా ధవళం దధిః" అని మహాకవి కాళిదాసు పూరించినట్లు ఒకకథ ఆ భోజనం ఎలా వుండాలో చెప్పడంలో శరత్ కాలపు వెన్నెలలాంటి గేదె పెరుగు వెయ్యాలన్న మాట.

అట్లతద్ది నాటిరాత్రి వెన్నెల్లో వుయ్యాల లూగుతారు ఆడపిల్లలు. ఎంత సంతోషంగా వుంటుందో చెప్పలేం! ఆరుబయట నిశ్చలంగా కూర్చుని, పుచ్చ పువ్వులా విసురుతోన్న చందమామను, మిలమిల మెరుస్తోన్న వెన్నెలను చూస్తోంటే సమస్యలన్నీ విడిపోయి కష్టాలన్నీ తొలిగిపోయినట్లు హాయిగా తేలిగ్గా గాలి పీల్చగలుగుతాం.

"ఎన్నెలల సొగసంత ఏటిపాలేనటర" అని ఎంకి పాడుతూంటే, మనసు, వళ్ళు అంతా కదిలిపోతుంది. కావ్యనాయిక లందరూ వెన్నెలకన్నెలే! ఏ సినిమాలో నయినా పున్నమినాటి వెన్నెలలో పాట పాడని నాయికవుందో!! వెన్నెలను చూస్తే దూరంగావున్న ప్రేయసీ ప్రియులకు విరహం ఎక్కువవుతుందిట. దగ్గరగా వున్న ప్రేయసీ ప్రియులకు హరషం ఎక్కువవుతుందిట!

"పాలసంద్ర పుటలలు పట్టెమంచముగా, పున్నమి వెన్నెలలు పూలపానుపుగా" అని పాడింది ఓ నాయిక. పాడడం కాదు వెన్నెల్లో ఎక్కడ పడుకున్నా చల్లని మెత్తని పూలపాన్పుమీద పడుకున్నట్లుంటుంది బీచిల్లో, ఏటి ఒడ్డున, ఇసుకలో, కాసేపు కూర్చున్నవాళ్ళు ఊహించుకో వచ్చును ఆ హాయి.

గొప్ప బీద, చిన్న పెద్ద అన్న తారతమ్యం లేకుండా అందరికీ సమంగా వస్తుంది వెన్నెల! సంసారాల్లోని రహస్యాలు, హృదయాల్లోని బాధలు కష్టాలు అన్నీ సానుభూతితో చూసి, పూత రేకుల్లాంటి తన వెన్నెల మడతల్లో దాచేసుకుంటుంది— ఎవరికీ కన్పించ కుండా.

తెల్లచీరలకు, వెన్నెలరాత్రులకు తోడు మల్లెపూలమాలలు కూడా వుంటే ఇంకా అడగాలా!! అర ఫర్లాంగు దూరంలోనే తెలియ చేస్తాయి తాము అక్కడున్నామనే సంగతి మల్లెపూలు! పూలు నచ్చని స్త్రీలు ఎక్కడా వుండరనుకుంటాను. అందులోను మల్లెపూలు నచ్చని స్త్రీలు ఎక్కడా వుండరనుకొంటాను. ముఖ్యం వేసవి కాలం సినిమాల్లోనూ, పేరంటాల్లోనూ, ఆడవాళ్ళు గుమికూడే ప్రతిచోట ఘుమఘుమ లాడుతూ దర్శన మిస్తూంటాయి నల్లని వెంట్రుకల మధ్య తెలతెల్లగా మల్లెల మాలలు!

"అప్పుడే విచ్చుతూన్న మల్లెపూవులా వుంది ఆమె" "మల్లెమొగ్గలాంటి పలువరస" "మల్లెపూవులాంటి శరీరం" ఇలా మల్లెపూవుతో పోల్చని మనుషులే వుండరు.

"తెల్లని చీర కుచ్చెళ్ళు పల్చని పాదాలపై తళతళ లాడిస్తు, తల్లోని మల్లెపూల వాసన మత్తెక్కిస్తుంటే పున్నమి చంద్రునితో పోటీలు పడుతూ, వెన్నెలలో కలిసి పోతూ .." వస్తుంది కథానాయిక, అందులోనూ మగవాళ్ళకథల్లో నాయిక. ★



డొర్ కర్టనుకు


శ్రావణమాసంలో

శ్రావణమాసం శనగాలాను,
కడుపూనొప్పి మందులాను
వదినగారి పోకూలాకూసానా,
అందిట ఓ చిన్నారి ఆడబడుచు
అందులు త్రొక్కుతూ—
అప్పుడే యవ్వనంలో అడుగుపెట్టిన — వదినగారికీ, బాల్యదశలో పదుసులు పెట్టే ఆడబడుచుకూ వార్ధక్యంలో అడుగు పెడుతున్న అత్తగారికీ — ఒకరికేమిటి సౌభాగ్యంతో తులతూగే ప్రతివనితకూ ఆనందాన్నిచ్చే శ్రావణమాసం తొలకరి మెరుపులా ఏడాదికొకసారి వచ్చి అదృశ్యమైపోతుంది.

సౌభాగ్యంకోరుతూ మంగళగౌరిని ఈమాసంలోనే పూజిస్తారు. నాకు బాగా జ్ఞాపకం. నాచిన్నప్పుడు మావదిన ఈనోము పట్టింది ఆ ఆనందం మావదినదే కాదు నాది కూడాను. మావదినకు మాపూరు కొత్త అందుకని పూరుచూపిస్తానని నెపంతో ఆపూట బడిఎగ్గొట్టి సోమవారంనాడే పేరంటాళ్ళను పిలిచేందుకు మావదినతో బయలుదేరేదాన్ని.

ఆకాశమంతా శ్రావణమేఘాలతో నిండుగా అందంగా ఉండేది వచ్చేపోయే వాన జల్లులో తడుసుకుంటూ, మధ్యమధ్య ఏచూరువారనో నిలపడుతూ మావదినపక్క

(42-వ పేజీ చూడండి)



ప్రకృతిప్రసాదించిన పరమౌషధాలు: (4)

[గతవారం తరువాయి]

మకరందము

ముఖ్యంగా శిశువులకు కృత్రిమాహారం వల్ల చాలా రోగాలు ఉత్పన్నమౌతున్నాయి. కృత్రిమాహారంలో పంచదార ఒకటి! మనలో చాలామంది, తీపికోసం, రుచికోసం మూఢంగా పాలల్లో పంచదార కలిపి పిల్లలకు పట్టుతూవుంటారు. అదిచాలా దుర్గుణం. పిల్లలకు కల్గుచున్న రోగాలన్నీ యీ పంచదారవల్లే కల్గుచున్నట్లు తెలుస్తుంది. పిల్లల జీర్ణకోశాన్ని, లివర్‌ని నాశనం చేసి చాలారిష్టములను కలుగచేస్తుంది. పంచదార పిల్లలకు ప్రమాదకరం అని గుర్తించాలి. అందుచేత ప్రతీ తల్లీ తన శిశువునకు కృత్రిమాహారంపెట్టి వాళ్ళశరీరాన్ని పాడుచేయరాదు. శిశువులతత్వం ఆదిలోనే దెబ్బతింటే వారి జీవితమంతా నాశనమయిపోయి, తర్వాత సంతతికికూడ తీరనిముప్పు తెచ్చిపెట్టుంది. కాబట్టి చిన్నతనంనుండి కృత్రిమాహారం అలవాటుచేసి మన సంతానాన్ని మన చేతుల తోనే నాశనం చేయుటకు పూనుకోనవద్దు. పోతపాలు (తల్లి పాలు లేనప్పుడు) పట్టే ప్రతీ తల్లీ వైవిధ్యాన్ని దృష్టియందుంచుకొని పాలల్లో పంచదార కలపకుండా తేనె కలిపి వాడుట చాలా ఉత్తమం. తేనెకు ప్రత్యేకంగా విషక్రిములను నాశనం చేసే శక్తిగలదు. పిల్లల లివర్, గుండె, జీర్ణకోశమందలి ఇతర బాధలను పోగొట్టి రక్తాన్ని శుభ్రంగా ఉంచుతూ ఏరోగాల్నీ రానివ్వకుండా కాపాడుతుంది. పసిపిల్లలకు వాడుటచే త్వరగా రక్తం వృద్ధిఅగును, ఎముకలకు మంచి పటుత్వ కల్గిస్తుంది. రక్తమందలి ఎర్రకణాలను వృద్ధి చేస్తుంది. బాలరోగాలందు అనుభవజ్ఞులైన వైద్యవరులు తేనెనుపయోగించి, ఆశించనంతటి గొప్పఫలితాలను పొందియున్నారు.

ఇది పిల్లలకు పుష్టికరమైన బలవర్థక టానిక్‌గా పనిచేయునని వైద్యప్రవీణులు ఎందరో నొక్కి చెప్పుచున్నారు.

కొంచెం ఎక్కువ వాడినా...

తేనెను కొంచెం అధికంగావాడినా చెడు గుణాలుగావు, కొంచెం వేడిచేస్తుంది.— పంచదారను అధికంగా పిల్లలకుపయోగిస్తే, అజీర్ణము, శూలలు మొందలైన జీర్ణకోశ వ్యాధులేగాక ముఖ్యంగా వాళ్ళతత్వమే మారిపోతుంది. మూత్రపిండములను చెరపును. అనేక మేహవ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది. రక్తం మలినం అవుతుంది. ఈ మధ్య పంచదారధర హెచ్చింది, గాని అది మరీ యెక్కువయి సామాన్యులకందు బాటులో లేకుంటేనే మేలుగా వుండేదనిపిస్తుంది.

చంటి పిల్లలకు వచ్చే భయంకరమైన జబ్బులలో శిశుపక్షవాతం (ఇన్‌ఫన్‌టైల్ పెరాలిసిస్) ఒకటి. నెలల పిల్లలప్పటినుంచే శిశువులకు పాలల్లో తేనెకలిపి ఇస్తే ఆవ్యాధి రాదని కూడా అనుభవంగల వైద్యులు చెబుతున్నారు. అదిగాక శిశువు మాతృగర్భంలో వున్నప్పుడే - తల్లి గర్భధారణ పొందినది లగాయితు ప్రసవించేవరకూ ½ ఔన్సు తేనె మంచి నీళ్ళలో కలిపి (వీలైతే పాలల్లో) ఉదయం తీసుకుంటే మంచి బలాఢ్యులైన, ఆరోగ్య వంతులయిన పిల్లలు కలుగుతారు. అట్టి శిశువులకు ఎటువంటి బాలారిష్టాలూ సాధారణంగా రావు.

సంగాని ప్రభావతి, భానుమతి

పెద్దలకు

పెద్దవాళ్ళు కూడ నిత్యం తేనె తగు మోతాదులో నీళ్లయందుగాని పాలయందు గాని కలిపి ఉదయం తీసుకొంటే దేహానికి మంచిపుష్టి, శక్తి కల్గించును. నిత్యం తేనె వాడే వారికి ఏలాంటి వ్యాధులు రావు. తేనె వాతహరము, శ్లేష్మహరము. పాతతేనె (నిల్వవుంచినది) త్రిదోషహరము. త్రిదోషములనగా వాతము, పైత్యము, శ్లేష్మము— వీటిలో యేఒక్క దోషం ప్రకోపించినా శరీరం వ్యాధిగ్రస్త మవుతుంది.

తేనె, వాడినవెంటనే రక్తమును చేరి యే ఏ అవయములు దోషయుక్తంగా వున్నవో అక్కడికిచేరి అక్కడి మాలిన్యాన్ని నిర్మూలిస్తుంది. విషక్రిములను నాశనంచేస్తుంది. విరేచనకారి. కొద్దిగ పుచ్చుకుంటే విరేచనం కట్టుంది. హెచ్చుగా పుచ్చుకొంటే విరేచనం గావిస్తుంది. తీపిని అధికముగా వాడుటవలన చెడిపోయిన కోష్ఠమును శుభ్రపరిచి మంచి బలము ప్రసాదించును. మూత్రకోశమునందలి మాలిన్యాన్ని పారద్రోలి మూత్రపిండములను (Kidneys) మూత్రకోశాన్ని (Blader) శుభ్రము జేస్తుంది. ఆహార విహారాది భేదములచే జనించిన అనేక రోగాల్ని - వర్తి విదాహం, మేహము, కాసము, పక్షవాతము— హరించును. క్షయవ్యాధులందు శరీరమున కుపశాంతి కల్గించి పుష్టినిచ్చును. కఫము వ్యాధులను, అర్శోగముల నుపశమించి వాటి దుష్టమును హరింపజేయును. రక్తపిత్తమును శమింపచేస్తుంది. దుష్కరక్తముచే పుట్టిన వ్రణములనుమాన్పును. శూల, ఎక్కిళ్లు వాంతులను తగ్గిస్తుంది. ఏ కారణమూ లేక చిక్కిపోతున్న వారికి చెప్పరానంత మేలు కల్గించును. అలాగే దేహమంధలి స్థౌల్యాన్ని తగ్గిస్తుంధి. ప్రత్యేకంగా నేత్రముల కంతో మేలుచేస్తుంది. దృష్టిని గూడ ప్రసాదించు

వని కొన్ని గ్రంథాలలో చెప్పబడింది. మూత్రకం, క్షుద్రమునే తేనెలు నేత్ర రోగాల్ని హరించును. ఇవి ఆయుర్వర్ధకాలు కూడా.

ఇంక వివిధ వ్యాధుల్లో మధు ఎలా వుపయోగిస్తుందో చూద్దాం:—

వాపులకు, నొప్పులకు :

కారపు సున్నం(తడిది) తేనెకలిపి వాచిన భాగంలోను, నొప్పులున్నచోట రాస్తే తగ్గిపోతవి.

రక్తగ్రహణి :

రక్తగ్రహణి రోగులకు ఏరోరూట్ (Arrow Root) పిండితో కాచిన పల్చటి గంజిలో పావు స్పూన్ తేనె కలిపి పట్టిస్తే చాల చక్కటి గుణమిస్తుంది

ఉత్సాహానికి :

గ్లాసు నీళ్లలో ఒక నిమ్మపండు రసం కలిపి అందు రెండు పెద్ద చెంచాల తేనె కలిపి తీసుకుంటే చాలా చలాకీ పుట్టుంది.

లివర్ - స్ప్లీన్ వ్యాధులకు :

తెల్లముల్లంగి దుంపలను శుభ్రంగా కడిగి పైపొట్టు (పొర) తీసివేసి అడ్డుగా కోస్తే గుండ్రటి చెక్కలుగా వస్తాయి. నాల్గవ భాగం అంగుళం మందంవుంచాలి. ఆ ముక్కలు శుభ్రమైన గాజుసీసాలో వేసి ఆ ముక్కలు తడిసేలా తేనెవేసి 4 రోజులు వూరబెట్టి ప్రతిదినం ఉదయం, సాయంకాలం తింటే లివర్ వ్యాధుల్లో యెంతైనా మేలు చేస్తుంది. కష్టతరమైన లివర్ వ్యాధుల్లో అన్నం మానివేసి గోధుమజావ వాడితే మంచిది

(లేదా) పొంగించిన తెల్లముల్లంగి రసంలో తేనె కలుపుకొని ఉదయం, రాత్రి ఒక ఔన్సు చొప్పున సేవిస్తే కూడ మంచి మేలు చేస్తుంది.

మలబద్ధకము :

చాలామంది స్త్రీలలో యీ వ్యాధి వున్నది. తగిన మరుగుప్రదేశము ఆడవాళ్లకి లేకపోవుట దానికిగల కారణాల్లో ఒకటని తెల్పుటకెంతయో చింతిస్తున్నాను. యెక్కడచూచినా యీ లోపమే కన్పిస్తుంటుంది. ఒక్కొకచోట ఎన్నో కుటుంబాలు కాపరం వుంటున్న గృహంలోని వాళ్లి అవస్థలు చెప్పలేం. ముఖ్యంగా పట్నంలోనివాళ్లి బాధలు వర్ణనాతీతం. యింక పల్లెటూళ్లలోని వారికి సరైన మరుగుప్రదేశం వుండదు. అన్నిపనూ సరిపెట్టుకొన్న తర్వాత రాత్రులు తీరుబడిగా వెళ్తారు. వాళ్లకి పగటిసమయంలో తొందరగా వెళ్లవలసివచ్చినా స్థలంలేక నిర్బంధించుతారు. యిదే చాలా ప్రమాదం; అనేక వ్యాధులను కలిగిస్తుంది. రక్తాన్ని విషపూరితం చేస్తోంది ఎన్నోవేలు ఖర్చుపెట్టి కట్టించుకొనుచున్న యిళ్లకు సక్రమమైన, అవసరమైనంత మరుగుదొడ్లను నిర్మించకపోవడం చాల శోచనీయం! వ్యాధులు రావటానికి మరుగుదొడ్లే ముఖ్యకారణం. మనం నివశించే గదులు యెంత పరిశుభ్రంగా వుంచుకొంటామో అట్లే యీ మరుగుదొడ్లు కూడ పరిశుభ్రంగా వుంచాలి. ఆరోగ్యాన్ని కాపాడేది, పాడుచేసేది మరుగుదొడ్డే. యిది మరువరానిది. మ్యునిసిపాలిటీవారుకూడా గృహనిర్మాణమునకు ప్లాను చూచి అనుమతి ఇచ్చేటప్పుడు ఇన్ని గదులుంటే యింత విశాలమైన మరుగుదొడ్డి వుండాలని, నియమిస్తే చాలామంచిది. గ్రామాల్లో ఈ మధ్య కనిపెట్టబడిన 'సెపిక్ లెట్రిన్స్' వంటివి, డబ్బుగలవాళ్లు విధిగా కట్టించుకోవడం మంచిది తతిమ్మవాళ్ళకి తగినన్ని సెప్టిక్ లెట్రిన్స్ పంచాయితీలు కట్టస్తే, భారతదేశ ప్రజలసొమ్ము 'మైసీన్ల'కే మందుల నిమిత్తం (ఆరోగ్యమైసీన్, స్ట్రెప్టొమైసీన్ మొ॥) విదేశాలకి వెళ్ళదనుటలో అతిశయోక్తి లేదు.

కాబట్టి మలమును బహిర్గతంచేయక బలవంతంగా ఆపుటవల్ల ప్రేగులకు బహిర్గతం చేయు శక్తి పోతుంది. తద్వారా మలబద్ధక మేర్పడుతుంది.

సక్రమమైన జాగ్రత్త ఆహార విహారాదుల్లో తీసుకొనక పోవుటవల్లకూడ మలబద్ధకం యేర్పడుతుంది.

తేనె మలబద్ధకమును పోగొట్టుటకు అత్యుత్తమ సిద్ధౌషధం. తేనెలో ఒక విధమైన వాయువు జనించి అది ప్రేవులను అంటిబెట్టి యున్నట్టి, గట్టిబడిన మలమును ప్రేవులనుండి విడదీసి, పల్చబరచును. బైటికి నెట్టివేయటానికి కావలసిన శక్తి పెద్ద ప్రేగులకు కల్గించును.

మలబద్ధక మున్నవారు యీక్రిందివిధంగా తేనెవాడుటచే మలబద్ధకం నివారణయగుటే గాక, మంచి బలం కల్గును.

పది ఎండుద్రాక్షపండ్లను శుభ్రంచేసి (లోపల గింజలు, పైన ముచ్చిక పుల్ల తీసివేసి కడిగేస్తే చాలు) 2 ఔన్సుల వేడినీళ్లలో రాత్రి వేసి నానబెట్టి తెల్లవారుఝాము నే లేచి ఆ నీళ్ళలోనే పండ్లను చేతో బాగా పిసికి వడియబోసిన రసంలో ½ ఔన్సు తేనె కలిపి త్రాగివేస్తే తెల్లారేటప్పటికి ఝాడించి విరేచనం అవుతుంది. ఇది మందు కాదు. పుష్టికర ఆహారంకూడా! (సశేషం)

★ గంధముతో కాటుక చేసే విధము ★

కాటుక చేయు విధము చాలామంది చాలా రకాలుగా చేస్తారు. వాటిలో ఇది ఒక రకము. చాలా బాగుంటుంది. చిన్న బిడ్డలకు పెట్టితే కంటి జబ్బులుకూడ రావు, ఎట్లనగా గంధపు చెక్క తీసుకొని గంధము తీసే సానమీద కొంచెము, కొంచెము నీళ్ళు పోస్తూ చిక్కగా గంధము తీసుకొని, ఒక కొత్త మూకుడుకు మధ్యన వొత్తుగా అంటె అరంగుళము మందములో అరచేతి వెడల్పున పూరిన గంధము మూకుడు మధ్యగా పట్టించవలెను. మరి ఒక ప్రమిద తీసుకొని, దాని నిండుగ ఆముదము పోసి, దూదితో ఒక వత్తి పొడుగ్గా చేసి దానిలో వేసి అంటించాలి. ఆ దీపము మధ్య పెట్టి చుట్టూ పొయ్యిమాదిరిగా రెరాళ్లు (ఒకేసైజువి) పెట్టవలెను. అపుడుగంధముఅంటించిన మూకుడు రాళ్ళపైన సరిగా బోర్లించాలి. గంధము వుండే చోటుకు సరిగా మంట తగిలేటట్లు బోర్లించవలెను. వాటి పైన ఒక వడబుట గాలి తగులకుండ బోర్లించాలి ఇది అంతా ఒక ప్రక్కనో లేక, ఒక మూలకో జాగ్రత్తగా పెట్టవలెను దీపము చక్కగా మండేటట్లు చూసుకొనవలెను. గాలి విసురుగా తగిలితే మంట చెదిరిపోతుంది ఇట్లు ఒక 2 గంటలు గంధము వుండే చోటు మంట తగిలిన తరువాత, మూకుడును తీస్తే, అది అంతా బాగా కాలి, బుగలు, బుగ్గలుగా నల్లగా మసివస్తుంది దానిని తీసి ఒక రాగి తట్టలోనో అదిలేనివారు, తమలపాకు మీదకేనా సరే చాకుతో అంతా తీసుకొని తమలపాకులో వేసి, అందులో వండిన ఆముదము ఒకటి రెండు ముక్కలు వేసి వ్రేలితో బాగుగా కలుపాలి. దానిని ఒక రాగి భరిణలో వేసుకొంటె చక్కగా వుంటుంది కన్నులు మంట కూడా వుండగు. శ్రేష్ఠమైన ఆముదము వాడవలెను. చేసేది కొంచము కష్టమైనా, శుభ్రముగా ఇంటిలో చేసుకొన్నామనే తృప్తివుంటుంది. కాబట్టి ప్రయత్నము చేసిచూడండి, చాలా బాగా ఉంటుంది.

జి. లక్ష్మీదేవమ్మ, (చంద్రగిరి).



నారసింహ లేహ్యము
బంగారుతో చేరినది మేహము, నిస్త్రాణ, నిస్సత్తువవగైరా హరించి బలము రక్తవృద్ధికల్గించును 20 తు. డబ్బి రు 3-4-0 పోస్టేజి రు 1-1-0,
పి వి ఏ అండ్ కో, (ఆయుర్వేద సమాజం) పెరిదేపి (పోస్టు) — నెల్లూరుజిల్లా

★ వంటలు ★

"బెంగుళూర్ పూరీ"

కావలసిన వస్తువులు ఒక అర్ధశేరు బియ్యపుపిండి, నూనె లేక నెయ్యి.

తయారుచేయు పద్ధతి ఒక వెడల్పాటి మూతిగల పాత్రలో 3 పావటాకుల నీరుపోసి కాగనివ్వాలి. ఆ మరుగుతున్న నీళ్ళలో కొద్దిగా ఉప్పు వేయాలి. తర్వాత ఈ బియ్యపుపిండిని వుండగట్టకుండా కలియ పెడ్తూ ఈ నీళ్ళలో పోయాలి. బాగా కలియబెడ్తూవుంటే కొద్దిసేపటికి ఈబియ్యపు పిండి అంతా గట్టిగా ముద్దవుతుంది. తర్వాత కొంచెం చల్లారాక కొద్దిగా నెయ్యిరాచి ఈ పిండిముద్దను పిసుక్కోవాలి. ఈ పిండి ముద్దను చిన్న చిన్న ముద్దలుగా తీసుకొని పీటమీగ పూరీలక్రరతో పల్చగా పూరీల మాదిరిగా చేసుకోవాలి. పొయ్యిమీద బూర్లమూకుడుపెట్టి నెయ్యి లేదా నూనె పోసి ఈ పూరీలను వేయించుకోవాలి.

పైన చెప్పిన పూరీలలోకి చక్కరకు బదులుగా శెనగపిండితో ఆదరువు చేసుకొని తింటె చాలా బాగుంటుంది. పావుశేరు నీళ్ళలో పావుశేరు శెనగపిండిపోసి కొద్దిగా వుప్పువేసి కలియబెట్టాలి 2 వుల్లిపాయలు, 3 పచ్చిమిరపకాయలు సన్నగా తరుగుకోవాలి. బాణలిలో కొద్దిగా నూనె వేసి ఈ తరిగిన వుల్లిపాయలు, పచ్చిమిరపకాయలముక్కలు వేసి కొంచెం వేగినతర్వాత ఈ కలుపుకున్న శెగనపిండిని బాండలిలో పోసేసి గరిటతో కలియబెడ్తూవుంటే పొడి పొడిగా వస్తుంది. దీనిని పూరీలలో పెట్టుకొనితింటే చాలా బాగుంటుంది. ఈ శెనగపిండి 'పొగటు'ను మరే ఫలహారంలోనైనా కూడా తినవచ్చు. గోధుమపూరీలు తిని తిని విసుగెత్తినవారు ఈ పూరీలను ఒకసారి ప్రయత్నంచేస్తే మరో కొత్త ఫలహారం రుచిచూచినట్టవుతుంది.

* * *

"ఉల్లిగడ్డ బిర్యాని"

కావలసిన వస్తువులు. వుల్లగడ్డలు-5, నెయ్యి-5 పలములు, రెండు వుల్లిపాయలు, 6 పచ్చిమిరపకాయలు, బొంబాయిరవ్వ-అర్ధశేరు. లవంగాలు, లవంగపట్ట, జీడిపప్పు, తగుమాత్రం టెంకాయపాలు.

తయారుచేయు పద్ధతి వుల్లిపాయలు, పచ్చిమిరపకాయలు చిన్నని ముక్కలుగా తరిగిపెట్టుకోవాలి. పచ్చి వుర్లగడ్డలమీది పైతొక్కను చాకుతో తీసివేసి ముక్కలుగా చేసుకోవాలి. అర్ధశేరు బొంబాయి రవ్వను (లేదా బియ్యపు రవ్వను గానీ) కొద్దిగా నేతిలో వేయించి వేరెపళ్ళెంలోకి తీసుకోవాలి. ఒక టెంకాయలో సగం తీసుకొని దానిని తురిమి పాలుతీసుకోవాలి పొయ్యిమీద బాణలిని పెట్టి 5 పలాల నెయ్యిని పోసివేయాలి. నెయ్యి బాగా కాగినతర్వాత పచ్చిమిరపకాయలు, జీడిపప్పు, లవంగాలు, లవంగపట్ట, వుల్లిపాయల ముక్కలు వేసి బాగా వేగనియ్యాలి. ఇవన్నీ బాగా వేగిన తర్వాత తరిగిపెట్టుకున్న వుర్లగడ్డముక్కలు కూడా వేసేయాలి. కొద్దిసేపుఅయాక ఒక అర్ధశేరు నీళ్ళు వాటిలోపోసి బాగా తెర్లేక, రవ్వను గంటితో కలియబెట్టూ పోయాలి. తర్వాత బాణలిపైన మూత వేసేయాలి. సగం వుడికాక టెంకాయపాలు, యింకా కొంచెం నెయ్యిపోసి క్రిందిమంట తీసేయాలి. కొద్దిగా పెగమీద యింకొంచెం వుడకనిచ్చి దించుకోవాలి. లవంగాలు, లవంగపట్ట వున్నందువల్ల కమ్మటివాసన వస్తుంది. తినేందుకు కూడా చాలా రుచిగా వుంటుంది

పి. అనసూయ

★ ఇడ్లీ పాత్ర ★

మొత్తం ఆరు ఇడ్లీలు వుడికేపాత్ర కొనాలంటే, సుమారు 15రు అవుతుంది. అంత ఖరీదుపెట్టి పాత్రకొంటే ఇద్దరు తినేందుకే గాని నలుగురైదుగురు వున్న ఇంట్లో చాలదు. ఆ ఖరీదుకే అంతకన్న సులువుగా 25, 30 ఇడ్లీలు వుడికే పాత్ర మనం తయారు చేసుకోవచ్చు. ఎంతమంది వున్నా వేడి వేడి ఇడ్లీలు ఒక్క మారు తినవచ్చు.

సాధారణంగా మన ఇళ్లలో నిలువు కళాయి గిన్నెలు వుంటాయి. ఆ కళాయి గిన్నె, అడుగువెడల్పు, అడుగున్నర ఎత్తు కనుక వుంటే సుమారు పాతికముప్ఫై ఇడ్లను వుడుకుతాయి. ఇంట్లో గిన్నె లేకపోతే కొత్తది కొన్నప్పటికీ 8, 10 రూపాయిలుంటుంది

ఇంక రేకులు-బజారులో అల్యూమినియం రేకులు తయారుచేసి అమ్ముతారు. ఒక్కొకటి రూపాయిలోపుగానే వుంటుంది మన గిన్నె బజారుకు తీసుకువెళ్ళి కొనబోయే రేకులు ఈ గిన్నెలో పట్టేలాగ చూచివేరుకోవాలి, గిన్నెలో రేకులు మరీ ఇరుకుగా కాకుండా ప్రక్కల చిపురుపుల్ల పట్టేసందు చుట్టూ వుండేలాగ చూచుకోవాలి.

తరువాత గిన్నె అడుగున 4, 5 అంగుళాలు ఎత్తు వున్న కంచుగ్లాసు గాని అంతే వున్నది మరొకటైనా గాని వేసి దానిమీద రేకును ఒకదానిపైన ఒకటి పేర్చితే గిన్నె పైకి ఎన్ని రేకులు వస్తాయో అన్ని రేకులు కొనుక్కోవాలి. అరగజం ఎత్తు వున్న గిన్నెకు 5, 6 రేకులు పట్టవచ్చు, రేకుకి ఐదు ఇడ్లీలు తయారౌతాయి. ఇంక పైన మూత కావాలి.


మన ఇళ్ళలోవుండే బరువుపళ్ళెం ఏదైనా వెయ్యవచ్చు కాని ఆవిరిపోతే తొందరగా వుడకవు. బాల్చి క్యారియరుకు వుండే మూతలాటిది కొనుక్కుంటే ఆవిరి పోకుండా వుంటుంది. ఖరీదు పావలున్నర, అయిదు రూపాయ లుంటుంది. ఈ మూత గిన్నె లోపలికి 2 అంగుళాలు దిగి పైన అంచుకు సరిపోయే అంచుకూడా వుంటుంది. కనుక ఆవిరి పోదు. ఈ మూత అయితే శాశ్వతంగా వుంటుంది. అంతకన్న చౌకగా కావాలంటే అల్యూమినియంది కొనుక్కోవచ్చు.

రేకులు ఏరుకునేటప్పుడు ముఖ్యముగా చూచుకోవలసినది ఏమిటంటే—

రేకు పట్టుకుందుకు (హాండిలు) రింగులా వున్నది కాకుండా, అర అంగుళన్నర వెడల్పు, బల్లపరుపుగా వున్నవి కొనుక్కోవాలి. ఎత్తుకూడ అంగుళంన్నర కన్న యెక్కువ అక్కరలేదు. బల్లపరుపుగా వుంటే ఒకదాని మీద ఒకటి బాగా నిలబడుతుంది. ఒకదాని మీద ఒకటి వుండాలిగదా అని పొయ్యి గడ్డలలాగ మూడు వుంటే బాగా నిలబడుతుందని అల్లా కొనుక్కోకూడదు. పట్టుకునే రింగులు మధ్య వుంటే వేడిగిన్నెలోంచి దింపడం సులువుగాని, రింగులు ప్రక్కనవుంటే గిన్నెలోంచి రేకులు తియ్యడం కష్టమవుతుంది. రేకుమధ్య ఒక్కటే బల్లపరుపుగా వుంటే చాలు.

కళాయి గిన్నెలో అడుగు గ్లాసుగాని, మరో చిన్న గిన్నెగాని పెట్టి 2 అంగుళాల యెత్తుగా నీరుపోసి గ్లాసుమీద రేకులు పేర్చి పైన మూతపెట్టి కుంపటి మీదగాని, పొయ్యి మీదగాని పెడితే 15 నిముషాలకు 25, 30 ఇడ్లీలు తయారౌతాయి. తక్కువ ఇడ్లీలు కావాలనుకున్నవారు చిన్నగిన్నెను కొనుక్కోవచ్చును. లేదా రెండురేకులు తగ్గించి వాడుకోవచ్చును. చిన్నది పెద్దవదు గాని, పెద్దగి చిన్న దౌతుందిగా!

—పాకల సీత, ఏలూరు.



ఈ జగతి గతి ఏమిటి?

10-7-57 ఆంధ్ర వారపత్రికలో పి. జి. సరోజినిగారు వ్రాసిన "ఆడపిల్లల పెంపకం తల్లిదండ్రుల అగచాట్లు" అనే వ్యాసం చదివాను. అందులో కొన్ని విషయాలతో ఏకీభవించలేకపోతున్నాను. ఆడపిల్లలకు తగినంత విద్య ఉండాలి. వాస్తవమే. కాని సరోజినిగారు "ఆడపిల్లలు పెళ్లికోసమే పుట్టారనే ఆలోచనలు మానెయ్యాలి" అని వ్రాశారు. అది చాల పొరపాటు. వారి సలహా ప్రకారమే వనితలందరూ పెద్ద పెద్ద చదువులు చదువుకొని వివాహాలు చేసుకోవడం మానేస్తే ఇక ఈ ప్రపంచం గతేంకాను? పోనీ కట్నాలసంగతంటారా! ఈ రోజులలో ఆడపిల్లలు ఎంత ఎక్కువ చదువుతే అంత ఎక్కువ కట్నాలిచ్చుకోవలసి వస్తుంది. ఉదాహరణకు ఒక అమ్మాయి బి. ఎ. ప్యాసయిందనుకోండి. ఆమెకు తగిన వరుడు ఏ డాక్టరో, ప్లీడరో లేక కలెక్టరో అయుండాలి. ఆ వరసలో యున్నవారు కనీసం పదివేలు కట్నానికిగాని రారు. అదీ ఆ అమ్మాయి గుణ సాంప్రదాయాలు అందచందాలు బాగుగ నచ్చితేనూ. అంత కట్నం ఇచ్చుకోలేక స్వయంపోషణకై ఏ అమ్మగారి ఉద్యోగమో చేస్తుందనుకోండి. అలా ఎంతకాలం అవివాహితగా యుండగలదు?

—రామదాసు సుమిత్రాదేవి,
(బిలాసపూర్, మధ్యప్రదేశ్.)

* * *

ఉన్నతవిద్య ఉన్నట్లయితే

"ఆడపిల్లల పెంపకం, తల్లిదండ్రుల అగచాట్లు" అనే వ్యాసం చదివాను. వారి భావాలతో నేనుకూడ ఏకీభవిస్తున్నాను. కాని కొంతమంది తాహతు కనిపెట్టాలి. తాహతుగల ప్రతివారు మాత్రము తమఆడపిల్లలను మగవారితో సమానముగా విద్య చెప్పించి వారి భావిలో వృద్ధిలోకి వచ్చేటట్లు చెయ్యాలి. చదువు మూలమున తమపిల్లలు చెడిపోతారని చదివించరు. చెడిపోయేవారైతే ఎలాగైనా చెడిపోతారు చదువు మూలమున చెడిపోరు. ప్రతివారు ఈ సంగతి గుర్తించాలి. స్త్రీలకి విద్య ఉన్నట్లయితే అనేక రకములైన గడ్డుసమస్యలు ఎదుర్కొనగలుగుతారు.

కె. శ్యామలాదేవి, (విజయవాడ.)

* * *

కనుక, మనమిక...

శ్రీమతి పి. జి. సరోజినిగారు 'ఆడపిల్లల పెంపకం, తల్లిదండ్రుల అగచాట్లు' అను వ్యాసమును వ్రాశారు. అందు కొన్ని విషయములను గూర్చి నేను వారితో ఏకీభవించలేకుండా ఉన్నాను.

(1) "చదువువల్ల మగవారికి వినయము వివేకము కలుగుతాయి అంటారే, చదువుకుంటే ఆడవారికిమాత్రం ఎందుకు కలగవు?"

విద్య దుర్మదులకు మదంబొనరించును. కనుక విద్యకు సజ్జనత్వమునకు సంబంధము లేదు. బందరులో స్కూలుఫైనలు విద్యార్థులు, మాచరును కాపీ పట్టుకోనిందుకు కొట్టినట్లు పేపరులో చదివాము. అంటే విద్య మగపిల్లలకు ఎంత వినయవిధేయతలు కలిగిస్తోందో తెలుస్తూనే ఉంది. కనుక నాపాయింటు కేవలం వినయంకొఱకు చదువు అనవసరమని.

(2) "కట్నాలకోసం అష్టకష్టాలుపడి డబ్బు జాగ్రత్తపెడతారు. కాని ఆ డబ్బు పెట్టి ఆడపిల్లలకు చదువెందుకు చెప్పించకూడదు."

దేశంలో ధనవంతులు తక్కువ, బీదవాళ్ళు ఎక్కువ ఉంటారు. పూర్తిగా బీదవాళ్ళకు బాధలేదు, ధనవంతులకు బాధలేదు. కాని మధ్యతరగతివారికే వచ్చింది ముప్పు. బాగా డబ్బున్నవాళ్లు చదువులూ చెప్పిస్తున్నారు; వేలకు వేలుకట్నము లిచ్చి సులభంగా పెళ్లిళ్లూ చేస్తున్నారు. ఎటొచ్చి మధ్యతరగతివారికి చదువు చెప్పించినా, కట్నం తప్పటంలేదు. కుటుంబమును పోషించటమే కష్టముగా వున్న ఈ రోజులలో రెండింటికి డబ్బు ఎల్లా కూడబెట్టగలుగుతాడు? ఎట్లాగు కట్నాలు తప్పటంలేదు. అటువంటప్పుడు మగపిల్లలకు ఆడపిల్లలకు సమానంగా చదువు చెప్పించాలి అంటే ఎల్లా సాధ్యపడుతుంది?

(3) "ఆడపిల్ల పెళ్ళికోసమే పుట్టిందన్న ఆలోచన పూర్తిగాపోవాలి."

ఏ వివేకానందస్వామి వంటివాడో తప్ప పెళ్ళికోసం పుట్టనిదెవరు?

కనుక ఇంతకీ నాకుతోచింది, 'పెంపకంలో లేదని, మనమనస్సులు మారాలని. పిల్ల పిల్లవాడికి, పిల్లవాడికి పిల్ల నచ్చితే కట్నం ఆ వివాహమునకు ప్రతిబంధకం కావటం అసభ్యతగా భావించేరోజులు రావాలి; ఆవిధంగా సంఘం మారేందుకు మనమంతా కృషిచెయ్యాలి. సరోజినిగారు వ్రాసినట్లు కొద్దో గొప్పో చేతనైనంతవరకు చిన్న చిన్న సంఘసంస్కరణలు ఆరంభించాలి ఊరికే ఉపన్యాసాలిస్తే ఏంలాభం.

సామవేదం కృష్ణవేణి.

* * *

10-7-57 ఆంధ్ర వారపత్రికలో శ్రీమతి పి జి. సరోజినిగారు వ్రాసిన "ఆడపిల్లల పెంపకం", తల్లిదండ్రుల అగచాట్లు చదివాను. వారు వ్రాసిన విషయాలు మావంటి మధ్యతరగతి కుటుంబాల వారికే అన్వయిస్తుందనుకుంటాను ధనవంతుల పిల్లల పెండ్లి విషయంలో అంత బాధ పడవలసిన అవసరము లేదు. ఆడపిల్లల చదువు సంధ్యలు, వారి పెంపకం, తల్లిదండ్రుల అగచాట్లు, స్త్రీ స్వాతంత్ర్యంగురించి చాలా బాగా వ్రాసినారు

నాకొక చెల్లెలుంది. దానికి చదువుచెప్పించుట నా తల్లిదండ్రుల కిష్టములేదు. పైగా చదివి వంటింట్లో కూర్చోవలసినదే కదా అంటారు. కట్నం ఇచ్చి చదువుకొన్న పిల్లవాడిని చూదామా అంటే కట్నం ఇవ్వలేరు. దానికి స్వతంత్రంగా బ్రతుకుటకు మార్గము చూపమంటే చూపలేరు. ఈ విధముగా నా తల్లిదండ్రులవలె యింకా పూర్వాచారాల పేరుతో కన్న ఆడపిల్లలను, పిరికివారినిగా చేసి, స్వతంత్రముగా బ్రతుకలేని వారినిగా తయారుచేయు తల్లిదండ్రు లెంతమంది వున్నారో తెలియదు.

వల్లూరు హైమవతి, సికిందరాబాదు.

* * *

"ఆడపిల్లల పెళ్ళిళ్ళు - తల్లిదండ్రుల అవస్థలు" అనే వ్యాసాన్ని పి జి సరోజినిగారు బాగా వ్రాసేరు. ఈ కాలంలో ఆడపిల్లలకు పెళ్ళిళ్ళవుట చాలా కష్టముగానే యున్నది.

పెళ్ళికొడుక్కి కట్నం అక్కరలేక పోయినా, పెళ్ళికొడుకు అన్నలకి, తండ్రికి కావాలి.

ఈ మధ్య మా స్నేహితురాలికి ఓ సంబంధము వచ్చింది. ఆమె బి.ఎస్‌సి. ప్యాసైంది. అన్ని పనులు వచ్చును. సంగీతము వచ్చును పెళ్ళికొడుకు ఇష్టపడి చేసుకొందుకు ఒప్పుకొన్నాడు. ముందు కట్నం అక్కరలేదన్నారు. కాని లాంఛనాలు బాగా జరగాలన్నారు. 5 రోజులపెళ్ళి, పెళ్ళివారు 400 మంది. ద్వారంవారి ఫిడేలు, పద్మినిడ్యాన్సు ఆడబడుచు లాంఛనాలు, అత్తగారి లాంఛనాలు, ఇన్ని కావాలన్నారు. పెళ్లికొడుక్కి అన్నీ ఊలెన్ సూట్లు కావాలి, వచ్చిన వారందరికీ చీరలు పెట్టాలి. ఇవి వారు కోరినవి. ఆ పెళ్ళికొడుకు బి ఇ. చదివేడు. ఆ అమ్మాయి ఇవన్నీ విని, పెండ్లి వద్దని అనుకొని, ఇంతకన్న ఉద్యోగం చేసుకొంటే మేలనుకొని, బి.ఇడి. ట్రైనింగ్‌కి వెళ్ళింది. ఈకాలపు పెళ్ళిళ్ళు ఇలా వున్నాయి.

జె. రుక్మిణి, కలకత్తా.

* * *

వారణాసిసుబ్బలక్ష్మిగారు వ్రాసిన 'అప్పులూ వాటిలో తప్పులూ ఒప్పులూ' అనే వ్యాసం చాలా బాగుంది. నిత్య జీవితంలో జరిగే యథార్థాన్ని ఆవిడ చాలా చక్కగా వివరించేరు. కొంత మంది సామాన్య సంసారులు వెలబడి సామాను ఒక్కమారు కొనుక్కోలేక అప్పుడప్పుడు అణా, బేడా యిచ్చి తెప్పిస్తూ ఉంటారు కాని వాటివల్ల నష్టమేగాని లాభమేమీ లేదు సంసారమన్న తరువాత అప్పుచెయ్యకుండా అవదు. అలాగని తెచ్చిన అప్పు మర్చిపోకూడదు. వెంటనే తీర్చేస్తే మన మీద అవతల వాళ్ళకి గౌరవం ఉంటుంది. మర్నాడు మళ్ళెదైనా అడుగుతే ఇస్తారు. ఈవిషయాలన్నీ వారణాసి సుబ్బలక్ష్మిగారు చాలా బాగా వ్రాసేరు. ఆవిడకు నా అభివందనలు

వి. కామేశ్వరి, విజయనగరం.

* * *

17-7-57 ఆంధ్ర వారపత్రికలో అల్లమరాజు సర్వమంగళగారు ఇరుగుపొరుగులపై వ్యాసం చాలచక్కగా రాశారు. ఈ వ్యాసం చదివేక చాలమంది తమలోపాలను తామే తెలుసుకుని మంచి ఇరుగుపొరుగులుగా మారగలరని ఆశిద్దాం.

గాడేపల్లి పద్మ, (విజయనగరం).

* * *

17-7-57 పత్రికలో అల్లమరాజు సర్వమంగళగారు వ్రాసిన "ఇరుగుపొరుగులా?-ఇరుగు పురుగులా?" అన్న వ్యాసాన్ని చదివాను. వారు యిరుగుపొరుగుల్ని చెడపురుగులతో పోల్చి చాల అసభ్యంగ వ్రాశారు. అలా వ్రాయటం భావ్యంకాదంటాను. ఎందుకంటే ఇరుగుపొరుగు లన్నతరువాత మంచివారూ వుంటారు, చెడ్డవారూ వుంటారు. అటువంటప్పుడు మంచివార్ని వదిలేసి చెడ్డవార్ని గురించే చివరిదాకా వ్రాసుకోవడంలో సర్వమంగళగారు మంచివారున్నారనే సంగతి మర్చిపోయారనిపిస్తుంది.

ఆర్. రాధాకృష్ణ (నూజివీడు)

* * *

'అల్లమరాజు సర్వమంగళగారు' ఇరుగు పొరుగులా? ఇరుగు పురుగులా? అనే వ్యాసాన్ని చాలా చక్కగా వ్రాశారు. ఆమె వ్రాసినదంతా అక్షరాలనిజం. అందులో అసహజమైన విషయాలేమి లేవు. ఆమె అభిప్రాయాలతో పూర్తిగా ఏకీభవిస్తా. ఆమెకు నా కృతజ్ఞతాభి వందనములు.

ప్రభ, బుచ్చిరెడ్డిపాళెం.

* * *

అల్లంరాజు సర్వమంగళ గారు వ్రాసిన ఇరుగుపొరుగుల వ్యాసం చాల బాగుంది. వారికి నావందనములు ఇప్పటి కాలంలో ఒకరిమీద నొకరు చాడీలు చెప్పుకొనటము మితిమీరి పోవుచున్నది. చాడీలు చెప్పుకోవటము బస్తీలో వుండదని నా నమ్మకము పల్లెటూరులో అయితే జడ లూజుగా వేసుకుంటే ఏమి వేషాలు పాముల వేషాలు అంటారు ఎవరైనాను వాయిలుచీరలు కట్టుకుంటె తినటానికి తిండి లేక పోయి నా బడాయిలు చాలవున్నాయి అంటారు.

ఎం. భారతి.

* * *

"ఇరుగు పొరుగులా, చెడపురుగులా!" వ్యాసం చదివాను చాలాబాగుంది అల్లమరాజు సర్వమంగళగారితో నేను ఏకీభవిస్తున్నాను. వారికి నా హృదయపూర్వక అభివందనలు.

సి. ఎ. పూర్ణ (విజయవాడ)

* * *

"ఇరుగుపొరుగులా? ఇరుగుపురుగులా"? అనే వ్యాసాన్ని చదివేను. స్త్రీలలో నుండే చిలిపికయ్యాలను బాగుగా విమర్శించారు.

పూసర్ల రాధాకృష్ణ, (కొత్తపేట).

* * *

అల్లమరాజు సర్వమంగళగారు వ్రాసిన 'ఇరుగుపొరుగులా? ఇరుగుపురుగులా?' అనే వ్యాసము చాల బాగున్నది.

జి. వెంకటపూర్ణ (బేతంచెర్ల)

శ్రావణమాసంలో

(37-వ పేజీ తరువాయి)

నడుస్తూన్న నాకు ఎంతఆనందంగా వుండేదో చెప్పలేను.

మాది ఆడపిల్లలున్నూ లేకొబట్టి ఆమర్నాడంతా బడికి సెలవే. ఆరోజు పూజకు పువ్వులు కోసుకు తీసుకురావటము పేరంటానికి వచ్చిన పేరంటాళ్ళకు పసుపు కుంకుమ ఇవ్వటము నా పని.

కీనగలిచ్చి అక్షింతలు వేయించుకోటము మా వదినపని, అంతవరకు బాగానే వుండేది

ఆ తర్వాతే వచ్చేది పేచీ, ముమ్మల్ని పిలిచిన ఇళ్ళకు పేరంటానికి వెడదాము రమ్మనేదాన్ని వదిన్ని.


"ఇంటి కొచ్చిన ముత్తయిదువులకు వాయినా లివ్వదా వదిన; నువ్వెళ్లు" అనేది అమ్మ. నాకేమో వదినను విడచి వెళ్లటమంటె కష్టంగా వుండేది మొత్తానికి ఎల్లాగో పేచీ పెట్టి వదినా నేను రెండుమూడిళ్లకేనా వెళ్ళొచ్చేవాళ్లము. ఆరోజుల్లో వదినకూడా, ఎక్కడికేనా వెళ్ళటమంటె నాకదో ఆనందం తృప్తి నిచ్చేది. ఈ విధంగా శ్రావణ మాసం నాల్గువారాలు చిటికలోగడచిపోయేవి

ధనధాన్యాది సంపదలను, సౌభాగ్యాన్ని, పుత్రపౌత్రాభివృద్ధినీ కలిగించే వరలక్ష్మి వ్రతం ఈ నెలలోనే చేస్తారు. మంగళగౌరి వ్రతం అయిదు ఏళ్లే పడతారుకాని ఈ వరలక్ష్మినోము మాత్రము ప్రతి ఏటా ప్రతి ముత్తయిదువ నోచుకుంటుంది

ఇక కొత్తగా పెళ్లయిన యువతులు తమ అత్తవారు తేబోయే శ్రావణపట్టే గురించి కలలు కంటూంటారు. అసలు ఈ శ్రావణపట్టి తేవటంలో ఉద్దేశ్య మేమంటె తమ యింటి కోడలు లక్ష్మి అని, అంచేత ఆ కోడలొచ్చిన తొలిసంవత్సరము వరలక్ష్మిపండుగకు తమకు కలిగిన కానుకలు కోడలుకిచ్చి సంతోషపరిస్తే లక్ష్మిదేవి సంతోషపడి కోరిన సిరులిస్తుందని నమ్మకము. ఇల్లా అందరు తెస్తారో లేదో చెప్పలేము కొంత మంది తెస్తారు

కొంతమంది "మాయిళ్లలో ఈఆనవాయితీ లేదంటూ ఆవేళటికి ఓ కొద్ది ముక్క రాసి పడేసి చేతులు దులుపుకుంటారు దుఃఖము అశుభ్రతవున్న ఏయింట్లోనుమహాలక్ష్మిఅడుగు పెట్టదుట. అందుకే ఆరోజు నల్లగా యిల్లు అలికి తెల్లగా ముగ్గులుపెట్టి పచ్చగా పసుపు ఎర్రగా బొట్లతో తీర్చి దిద్దినయిల్లు, తలంటి నీళ్ళుపోసుకుని కొటుకొబోటూ పెట్టుకుని కలిగనంతవరకు వస్త్రాభూషణా లలంకరించుకొనిన యిల్లాలుతో, ప్రతియింట్లోను లక్ష్మి తాండవిస్తూంటుంది.

బి. ఎస్. లక్ష్మి.



పాప గురువు

తల్లి గర్భమును వదలుచు
తానప్పుడె కెవ్వ మనుచు
ఏడ్చుగదా! ఆ పాపకు
ఏడ్పు ఎవరు నేర్పినారొ?

పుట్టగాన పాలకొఱకు
కొట్టుకొనును కాళ్ళేతులు
ఇటులుచేయు మనుచు దాని
కెవరు నేర్పినారో గద!

తన పెదవులు కదిలించుచు
'తాత, అత్త' అనును పాప!
మాట లనెడి బుద్ధి ఎవరు
మా పాపకు ఇచ్చినారొ?

అమ్మ తప్ప ఎవరిదరికి
పొమ్మన్నా పోదు పాప
మనుజులలో భేదాలను
కనిపెట్టుట నేర్పె నెవరొ?

ఏదన్నా వస్తువొకటి
ఎదురుగపడి ఉన్న చూచి
పొట్టమీద ప్రాకి, నోట
పెట్టుకొనుట ఎట్లువచ్చె!

నిదురపోవునటుల ఉండి
బెదరినట్లు ఉలికిపడును!
ఏడ్పు, నవ్వు తనలోనని!
ఇట్టి నటన లెవరునేర్పె?

పాతూరి ప్రసన్నాంజనేయులు

అన్నదమ్ములు

రామాపురంలో రంగయ్య, బాలయ్య అనే ఇద్దరు అన్నదమ్ములు ఉండేవారు. రంగయ్యకు పదునాల్గు, బాలయ్యకు పండ్రెండు సంవత్సరాలు. వారికి తండ్రిగాని, తల్లిగాని లేరు.

రంగయ్య బాలుడే అయినా మంచిమర్యాదా, ఎంతో నిజాయితీ కలవాడు. పెద్దవారెవరైనా ఎదురుపడితే నమస్కారం చేస్తాడు.

అన్నదమ్ములిద్దరూ దిక్కులేని పక్షులవలె తలదాచుకుందుకి ఇల్లూ, తినడానికి తిండీ దొరక్క, నానా యాతనలూ పడుతూంటే, గ్రామీణులు కొందరైనా సహాయం చేయకుండా మీదుమిక్కిలి వారిని గ్రామంలోంచి తరిమివేయడానికి ప్రయత్నించారు.

అట్టిసమయంలో 'రామనాథం' అనే ఆయన వారి నాదుకున్నాడు. రామనాథం హృదయం వెన్నపూస లాంటిది. ధనవంతుల కుటుంబీకుడు. వ్యవసాయం స్వంతంగా చేసుకుంటూ, తాతలు సంపాదించి యిచ్చిన కాస్తభూమినీ సద్వినియోగం చేసుకుంటున్నాడు.

* * *

ఇడ్లెన్లు, పూరీలు, చెట్నీ వీధిలో తిరిగి అమ్మకునే ఈ ఉద్యోగం రామనాథం మూలంగా రంగయ్యకు దొరికింది.

ఒకనాడు......

"ఇడ్లీ-పూరీ; ఇడ్లీ-పూరీ; తాజా-తాజా" పాటలా పాడుకుంటూ వీధి వీధికీ తిరిగాడు. ఊరిలో సగం తిరిగేసరికల్లా పళ్లెం సగం ఖాళీ అయింది. వేళమించితే కొనేవారే ఉండరని జోరుగా ప్రతివీధీ తిరుగసాగాడు. ఎలాగయితేనేం చివరకు అన్నీ చెల్లిపోగా నాలుగుమాత్రమే ఇడ్లీలు మిగిలాయి. అవి ఇంక చెల్లవుగాబోలు, తన కష్టఫలితం ఎలా ఒదులుకుంటాడు? అనుకుంటూనే అవి చెల్లేవరకు వీధి వీధికీ తిరగాలని నిశ్చయించుకున్నాడు. వెంటనే బయల్దేరాడుకూడా.

రామనాథం ఇల్లు ఊరుచివరను ఉంది. పెంకుటిల్లు - నాల్గుగదుల ఇల్లు. అతనికి వేణు అనే కూతురు. పది సంవత్సరాల వయసుది ఉంది. ఆపిల్లమూలంగా రంగయ్య దగ్గర ఇడ్లీ ప్రతిరోజూ కొంటూంటాడు రామనాథం-లేకపోతే చిచ్చుపెట్టేస్తుంది.

ఆరోజు వేళ మించిపోవడంవల్ల భోజనం చేసేసింది. అయినా సరే రంగయ్యకేక విన్పించేసరికి తండ్రి దగ్గరకుపోయి ఇడ్లీ కొనమంది.

ఒక్కగానొక్క పిల్ల. ముద్దుమురిపాలు చెల్లించుకుందుకి ఇంకెవరున్నారు! వేణుమాటను కొట్టివేయలేకపోయారు ఆ తలిదండ్రులు.

"రెండు ఇడ్లీ ఈయరా! చాలును" అన్నాడు రామనాథం.

"బాబుగారూ! ఇంకా రెండు మిగిలిపోతాయి. అవి ఇంక చెల్లవండీ! మీరే తీసుకోండి" అంటూ ఎంత వద్దంటున్నా ఆకులో వేసి వేణుచేతిలో పెట్టేడు.

"భలే మంచివాడివిరా రంగయ్యా! ఎవరూ కొనేవారు ఇంక ఉండబోరని నాకా అంటగడతావు-"రామనాథం అన్నాడు.

"బాబూ! అవసరం అలా చేస్తుందండీ."

బాలుని దీనావస్థకు రామనాథం కుమిలిపోయాడు. అతనికి సహాయం చేసి ఆదుకోమని పదేపదే రామనాథంమనసు హెచ్చరించింది.

"అవసరం అని అంటున్నావే అదెలాంటిదోయ్? ఒకసారివిన్పిద్దూ" ప్రీతిపూర్వకంగా అడిగాడు రామనాథం.

విన్నదనం ఆ బాలునిముఖంలో తొణికిసలాడింది. "బాబయ్యా! ఈ లోకంలో ధనంలేనివాడు గడ్డిపూచ విలువకైనా సరిరాడని అంటారే! ఇప్పుడు ఈ ఇడ్లీలుగాని అమ్మకపోతే డబ్బులెలా వస్తాయండీ? డబ్బు లేకపోతే భోజనమెలా నాలాంటి దీనుడికి లభిస్తుందండీ? ఆకలికంటె అవసరం ఈ లోకంలో లేదుకదండీ! కష్టసుఖాలు తెలిసినవారు, ధనవంతులైన మీరే ఇలా అంటూంటే మా పొట్టలు నిండేదెలా? నిన్నరాత్రి భోజనమే! ఇంత

వరకూ మరి అన్నంలేదు. వీధి వీధికీ ఎండలో కాళ్లు అరిగిపోయేలా తిరిగాను. అయినాసరే శ్రమే మిగిలింది. కాని ఇడ్లీలు చెల్లుబడి కాలేదు" తన దీనత్వం వెళ్ళ గ్రక్కాడు.

రామనాథానికి ఎన్నో ఆలోచనలు తట్టాయి. "రెండు ఇడ్లీలు మిగిలినవి ఇచ్చేశావుగా!" బాలుని ప్రార్థనలు అతనిహృదయంలో చొచ్చుకుపోయి మిగిలిన రెండు ఇడ్లీలుకూడా కొనిపించాయి.

జేబులోని రూపాయినోటు తీసి యిచ్చాడు.

"బాబయ్యా! చిల్లరలేదండీ, ఉండండి. ఇప్పుడేపోయి చిల్లర మార్చుకొని వస్తాను తొందరగా" అనిచెప్పి కోమట్లవీధికి వెళ్లిపోయాడు.

* * *

రంగయ్య పోవడమేగాని తిరిగి రావడం కన్పించలేదు. రంగనాథానికి బాలునిపై దురభిప్రాయం ఏర్పడింది. "దొంగలా ఉన్నాడే! మంచి కిలాడీలా ఉన్నాడే వీడిమూలంగా ఊరిలోనవ్వులపాలు కావలసిందేనా? ఈలోకంలో మంచివారు మంచివారినీ, చెడ్డవారు చెడ్డవారినీ వాంఛిస్తారు. వారి వారి గుణగణాల మూలంగా మంచిచెడు భావాలు కల్గుతాయి." అనుకుంటూనే ఏపాప మెరుగని రంగయ్యపై పాపం మోపాడు.

భావనాప్రపంచంలో అల్లాడిపోతున్నాడు రంగనాథం. రంగయ్య గూర్చి స్థిరమైన ఆలోచన కల్గలేదు. "దొంగతనం రంగయ్యపై మోపేనే! చిల్లర తెచ్చియిస్తాడో లేక పట్టుకుపోతాడో! అకారణంగా అన్నార్తుడైవచ్చిన బాలునిపై నిందమోపడం నాదే తప్పేమో!" బాలుని రాకకోసం ముందువెనుకలు చూస్తూ "పోయిన రూపాయి పోనే పోయింది. ఇంకా దాన్నిగురించి మనసుకూడా కలవరం పొందాలి!" అనుకుంటూ ఇంటిలోపలికి పోబోవనున్న సమయంలో బాలుడొకడు తనదగ్గరికి వచ్చేడు.

అతడే బాలయ్య, రంగయ్య తమ్ముడు. చాలఅందమైన బాలుడు. అతనిచేతిలో చిల్లరడబ్బులున్నాయి. కంట నీరుకారుతూంది. భయాశ్చర్యాలు ముఖంలో గోచరమౌతున్నాయి. నోటిమాట తడబడుతూంది.

"ఓ అయ్యా! ఇందాక ఇడ్లీ అమ్మిన మాఅన్న ఈచిల్లరడబ్బులు పంపించాడు మీకీయమని." ఆ డబ్బులు అతనికిచ్చాడు కళ్లునులుముకుంటూ బాలయ్య."

"మీ అన్న ఏడీ?"



అందముగ నున్నే ఒక అందమైన చీర!

మీరు బిన్నీవారి అసలైన సిల్కు జార్జెట్ చీర కట్టుకుంటే ఎంతో అందముగ కనపడతారు. అది అసలైన సిల్కుతో నేయబడినది కనుక దాని మెత్తదనము మరియు సహజమైన తళతళ చాల కాలము ఉండును.

బిన్నీవారి అసలైన సిల్కు జార్జెట్ చీరలను ఎన్నో పొర్లు యింటివద్ద ఉతుకుతున్నా అవి ఒంటి మీద అందముగ నిలిచేలా ఉంటాయి. వాటి మనోహరమైన రంగులు పోవు.

అందముగ చాల కాలము నున్నే బిన్నీ వారి సిల్కు జార్జెట్ చీరలను కొనండి!

బిన్నీవారి యితర సిల్కు చీరలు:
మెత్తని సిల్కు చీరలు: పుష్ప దళమువంటి ఈ మెత్తని సిల్కు చీరలు. బంగారు అంచు మరియు సరిక్రొత్త డిజైనులతో తళతళలాడే రంగులలో దొరకుతున్నాయి. వీనిని యింటివద్ద ఉతుకుకోవచ్చును.

క్రేపు సిల్కు చీరెలు: ఈ క్రొత్త అందమైన, స్వచ్ఛమైన సిల్కు చీరె నేత్రానందకరమైనది. అందమైన బంగారు అంచులు.



అసలైన బిన్నీవారి చీరలన్నిటిమీద బంగారు రంగులో యీ ముద్ర వేయబడియున్నది

బెంగుళూరు వులెన్, కాటన్ అండ్ సిల్కు మిల్సు కంపెనీ లిమిటెడ్
మ్యానేజింగ్ ఏజెంట్లు:
బిన్నీ అండ్ కంపెనీ (మద్రాసు) లిమిటెడ్.

(B.Y. 3120-a (Bl.)

అన్నదమ్ములు

ఆమాటకతడు రోదన హెచ్చు స్థాయిలో సాగించడం మొదలు పెట్టాడు. కళ్ళవెంబడి ఏకధారగా విచార భాష్పాలు కారసాగాయి.

నిర్బంధించి అసలు సంగతేమిటో చెప్పమని బ్రతిమాలాడగా ఇలా అన్నాడు.

"మీరిచ్చిన రూపాయి చిల్లర మార్చి మీకీయడానికి పట్టుకు వస్తూంటే దార్లో ఒక మైసూరు ఎద్దులబండి మా అన్నను తొక్కిపోయింది. బండిని ఎవరూ ఆపలేకపోయారు. అన్నకాలు విరిగిపోయింది. తెలివి తప్పింది.

దయాహృదయులు మీలాంటి వారు కొందరు అన్నయ్యను ధర్మాసుపత్రిలో చేర్పించారు. ఆపిడికిట డబ్బులు తెలివితప్పినపుడు ఒకరు జాగ్రత్తపెట్టారు. అవే అన్న నేను వెళ్ళగానే ఇచ్చి మీ దగ్గరకు పంపాడు.

అణా తక్కువైనందుకు మరోలా భావించవద్దని కూడా చెప్పాడు- అన్నయ్య పడిపోయినప్పుడు అణా మాయమయిపోయింది. తప్పు సైరించమని అన్నయ్య మరీ మరీ వేడుకున్నాడు." తన అన్నయ్య చెప్పమన్న రీతిగా చెప్పాడు.

పూర్తిగా విన్నాక "విచారించకు బాబూ! నీ అన్నకు కల్గిన ఆపదకు భయపడకు. చిక్కులన్నీ పోయేలా చూస్తానులే." అభయ హస్తం

"డన్‌లప్ పిల్లో" పరుపులు; దిండ్లు; కుర్చీ, కారు సీటులు కావలసిన సైజులలో సరసమైన ధరలకు సప్లయి చేయబడును.

స్టాకిస్టు: ప్రభాత్ ఏజన్సీస్

ప్రొప్రయిటరు: మాలెంపాటి శ్రీరాములు

ప్రకాశంరోడ్డు—గవర్నరుపేట—విజయవాడ-2.

ఆంధ్రలో ప్రతిచోట డీలర్లు కావలెను.

ఇచ్చాడు రామనాథం.

చేతిరుమాలు బాలయ్యకు ముఖం తుడుచుకుందు కిచ్చాడు. ముఖం తుడుచుకున్నతరువాత ఇన్ని మంచి నీళ్ళు త్రాగడానికిచ్చాడు బాలయ్యకు.

ఏమేమో ఆలోచనలు కల్గాయి. ఆలసిస్తే బాలుని ప్రాణానికి ప్రమాదం వాటిల్లుతుందన్న ఆతురతకొద్దీ ఆలస్యం చేయకుండా ఆసుపత్రిలో చికిత్స పొందుతూన్న రంగయ్యను చూడటానికి బాలయ్య వెంటరాగా రామనాథం వెళ్ళాడు.

రంగయ్యకష్టం చూడలేక పోయాడు. ఆ బాలుడు అనుభవిస్తూన్న కష్టం ఇంతా అంతా అని ఎవరూ చెప్పలేరు. ఆ ఆదిశేషునకుకూడా చెప్పటం వీలుకాదేమో! బాలుని చూసిన రామనాథానికే కాదు, కష్టం విన్న ప్రతివానికీ విచారం కల్గుతుంది.

రంగయ్య కాలు విరిగినచోట తెగగొట్టి కట్టుకట్టారు. రాత్రి పగలు అనకుండా వైద్యులు రక్షణ కల్పిస్తున్నారు.

రామనాథాన్ని చూడగానే లేవబోయాడు రంగయ్య, కాని బాధ భరించలేక ఆ ప్రయత్నం విరమించుకుని మంచం మీద వాలిపోయాడు. రామనాథానికి నమస్కారం చేశాడు. "నాతప్పు క్షమించండి బాబూ!" అంటూ, "దిక్కులేని బాలయ్య ఉన్నాడు. ఏమీ తెలియనివాడు. ఏ ఆధరవు లేదు. నాగతి ఇలా వచ్చింది. ఆ దేవుడే దిక్కు నాకు. ఆ పరమశివుడే నన్ను కాపాడాలి. ఇంక మరెవరూ కాపాడలేరు" అని ఊరుకున్నాడు.

ఒక నిమిషం నిశ్శబ్దం ఆవరించింది అక్కడ. రంగయ్య కన్నులు తెరచి మళ్ళీ మూసుకున్నాడు. ఆ సమయంలో రంగయ్యను చూచినవారు ఎంత హృదయం లేనివారయినా సరే చాల జాలి కల్గుతుంది.

రంగయ్యకళ్లు మళ్ళీ తెరువగానే రామనాథం అతని తలదగ్గర కూర్చుని తల నిమురుతూ ఇలా అన్నాడు: "నిన్ను తప్పక దేవుడు కాపాడుతాడు బాబూ! ధైర్యంగా ఉండు. నీ తమ్మునిగురించి ఆలోచనలు పెట్టుకోవద్దు. నేనున్నానుగా నీ తమ్ముని పోషించడానికి"



అన్నదమ్ములు

అన్నాడు ధైర్యం చెబుతూ రామనాథం.

రంగయ్య ఊరడింపబడ్డాడు. ప్రీతిపూర్వకంగా రామనాథంవైపు చూచాడు. ఇంతట్లో డాక్టరు వచ్చాడు. ఏదో మందు కలిపి ఇచ్చాడు. కొంచెంసేపయిన తరువాత 'మళ్ళా వస్తా'నని చెప్పి ఇంటి వంక అడుగువేశాడు రామనాథం. బాలయ్య అతన్ని అనుసరించాడు.

* * *

"విధివ్రాత నెవరూ తప్పించ లేరుగా! జరుగవలసింది జరిగి తీరాలి. ఆటంకాలెన్ని కల్గినాసరే ఆగిపోదు. అయ్యో! ఆపదతో కుములుతూన్న ఆ బాలుని విడిచి పోవడమా? అతని విపత్తుకు నేను కారణంకాదా? నేనేగాని చిల్లరకు పంపకపోతే ఈ ప్రమాదమే జరుగకుండేదిగా." రామనాథాన్ని అతని మనస్సు అనేక విధాల హెచ్చరించింది.

బాలుని చూస్తుండగా అడుగు ముందుకు పడిందికాదు. ఒకానొక నిర్భాగ్యుని కష్టముల పాల్చేసి ఇంటికిపోవడం తనకే సిగ్గనిపించింది. హీనమనిపించింది.

ఈ చివరిభావనయే అతనిని మంత్రముగ్ధునిలా చేసింది. ఆ భావన హృదయంలో నాటుకు పోయింది. బాలయ్యను తోడుకొని తనమాటప్రకారం ఇంటికి తీసుకు పోయాడు రామనాథం. కడుపునిండా రెండుపూటలూ ఇంతఅన్నం పెట్టేవాడు.

ఇట్టే నెలరోజులు గడచి పోయాయి - ఆస్పత్రి నుంచి రంగయ్యను విడుదలచేశారు.


రామనాథంఇల్లు చేరుకొని అతనికి వినయపూర్వక నమస్కారం చేశాడు. "బాబుగారూ! మీ దయవల్ల బ్రతికి బయటపడ్డాను-" కృతజ్ఞతాపూర్వకంగా అన్నాడు.

ఇంతలో బాలయ్య అక్కడకు వచ్చాడు. ఒకరినొకరు కౌగలించుకున్నారు.

రంగయ్య కాలు తీసివేయటం ఇంతవరకూ బాలయ్యకు తెలియనే తెలియదు. ఇప్పుడు కన్నులార చూచాడు. "అన్నయ్య కుంటివాడయ్యాడా? అయ్యో!" అనుకున్నాడు.

"రంగయ్యా! ఇంక మీ రెక్కడకూ పోవద్దు. మా ఇంట్లోనే ఏదో ఈపనీ, ఆపని చేస్తూ ఉండండి. కల్గిందీ మేం తిన్నదీ పెడతాం." ఆస్పత్రిలో ఇచ్చిన మాటప్రకారం రామనాథం అన్నాడు

'అన్నదమ్ముల' ఆనందానికి అంతులేకపోయింది. రామనాథానికి వారి మనసుల్లోనే కృతజ్ఞతను తెల్పారు. ★


* ఇనుప పెట్టెలు * బీరువాలు
* క్యాషుబాక్సులు * ఆఫీసురాక్సు
ముప్పది సంవత్సరములుగా నాణ్యమునకు, మన్నికకు, చవకైన ధరలకు ప్రసిద్ధిచెందినవి.
అల్లారాం అండ్ కో
(స్థాపితము : 1928.)
(H. O.) కొలగలేటివారి వీధి, విజయవాడ - 1.
(బ్రాంచి) 2/156, బ్రాడ్వే, మద్రాసు - 1.
క్రొత్త షోరూమ్ మారుతీ సినిమా ఎదురుగా.
N. V. K. R.



రవి టాయిలెట్సు అందమునకు, వర్చస్సునకు
రవి గ్లిసరిన్ సోప్:—అన్ని కాలముల్లో, ముఖ్యంగా వేసవికాలములో వాడదగినది. శరీరమును మృదువుగను, కాంతిగను ఉంచును.
రవి వెజిటబుల్ హేరాయిల్:- శిరోజములను విస్తారంగా పెంపొందించును. దానిదక్కని సున్నితమైన సువాసన అందరికి ఆనందము కలుగచేయును.
రవి స్నో:-ముఖవర్చస్సును కాపాడి, విలావణ్యమును పెంపొందించును. సోల్ఏజెంట్లు:-
ది న్యూ స్టార్ & కంపెని, 10, వైద్యనాథ మొదలివీధి, తండియార్పేట, మద్రాసు-21.

రాజూ - పేదా
వెల రూ. 2-0-0
ఆంధ్రగ్రంథమాల,
మదరాసు-1.

విక్రమార్కుడి మార్కు సింహాసనం

(8-వ పేజీ తరువాయి)

కుమారుడు.

"ఏదేనా ఒకటే అనుకో. నాకభ్యంతరం లేదుగాని, డైరెక్టరుకి ఇంకొంచెం ఒడ్డూ పొడుగూ ఉండాలి" అన్నాడు లాలారాం.

ఆతరవాత నాలుగైదు ప్రశ్నలు వేశాడు నిగ్గుతేల్చుకోడానికి.

"సుర్ దాస్ జీ! రామాయణం చదివారా?"

"విన్నానండి. చిన్నపుడు మా బామ్మ ఆకథంతా చెప్పేసింది. అనక, ఇంక చదవడం ఎందుకని ఒరిజనల్ చదవలేదండి."

"వెరిగుడ్ చాలు. బాల్యంనుండీ రామాయణం అంటే అభిమానగ్రంథం అన్నమాట. మీరు డైరెక్టరయ్యాక ఈ పాయింటుకి పబ్లిసిటీ ఇద్దాం. ఇండియన్ కల్చరు ఇపుడు ఫాషన్ లెండి'...సరే వాల్మీకి రాసినవి ఇంకేమున్నా చదివారా?"

"ఏవో చాలా చదివానండి గుర్తులేదు."

"ఫరవాలేదు. మీరు ఇపుడు సినిమా రైటరు. జాగ్రత్తగా ఈ ప్రశ్నకు జవాబివ్వండి. రామాయణం ఎండింగ్ లో ఏమవుతుంది? సీతదొరుకుతుందా?"

సూర్ దాసు ఆలోచించాడు. "ఏం చెప్పగలమండి. మీరు ఇలా హఠాత్తుగా అడిగితే. స్క్రిప్టునిబట్టి ఉంటుంది."

"ఒకొక్క జపాన్ చిత్రాన్ని లేక ఇటాలియన్ చిత్రాన్ని ఎన్ని ఇండియన్ ఫిలిములకి వాడొచ్చు?"

"కనీసం ఆరు కథల్లోకి లాగొచ్చునండి" అన్నాడు సూర్ దాస్ వినమ్రత ఉట్టిపడేలా.

"వండ్రఫుల్" అని ఎగిరి గంతెయ్యబోయాడు లాలారాం. మనిషిలావైనందువల్ల అది సాధ్యపడలేదు.

"ఒక సీనులో హీరోయిన్, తల్లిని లాగి లెంపకాయ కొడుతుందనుకో. అప్పుడేం జరగాలి?"

"భోరున ఏడుస్తూ మీదపడి కౌగలించుకోవాలండి. అదయిపోయాక పాట పాడొచ్చు."

"బ్యూటి...సోషల్ పిక్చర్ లో కొయిమాక్సు సీనులో తప్పకుండా రావాల్సిన డైలాగు ఏమిటి?"

"రైరో...అండి"

"సెబ్బాస్...అన్నట్టు అబ్బాస్ ఎవరు? 'రాహీ' సినిమాకి స్టోరీ రాసినవాడు"

'మళ్లీ షెబ్బాస్ అంటున్నాను. అని విన్న తక్షణం బుక్ చేస్తున్నాను. నేనుడిస్ట్రిబ్యూట్ చేసే పిక్చర్లలో మూడింటికి నువ్వే రైటరువి. స్టోరీలాలోచించు" అన్నాడు లాలారాం.

"విన్నావా. నువ్వంత నేర్పుగా చాకచక్యంగా మాట్లాడి మాట నిలబెట్టుగలవా? రాముడికథ ఎండింగ్ ఏమవుతుందో ముందుగా చెప్పలేమన్న నగ్నసత్యం నీకు తట్టి ఉండేదా?" అన్నాడు రైల్వే బైరాగి.

రాజు అడ్డంగా తల తాటించాడు.

"అయితే లాభం లేదు...ఒక బీడీ ఇయ్యి" అన్నాడు బైరాగి బాధగా. ★

(పైవారం మద్రాసు ప్రవేశం)

1857 నాటి మహాజ్వాల గాథ

(33-వ పేజీ తరువాయి)

కోట ఆంగ్లేయుల వశమైంది.

వీరోచిత మృతి

లక్ష్మీబాయి కల్పికి పారిపోయింది. అక్కడినుంచి బగోడా వెళ్ళింది. కాని సర్ హ్యూరోజ్ ఆమెను, తాత్యాను వదల్లేదు. ఎక్కడికి వెడితే అక్కడికి వెంటబడి తరిమికొట్టాడు. చివరికామె గ్వాలియర్ ప్రవేశించింది. గ్వాలియర్ పాలకుడు జయాజీరావు సింధియా ఆమె రాగానే పారిపోయాడు. కోట ఆమెవశమైంది. కాని సర్ హ్యూరోజ్ సేనలు తరుముకుంటూ కోటను సమీపించాయి. ఆయుద్ధంలో ఆమె మళ్ళీ ఓడిపోయింది. ఆమెను బ్రిటిష్ సేనలు తరిమాయి. చివరికామె యుద్ధభూమిలోనే మరణించింది. ఆమె వేషం చూసి పురుషుడనుకుని బ్రిటిష్ సైనికులు ఊరుకున్నారు లేకపోతే ఆ శవాన్ని కూడా వారు మానభంగం చేసేవారేమో. ఆమెశవానికి రామచంద్రరావు దేశ్ ముఖ్ అనే ఆయన దహన సంస్కారాలు కావించాడు.

విషాదాంతం

ఆతరవాత తాత్యాతోపే సింహంలాగ విజృంభించాడు. బ్రిటిష్ వారిని అతడు పెట్టిన తిప్పలు, అతనిసాహసం ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. లండన్ "టైమ్స్" అతని వీరగాథలను గొప్పగా ప్రచురించింది. ఎక్కడచూసినా అతడే. ఒకసేనపోతే మరొకసేనను చిటికెలో సమకూర్చుకునేవాడు. రోజుకి ముప్ఫయ్ నలభై మైళ్ళు నడిచి, కోశాగారాల్ని దోచుకుని, కొండల్లో అడవుల్లో ఇంగ్లీషువారిని చిందరవందర చేసేవాడు. ఇలా పదినెలలతడు దెబ్బతిన్న పులిలాగ తిరిగాడు. చివరికి గ్వాలియర్ లో ఒకద్రోహి అతన్ని బ్రిటిష్ వారికి పట్టిచ్చాడు. వారతన్ని ఉరితీశారు.

నానాసాహెబ్, బాలాసాహెబ్ తో కలిసి నేపాల్ పారిపోయాడు. కాని నేపాల్ లో అతనికి ఆశ్రయం లభించలేదు. బాలాసాహెబ్ నేపాల్ అడవుల్లో దిక్కులేనిచావు చచ్చాడు. నానాసాహెబ్ ఏమైనాడో ఎవరికీ అంతుచిక్కలేదు. హఠాత్తుగా అంతర్థానుడై మళ్లీ కనిపించలేదు.

ఈవిధంగా 1859 మే నాటికి, అనగా ప్రారంభమైన రెండేళ్లకి భారతస్వాతంత్ర్య ప్రథమ సంగ్రామం విషాదాంతంగా ముగిసిపోయింది. భారత దేశమంతా ఆంగ్లేయులకు లోబడి పోయింది. దేశపరిపాలన ఈస్టిండియా కంపెనీనుంచి బ్రిటిష్ రాణి చేతుల్లోకి మారింది. కానింగ్ మొదటి వైస్రాయి అయినాడు.

బ్రిటిష్ వారు కేవలం స్వీయశక్తితోనే భారతీయులను లొంగదియలేదు. సిక్కులు, గూర్ఖాలు, ఇంకా ఇతరరాష్ట్రాల భారతీయ సేనలు వారికి తోడ్పడ్డారు. భారతీయులే భారత దేశానికి ద్రోహం చేసుకున్నారు. కాని ద్రోహుల సంగతి కాదు మనకి కావలసింది; దేశభక్తుల సంగతి; స్వాతంత్ర్యంకోసం ప్రాణాలర్పించిన మహావీరుల సంగతి.

అది కేవలం సిపాయిల తిరుగుబాటని బ్రిటిష్ పరిపాలకులు మనల్ని నమ్మించారు. కాని కేవలం సిపాయిల తిరుగుబాటే అయితే, ఆ మహావిప్లవ జ్వాలల్లోంచి ఝాన్సీరాణి, నానాసాహెబ్, తాత్యాతోపే, మౌల్వీ, ఇలాంటి వీరశిఖామణు లెందుకు ఉద్భవించి ఉంటారు?

వారి త్యాగం నిరుపమానమైనది. వారి త్యాగం చిరస్మరణీయమైనది. వారు తమ పరాజయ పరాభవాగ్నితో భారత స్వాతంత్ర్య జ్యోతిని వెలిగించారు. ఆ జ్యోతికి ప్రణమిల్లి భక్త్యంజలి ఘటించడం ఈసమయంలో ప్రతిభారతీయుని విధి. ★


తెల్ల వెంట్రుకలుండవు
(GOVT REGD)
రంగులనుచూచి మోసపోవద్దు, అది తాత్కాలికము మా సువాసన "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది. 60 సం|| ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును, ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు జ్ఞాపకశక్తి కంటిచూపును వృద్ధిచేయును, కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు 5-0-0. 3 సీసాలు రు,12-0-0, సగము నెరసివుంటే ఒక సీసా రు. 6-0-0. 8 సీసాలు రు. 15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/- లు 3 సీసాలు రు. 18/- లు పని చేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి వూచీ.
GENERAL LABORATORIES,
(P. W) P.O. Rajdhanwar (H. Bhag.).

సినిమా

★ బొంబాయి సినిమా లేఖ ★

చలన చిత్రకళగురించి పెద్దలిద్దరు ఈమధ్య ఉత్తర దక్షిణ ధ్రువాలమీద నిలబడి, అంతటి భిన్నాభిప్రాయాలనూ ఉద్ఘోషించారు ఇద్దరూ కేంద్రప్రభుత్వ మంత్రులే ఒకరు కేంద్రసమాచార, ప్రసార మంత్రి డా॥ బి. వి. కేస్కర్ మరొకరు వాణిజ్య పరిశ్రమల మంత్రి శ్రీ మురార్జీ

డా॥ కేస్కర్ కలకత్తాలోమాట్లాడుతూ, చలన చిత్ర నిర్మాతలు బాక్సాఫీస్‌గురించి బెంగపెట్టుకోకూడదన్నారు పూర్తిగా కళామతల్లిగురించే ఆలోచించి, కళారాధన పరమావధిగా ఎంచి చిత్రాలునిర్మించి నిలబడాలని ఆయన నొక్కి చెప్పారు ఇందులో ఫలానావిధంగా "ఆలోచించి, ఎంచి-చిత్రాలు నిర్మించి " అన్నంతవరకూ సలహా క్షేమంగా ఉందిగాని, నిలబడటం సంగతే ఎలాగో ఆయన చెప్పలేదు బాక్సాఫీసుగురించి పట్టించుకోకుండా ఇవాళ ఫిలిము తీసిన ఆసామి, ఆర్థికంగావచ్చేనష్టాన్ని ఎలా భరించాలో, భరించి ఎలా నిలబడాలో డా॥ కేస్కర్ చెప్పలేదు



"మదర్ ఇండియా" చిత్రంలో నర్గీస్

ఇక, శ్రీ మురార్జీ అవుదమూరాన నిలబడి, ఇందుకు భిన్నమైన భావాన్ని ప్రపంచించారు ఇది జరిగింది హిందీ ఫిలింకేంద్రం బొంబాయి నగరంలో మొన్న ఆయన ఢిల్లీ నుండి పనిమీద బొంబాయి వచ్చారు ఊళ్లో ఉన్నది 36 గంటలసేపు పనిలో పని అని, ప్రత్యేకం ఒక చిత్రం ప్రదర్శన ఏర్పాటు చేయించుకు చూసి వెళ్ళారు ఈవిధంగా శ్రీ మురార్జీ ఏరికోరి ముచ్చటపడి వేయించుకున్న చిత్రం గురించి ఒక్కముక్క

"The Greatest Story of Girls, Gangsters, and Getaways' అని ఆ చిత్రనిర్మాతలు ఈ చిత్రం ప్రాశస్త్యాన్ని, ఘనంగా ఎన్నికచేసి కొనియాడుకున్నారు ప్రకటనలో (అనగా "అంగనలూ, దొంగల ముఠాలూ, వారి అద్భుత సాహసకృత్యాలూ, పోలీసులకు టోకరా ఇవ్వడం వాపతుని పుష్కలంగా ఉన్న బ్రహ్మాండమైన కథారాజం అని తాత్పర్యం)

(శ్రీ మురార్జీ 36 గంటల వ్యవధిలో ముచ్చటపడి చూచివెళ్ళిన ఈచిత్రందృష్ట్యా, ఆయన వైఖరిపై వ్యాఖ్య ఇక అనవసరం

* * *


ఇక పోతే కలకత్తాలో కేస్కర్‌గారు కళను, బొంబాయిలో మురార్జీగారు బాక్సాఫీసునీ వెనకేసుకురావడం చూడగా, ఒక వేళ ఇది కేవలం 'స్థలమాహాత్మ్యం' కాదుగదా అని ఉభయకేంద్రాల తరహాలూ వంటబట్టించుకున్నాననుకున్న ఒకాయన ఒక కొత్త భావాన్ని ఉద్ఘాటించాడు

తారాపథాన కొత్త జంట

హఠాత్తుగా ఇపుడు మిన్నంటిన (గిరాకీని బట్టీ, రుసుమునుబట్టీకూడా) కొత్త జంట నర్గీస్, దేవానంద్‌లు

దేవానంద్ ఇపుడు అగ్రశ్రేణి నటులలోని 'అగ్రత్రయ' సభ్యుడు అయ్యాడు మిగతా ఇద్దరూ దిలీప్, రాజ్ కపూర్‌లు

గిరాకీ ఎంత ఉన్నా దేవానంద్ ఏడాదికి ఆరుచిత్రాలకు (దక్షిణాదిన ఎ నాగేశ్వర రావులా) మించి అంగీకరించడు ఈ ఆరింటిలోనూ, ఒకటి అతనే నిర్మించేది ఈ గరిష్ఠ పరిమితి పద్ధతివల్ల దేవానంద్ ఇపుడు నెలకి హీనపక్షం ఆరుగురు నిర్మాతలకైనా "నన్ను మన్నించండి అని విన్నవించుకుంటూ కాంట్రాక్టులు తిరస్కరిస్తూన్నాడు అంగీకరించే ప్రతి చిత్రానికీ రూపొందించిన కథా కమామీషూ, అందులో పాత్రల తరహాల్నూ,



విక్రంవారి "కుటుంబగౌరవం" లో సావిత్రి, బేబిఉమ, దొరస్వామి

కను నిర్వహించే భూమిక జవసత్వాలూ, నటనకుగల అవధులు, సబబూ కానిబబూ మొదలైనవన్నీ కూలంకషంగా పరిశీలించి, ఏది బాగుండదని తోచినా వద్దు పొమ్మంటున్నాడు ఈమధ్య వారం పది రోజులు తర్జనభర్జనలు జరిపి చివరకు ఒక్క చిత్రానికి అంగీకరించి కంట్రాక్టుమీద సంతకంపెట్టాడు

నర్గీస్ కూడా ఇదే విధంగా పకడ్బందీ పద్ధతులలో కుడి ఎడమలు చూచుకుంటూ చిత్రాలు అంగీకరిస్తోంది చివరకు ఆమెకు నచ్చిన చిత్రమే ఇతడికీ నచ్చింది అందులో ఇద్దరూ నాయకీ నాయకులు అయ్యారు

ఫిలింస్తాన్‌లో అగ్రస్థానాలు

అగ్రశ్రేణి చలనచిత్ర నిర్మాణసంస్థ ఫిలింస్తాన్, "ఆస్థానకళాకారులు" గా ఉంటూ వచ్చిన పెద్ద నటీనటులూ దర్శకులూ ఒక్కొక్కరే తప్పుకున్నారు సేఠ్ తులారాం జలాన్ సారథ్యాన సాగే యీ సంస్థలో ఇప్పుడు, ఆస్థాన నాయకి, అమిత ("అభిమాన్") నాటి నటీనటులకూ, తోటి కళాకారులకూ కూడా ఈమె పట్ల గౌరవాభిమానాలకన్న భయభక్తులు ఎక్కువగా ఏర్పడ్డాయి ఇక నిన్న మొన్నటి వరకూ ఇక్కడున్నవారిలో చెప్పుకోతగ్గ పేరుప్రతిభలున్న దర్శకుడు మహేష్ ("అభిమాన్") కౌల్ ఒకడే నిన్న మొన్నటినుండి ఆయనా ఇక్కడలేడు నటుడు శేఖర్ ("అభిమాన్"లో నాయకుడు) స్వయంగా నిర్మిస్తున్న "ఆఖరీదావ్" చిత్రానికి మహేష్‌కౌల్ దర్శకత్వం నిర్వహింప అంగీకరించాడు సంగీత దర్శకుడు హేమంతకుమార్ కూడా ఫిలింస్తాన్ దగ్గర సెలవు తీసుకున్నాడు వర్తమాన సంవత్సరంలో, ఫిలింస్తాన్ అధిపతి శ్రీ జలాన్ 36 చిత్రాలు (12 మరాఠీ, 8 గుజరాతీ, 4 పంజాబీ, 12 హిందీ) నిర్మించ నిశ్చయించడం పాఠకులకు విదితమే ఈ పన్నెండు నెలల కథ ఎలా సాగుతుందో వెండి తెర చెబుతుంది

'ప్రభాత్'లో నవప్రభాతం

పూనాలోని ప్రభాత్ స్టుడియోలో చిత్ర నిర్మాణసంరంభం ఒక్కసారి పుంజుకుంది వి మైత్రా "గేవా కలర్"లో, భారీ ఎత్తున "ఫగుణ్" చిత్ర నిర్మాణం సాగిస్తున్నాడు వైజయంతిమాల, భరత్ భూషణ్ ముఖ్య పాత్రలు ధరిస్తున్నారు

సంగీత దర్శకుడు ఓ పి నయ్యార్

మరిద్దరు బొంబాయి నిర్మాతలు కూడా ఇక్కడే చిత్ర నిర్మాణం ఆరంభించారు

పునః 'పునహా'

కాలంనాడు, చలనచిత్ర పరిశ్రమ పుట్టకల్లో, పునహా నగరం రాజధానిగా రాజిల్లింది అక్కడి స్టుడియోలు నిత్యం సంరంభంతో నిండివుండేవి కొంతకాలం క్రితం బొంబాయి పుంజుకుంది అప్పుడు పునహాలో వ్యాపారం ప్రాణావశిష్టమై గింజుకుంది దరిమిలా ఆ ప్రాణంకూడా వదిలేసినట్టే అయింది అప్పుడు 'ఘూంమని' వెలిగిన ప్రభాత్ స్టుడియోకూడా ముందర వెనకబడి, ఆనక మూలబడింది దుకాణం మూసేదాకా కథ సాగేవరకు, కేల్కర్ అనే ఆయన రెండు మూడేళ్ళనాడు, ఆ స్టుడియోని కొన్నాడు అప్పైన చాలా ఖర్చుపెట్టి దానికి

బొంబాయి సినిమా లేఖ

మరమ్మతులు చేయించి, హంగుగా రంగులా తయారు చేశాడు. బయటి నిర్మాతలు వచ్చే వరకు కాచుకుంటూ, తనే రెండు చిత్రాలు (ఒకటి హిందీ, మరొకటి మరాఠీ) ఆరంభించాడు. పైన చెప్పిన మూడు, ఈ రెండూ కాకుండా, ఒక తమిళ చిత్రం కూడా ఇక్కడే తయారవుతోంది. ఈవిధంగా అస్తమించబోయిన ప్రభాత్ స్టుడియోలో ఈ నవ ప్రభాతం, ఫిలిం ప్రపంచంలో వెనకబడ్డ పూనా నగరమే తిరిగి పురోగమించడానికి దోహదకారి కాగల సూచన లున్నాయి. ఈ స్టూడియో నిలదొక్కుకుంటే, మిగతా రెండూ కూడా ముస్తాబై ముందుకు రావడం అచిరకాలంలోనే జరుగుతుంది.

* * *

బొంబాయి నటులు చాలమంది స్వయంగా చిత్ర నిర్మాణాలకు పూనుకొంటున్నారు. నిర్మాతగా నిలదొక్కుకున్న రాజ్ కపూర్ మాత్రం, హఠాత్తుగా చిత్ర నిర్మాణ కార్యక్రమం ప్రస్తుతానికి విరమించుకున్నట్టు కనబడుతుంది. "అబ్ దిల్లీ దూర్ నహీఁ" తరువాతి చిత్రాలకు సన్నాహాలే జరుగుతున్నట్టు కనబడదు. రాజ్ కపూర్ ఇప్పుడు నాలుగు చిత్రాలలో (ఇతరులు నిర్మిస్తున్నవి) నటిస్తున్నాడు. 1 త్రివేదీ తీస్తున్న "రిపోర్టర్" 2 శర్మా ఫిలింస్ వారి "మైనాక్షీ మెహబూబ్" 3 ప్రసాద్ ప్రొడక్షన్ వారి "షార్దా" (శారద) 4 మహీపత్ షా నిర్మించే కొత్త చిత్రం.

నసీర్, నసీబ్

దిలీప్ కుమార్, ప్రత్యక్షంగా కాకపోయినా, లోపాయికారీగా చిత్రనిర్మాణంలో దిగుతున్నాడు. అతని తమ్ముడు నసీర్ ఖాన్‌కు ఈమధ్య 'నసీబ్' అంత అఖండంగా లేనిందువల్ల దిలీప్ ఇందుకు పూనుకున్నాడు. ఈ చిత్రంలో దిలీప్ కూడా పాల్గొంటాడు.

దర్శకుడు నితిన్ బోస్.

నిర్మాతలుగా నిలబడిన నటులలో దేవానంద్, రాజ్ కపూర్‌లు ప్రముఖులు. ఇప్పుడు అశోక్ కుమార్ "రాగిణి" అనే చిత్రం నిర్మిస్తున్నాడు. అతని తమ్ముడు కిశోర్ కుమార్ "చల్తీ కా నాం గాడీ" తీస్తున్నాడు. అప్పైన ప్రదీప్ కుమార్, "దీప్ అండ్ ప్రదీప్ ప్రొడక్షన్స్"లో భాగస్వామి. ఓం ప్రకాశ్ మొన్ననే "గేట్ వే ఆఫ్ ఇండియా" చిత్రంలో బాక్సాఫీస్ విజయం సాధించాడు. భరత్ భూషణ్ తన సోదరుడి సంస్థ, విశ్వభారతీ సినీటోన్ పేరిట "ఉమర్ ఖయ్యాం" నిర్మిస్తున్నాడు. ముఖ్య భూమిక అతడే నిర్వహిస్తాడు. మీనాకుమారి, ఆమె భర్త కమల్ అమ్రోహీ కలసి "పకీజా" చిత్రం నిర్మిస్తున్నారు.

ఇక, ప్రఖ్యాత నటుడు దర్శక నిర్మాత స్టుడియో అధిపతీ అయిన సొహ్రాబ్ మోడీ (మినర్వా మువీటోన్) స్వంత చిత్రం "నౌషెర్వాన్ ఎ అదిల్" త్వరలోనే విడుదల కాబోతోంది. అలాగే అగ్రశ్రేణి నటుడు పృథ్వీరాజ్ కపూర్, ప్రసిద్ధ నాటకం 'పైసా'ను వలవ చిత్రంగా నిర్మించాడు.

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)

★



"పవన్ పుత్ర హనుమాన్" చిత్రంలో అనితాగుహ

1957 పూర్వార్ధంలో...

ఈ సంవత్సరం పూర్వార్ధంలో (జనవరి నుండి జూన్ నెలాఖరువరకు) దేశం మొత్తం మీద సెన్సారు అయిన భారతీయ చిత్రాలు 158. గత సంవత్సరం మొత్తంమీద విడుదల అయినవి 296. ఈ దృష్ట్యా ఈ ఏడాది తొలిభాగంలో చిత్రపరిశ్రమ గత సంవత్సరంకన్న మెరుగనే అనుకోవచ్చు.

భాషలవారీగా చిత్రాలసంఖ్య: హిందీ 64, బెంగాలీ 28, తమిళం 26, తెలుగు 19, మరాఠీ 7, కన్నడ 7, మలయాళం 3, అస్సాం, ఒరియా ఒకొక్కటి.

★



నాగేశ్వరరావు వజ్రోత్సవానికి అధ్యక్షత వహింపవచ్చిన ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డికి తెలుగు తమిళ చలనచిత్ర నటీనటులు పలువురు విమానాశ్రయంలో స్వాగతమిచ్చారు శ్రీయుతులు నాగేశ్వరరావు, సంజీవరెడ్డి, నాగయ్య, శ్రీమతి సావిత్రి

★ సినిమా వార్తలు ★

కళ్యాణీ పిక్చర్స్ వారి తొలి కానుక "అక్కా చెల్లెళ్ళు" ఆగస్టు 9న విడుదల అయింది శ్రీ రంజని, కృష్ణకుమారి, సూర్యకాంతం, లక్ష్మీకాంత, అమర్‌నాథ్, రమణారెడ్డి వంగర మొదలగువారు ఇందులో నటించారు యువదర్శకులు సార్వభౌమ అమానుల్లాలు రూపొందించిన ఈ చిత్రానికి, మాటలూ పాటలూ ఆరుద్ర శ్రీ శ్రీ వ్రాశారు కథ అనంత్ సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు

* * *

త్వరలో (వినాయక చవితినాటికి) విడుదల కానున్న చిత్రం అశ్వరాజ్ ఎక్చర్స్ వారి పౌరాణికం "వినాయకచవితి"

ప్రసిద్ధ రచయిత శ్రీ సముద్రాల రాఘవాచార్య తొలిసారిగా దర్శకత్వం నిర్వహించిన చిత్రం ఇది

ఎన్ టి రామారావు, గుమ్మడి, రాజనాల, ఆర్ నాగేశ్వరరావు, ఎ ప్రకాశరావు, జె ఎన్ స్వామి బొడ్డపాటి కృష్ణారావు, జమున, కృష్ణకుమారి, సూర్యకళ సత్యాదేవి మొదలగువారు పాల్గొన్నారు సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు ఛాయాగ్రహణం పి నాగేశ్వరరావు నిర్మాత కె గోపాలరావు

* * *

ప్రధాని పర్యటనపై డాక్యుమెంటరీ

"స్వరాజ్యం నా జన్మహక్కు" అన్నాడు స్వరాజ్య మంత్ర ప్రదాత తిలక్, నలభైఏళ్ళనాడు

"మీ భవిష్యత్తును మీరే స్వతంత్రంగా నిర్ణయించుకొని, మీకు నచ్చిన పద్ధతిలో నడుచుకోవాలి అది మీ హక్కు" అంటున్నారు ప్రధాని నెహ్రూ ఈనాడు ఏ దేశం వెళ్ళినా ఆనాటి తిలక్ మంత్రం ప్రభావం ఎంతటిదో, ఈనాడు అది వేల నాలుగు చెరగులా ఎలా విస్తరించిందో నెహ్రూ ప్రబోధాలను వింటే బోధపడుతుంది

ఆగస్టు 8న, అనుమానీయుడి కథను, ఈ మహానాయకుడి యూరప్ యాత్రా విశేషాలను వెండితెరమీద చూచే అవకాశం కలిగించింది భారత ప్రభుత్వ ఫిలింస్ డివిజన్ వారు ఇటీవల తిలక్ జయంతిని పురస్కరించుకొని ఆయన రచనలు, ఆయన నడిపిన పత్రికలూ, చేసిన ప్రబోధాలూ ఆధారంగా తిలక్ కథను సంగ్రహంగానే అయినా రసవంతంగా సెల్యులాయిడ్ మీద పొందుపరచారు

కాగా, ప్రధాని నెహ్రూ ఇటీవల సాగించిన స్కాండినేవియన్ దేశాల యాత్రను, వార్తాచిత్రంగా తీశారు ఇందులో కొన్ని భాగాలు ఇతఃపూర్వమే విడుదల అయినా, ఇపుడు మొత్తం పర్యటను ఒకే చిత్రంతో పొందుపరచారు

ఇక్కడి మిడ్‌లాండ్ థియేటర్‌లో



'ఆంధ్ర విశ్వవిద్యాలయానికి నాగేశ్వరరావు ఎంత సన్నిహితుడో అందుకొని అభినందిస్తున్న' ఉపాధ్యక్షుడు డా॥ వి. ఎస్. కృష్ణ.

సినిమా వార్తలు

ఆగస్టు 8 ఉదయాన జరిగిన ఈ ప్రదర్శనకు గవర్నరు శ్రీ ఎ జె జాన్, ముఖ్యమంత్రి శ్రీ కె కామరాజ్ ప్రభృతులు వచ్చారు

ఫిలింస్ డివిజన్ ప్రాంతీయాధికారి శ్రీ వశేషశన్, నెహ్రూ పర్యటనను చిత్రించిన ఛాయాగ్రాహకుడు శ్రీ ఎస్ ఎ రావు స్వాగతం చెప్పారు

సిరియా, నార్వే స్వీడన్ డెన్మార్క్, ఫిన్‌లాండ్, నెదర్లాండ్స (హాలెండ్) దేశాలలో ప్రధాని నెహ్రూ పర్యటన యావత్తూ అత్యంత ఉత్సాహ భరితంగా సాగింది ప్రజలు ఘన స్వాగతం ఇచ్చారు నెహ్రూను శాంతి దూత అని కొనియాడారు ప్రతిచోటా విందులు వినోదాలూ ఏర్పాటయ్యాయి పిల్లలతో నెహ్రూ ఆడుకున్నారు ఒకటి రెండు సందర్భాలలో, ఆయా దేశాల పెద్దలు కూడా, పిల్లలకు మల్లె నెహ్రూతో కలసి వనవిహారాలు చేశారు

ఇలాంటి మనోహర దృశ్యాలూ, నార్వేలో "మేపోల్ నృత్యం" వంటి మరపురాని సన్నివేశాలనూ కూడా, ఛాయాగ్రాహకుడు శ్రీ ఎస్ ఎ రావు ప్రశంసనీయమైన రీతిన చిత్రించారు 'ఔట్‌డోర్' దృశ్యాల చిత్రణలో ఫిలింస్ డివిజన్ ఛాయాగ్రాహకుల నైపుణికి ఇదొక మంచి నిదర్శనం

* * *

జెమినీ చిత్రాలు

జెమినీవారి కొత్త హిందీ చిత్రం "రాజ్ తిలక్" అక్టోబరు నెలలో విడుదల అవుతుంది శ్రీ ఎస్. ఎస్. వాసన్ దర్శకత్వాన తయారవుతున్న ఈ చిత్రంలో వైజయంతిమాల, పద్మిని, జెమినీ-ఆర్. గణేష్, జాగీర్దార్, ప్రాణ్, లలితాపావర్, కుమార్, మాస్టర్ రోమి మనోహన్‌కృష్ణ, ఆగా మమ్తా మీనాక్షి, జగ్‌దీప్ మొదలగువారు నటిస్తున్నారు. సంగీత దర్శకుడు సి రామచంద్ర పాటలు పంతోషి ఇదిగాక కుటుంబగాథ ఆధారంగా జెమినీవారు మరో చిత్రం నిర్మిస్తున్నారు

మాడర్న్ థియేటర్స్‌వారు వి ఎస్ జోహార్ దర్శకత్వాన నిర్మిస్తున్న హిందీ చిత్రం "కిస్మత్ బదల్ గయా ఇన్సాన్" తమిళనటుడు శివాజీగణేశన్, తాతినేని ప్రకాశరావు దర్శకత్వాన నిర్మిస్తున్న "అమర దీపం" హిందీ చిత్రాన్ని కూడా జెమినీ వారే విడుదల చేస్తారు

"అమర దీపం" నిర్మాణం ఇక్కడే సాగుతోంది ఇందులో దేవానంద్, వైజయంతిమాల, పద్మిని జానీవాకర్, ప్రాణ్, రాగిణి, ముక్రీ ప్రభృతులు నటిస్తున్నారు

రచన రాజేంద్రకృష్ణ, సంగీత దర్శకత్వం సి రామచంద్ర

"కిస్మత్ బదల్ గయా ఇన్సాన్"కు రచయిత, దర్శకుడు జోహార్ ఒక ప్రముఖ పాత్ర కూడా నిర్వహిస్తున్నాడు ఇందులో నాయికా నాయకులు నళినీజయవంత్, అజిత్

సంగీత దర్శకుడు హేమంతకుమార్ ★



"ఆంధ్రులూ, తమిళులూ అంతా సోదరులే విరాళాలు ఏ సంస్థకు ఇచ్చారన్నది ముఖ్యంగాదు ఏదో ఒక సంస్థకు ఇవ్వడమే సత్కార్యం" అన్నారు మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ కె కామరాజ్ నాగేశ్వరరావు షష్ట్యబ్దపూర్తి సభలో ఆయన ప్రక్కనున్నవారు శ్రీ సంజీవరెడ్డి, ఆ వెనుక శ్రీ నాగేశ్వరరావు



ఓటుకోసం సాగే వేటలో ఆటపాటలతో జనాన్ని ఆకర్షించడం ఒక ఎత్తు అనుపమావారి "ఎం ఎల్ ఏ" చిత్రంలో అందుకు ఉపక్రమిస్తున్న బృందం వల్లం నరసింహారావు, సావిత్రి, రామకోటి

అదీ - ఇదీ

"చలన చిత్రాలు రెండు విధాలు" అన్నారు కేంద్ర మంత్రి డా॥ బి. వి. కేస్కర్. ఒకటి హాలీవుడ్ ధోరణి. ఇది రంగులూ హంగులూ, ఆర్భాటాల ద్వారా, 'గ్లామర్' ప్రభావం ద్వారా అధిక సంఖ్యాకులను ఆకర్షించి సమ్మోహితుల్ని చేసేది. రెండవది యూరప్ దేశాల పద్ధతి. ఇక్కడి వారు కథకీ, కళకీ, వాటికిగల ప్రయోజనానికీ ప్రాధాన్యత నిస్తారు. వాటిని గౌరవించి చిత్రాలు తీస్తారు.

మనదేశంలో నిర్మాతలకు మొదటి విధానం మీద వేగురి ఉన్నట్టు కనబడుతుంది అని చెప్పారు డా॥ కేస్కర్. ఇటీవల కలకత్తాలో ఒకచోట మాట్లాడుతూ జనానికి ఏది నచ్చుతుంది, అన్న విషయం మీద చలనచిత్రకారులకు ఏవో కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయనీ, అవి అసంగతమైనవనీ, తప్పు అనీ ఋజువు చేయడానికి పథేర్ పాంచాలీ, కాబూలీవాలా వంటి చిత్రాలు సంపాదించుకున్న ప్రజాదరణే నిదర్శనమనీ ఆయన అన్నారు. ఈ చిత్రాలు శాస్త్రాల సూత్రాల ప్రకారం తయారు కాలేదు. ఈ దృష్ట్యా దేశంలోని నిర్మాతలంతా తమ తమ సిద్ధాంతాలకు స్వస్తిచెప్పి ఈ తమ్రశేసి చిత్రాలు నిర్మించాలని ఆయన హితవు చెప్పారు. ఈ విషయంలో దేశం మొత్తం మీద బెంగాల్‌దే అగ్రస్థానం అని కూడా ఆయన అన్నారు. ఈ సందర్భంలో నేటి నాటక రంగం (దు)స్థితిని ప్రస్తావిస్తూ ఒకనాడు బెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్ర దేశాలలో ఉజ్వలంగా వెలిగిన నాటక కళ ఈనాటి కిలా సినిమాల మూలంగా మూలబడడం చాల విచారకరమైన విషయమనీ, జాతి సంస్కృతి వికాసానికి అత్యవసరమైన ఈ నాటక రంగాన్ని పునరుజ్జీవం చేయాలనీ ఆయన నొక్కి చెప్పారు.

చలనచిత్రకళ గురించి డా॥ కేస్కర్ వెలిబుచ్చిన అభిప్రాయాలు అవశ్యం పాటించతగ్గవే.

అయినా, నేలమీద నిలబడి ఆలోచించి చూస్తే మన ఈ పరిస్థితులలో అవి ఎంతవరకు ఆచరణసాధ్యాలన్న ప్రశ్నకు జవాబు ఏమంత బాగుండలేదని వ్యాపారధక్షులు అంటున్నారు.

ఒక పథేర్ పాంచాలీ, ఒక కాబూలీవాలా బెంగాల్‌లోనూ ఆపైన కళాప్రియులు హాజరయే అంతర్జాతీయ ఉత్సవాలలోనూ భేష్ అనిపించుకోవడం, ఆర్థిక సూత్రాలను ఋజువు చేయగలదా అంటున్నారు. బెంగాల్‌ను మినహాయించి మిగతా రాష్ట్రాలలో చిత్రాల జయాపజయాలను పరిశీలిస్తే హాలీవుడ్ అడుగుజాడలే అవశ్యం అనుసరణీయాలని తేలుతున్నదని వీరు అంటున్నారు. కేవలం కళారాధనచేస్తే బొత్తిగా డబ్బులు రాలవని వాదిస్తున్నారు.

ఐతే, కేవలం "ధనారాధనే" అని గట్టిగా చెప్పుకుంటూ నానాఆర్భాటంచేసి, బ్రహ్మాండంగా నిర్మించిన చిత్రాలు ఎన్ని పరాభవంపొంది తిరోగమిస్తున్నాయి!

ప్రచారం ప్రభావం

హాలీవుడ్ నిర్మాత మైకెల్ టాడ్ తన చిత్రం "అరౌండ్ ది వరల్డ్ ఇన్ 80 డేస్" (80 రోజులలో భూ ప్రదక్షిణం) ను లండన్‌లో విడుదల చేసినప్పుడు "ప్రచారం తడాఖా"కు హాలీవుడ్ అర్థనిర్వచనం ఏమిటో తెలిసేలా చేశాడట. అతగాడి ప్రచారం ధాటీకి, ఆ వింత పద్ధతులకూ బ్రిటిష్ నిర్మాతలు విస్తుపోయారట. ఇంత 'దారుణంగా', 'ఏనోటవిన్నా ఇదేమాట" అన్న మాట "నోనోటా" వినబడేలా ప్రచారం చేయడం

అదీ - ఇదీ

వల్ల ప్రయోజనం ఏమాత్రమో తేల్చుకోవాలని అక్కడివారు ఒక ప్రత్యేక సంఘాన్ని కూడా వేశారట.

ఆర్భాటంలో తీరుతెన్నులూ, వాటి మంచిచెడ్డలూ ఎలావున్నా, మొత్తంమీద, ఏదైనా ఒకసరుకు అమ్మజూపినపుడు దాని గొప్పతనంగురించి రెండుముక్కలు గట్టిగా చెప్పడం వ్యాపారదక్షుడి లక్షణం పోతే సినిమావంటి విషయాలలో అడుగడుగునా కొత్తదనం ఉట్టిపడాలి కంటికి నదరుగా, పలుగురినోటా పదేమాటలతో దానికి ప్రచారం జరగాలి కేవలం తగినంత ప్రచారం జరగని కారణంగా దెబ్బతిన్న మంచి చిత్రాలున్నాయి

దొరలసంగతి ఎలావున్నా మన దేశంలో-ముఖ్యంగా దక్షిణాదిన ప్రచారం ప్రభావం గట్టిగా గుర్తించడం జరిగినట్టు కనబడదు వైవిధ్యంకోసం కృషి జరుగుతున్నట్టు తోచదు నిన్నటి పద్ధతికి భిన్నమైనది ఇవాళ అనుసరించాలన్న ఉత్సాహం ఏమంత పొంగి పొరలుతోందనిపించదు తెలుగునాట కొన్ని సంస్థలు మటుకు చెప్పుకోతగ్గ శ్రద్ధ వహిస్తున్నాయని చెప్పుకోవాలి

* * *

ముడిఫిలిం దిగుమతిలో మూడో కంతు కోతపెట్టడం కుదరదని కేంద్ర మంత్రి శ్రీ మురార్జీ స్పష్టంగా చెప్పివేశారు

అనవసరంగా మనవారు పొడుగుచిత్రాలు తీయడానికి అలవాటుపడ్డారనీ, ఇప్పుడా అలవాట్లు మానుకుని పదివేల అడుగులలో చిత్రాలు తీయాలనీ, ఆయన తమవద్దకు రాయబారం వచ్చిన ఫిలిం పరిశ్రమ ప్రతినిధులకు హితవుచెప్పారు దేశీయపరిశ్రమ స్వరూపస్వభావాలు, విదేశీయచిత్రాలకుగల విపణుల తరహాలూ వేరువేరని హఠాత్తుగా చిత్రాల నిడివి తగ్గించడం మన పరిశ్రమకు శ్రేయస్కరం కాదని శ్రీ బిల్లిమోరియా ప్రభృతులు మంత్రికి నచ్చచెప్పచూశారు గాని, ఆయన ఆ వాదానికి సుతరామూ అంగీకరించలేదట నిర్మాణంలో, దుబారా, చిత్రం నిడివి కూడా తగ్గించుకొమ్మని చెప్పారట

నిడివిగురించి శ్రీ మురార్జీ చెప్పినది కఠినంగా కనబడినా అనేకవిధాల అది పరిశ్రమకు మంచిచేయగలదని నిర్మాతలూ దర్శకులూ చాలమంది లోపాయకారీగా అనుకుంటున్నారు మన దేశీయులకు ఉన్న పద్ధతులుమార్చడం, కొత్తపద్ధతులు అనుసరించడం ఓ పట్టాన గిట్టవు అందులోనూ లక్షల ఖర్చుతో కూడిన ఈ తరహా వ్యవహారాలలో తెగించి ఏంచేయడానికీ జంకుతారు కాని, తెగించి చేస్తే ఖచ్చితంగా నెగ్గుకొస్తారు యుద్ధకాలంలో ఫిలింకోటాలు వచ్చి, చిత్రాల నిడివి 11 వేల అడుగులకు పరిమితం అయినపుడు వచ్చినవన్నీ మంచి చిత్రాలే వీటి ఆర్థికవిజయానికి నిడివి ఏవిధంగానూ దెబ్బతియ్యలేదు

నిజానికి ఈనాడు ఈ నిడివే అనేక చిత్రాల విజయానికి ప్రతిబంధకం అవుతోంది తయారవుతున్న చిత్రాల కథలన్నీ పన్నెండు పదమూడువేల అడుగులకు సరిపోయేవే అయినా నిడివి ఉండాలన్న ఊహతో కథలను సాగదీస్తున్నారు అందువల్ల అందులో జనాన్ని ఆకర్షించే శక్తి నీరసించిపోతోంది

ఈ విషయాలు చలనచిత్ర పరిశ్రమలో అందరికీ తెలుసు (ఆమధ్య బొంబాయి ఎగ్జిబిటర్లు, చిత్రాల నిడివి పన్నెండు వేలకు తగరాదని తీర్మానించారు కూడాను) అందరికీ తెలిసినా, ఆచరణలో పెట్టడానికి జంకుతారు అది సహజం పిల్లికి గంటకట్టేదెవరన్న ప్రశ్న ఎదురవుతుంది

అందరూ కలిసి ఒక్కసారే ఒక నిర్ణయం చేసుకుని ఆ మేరకు చిత్రాలు తీస్తే పోటీల బెంగకూ వుండదు

అన్నీ తెలిసిన పెద్దలంతా కలసి ఆలోచించి ఒక నిర్ణయం చేసుకోవడం వాంఛనీయం ★



"జైలర్" చిత్రం ప్రారంభోత్సవానికి వచ్చిన మాలాసిన్హా, డైయసీ ఇరానీలతో సొహ్రాబ్ మోడీసతి సొహ్రాబ్ మోడీ ఇదేపేరుతో ఈ చిత్రాన్ని ఇదివరకొకసారి నిర్మించారు

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd by S Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7 Thambu Chetty Street Madras 1 Editor S. Sambhu Prasad



బాలగంగాధర తిలక్



చెలాకీ అయిన పిల్లవాడు—
వాని నూలు దుస్తులు 'సాన్ఫొరైజ్డ్' లేబిలుగల
బట్టలతో కుట్టినవని వేరే చెప్పాలా!

పిల్లవాని ఆట పాటలలోని చురుకుదనము చూస్తే మీకు ఎంత ఆనందముగా ఉంటుంది! వాని దుస్తులు హాయిగా సరిపోయేలా ఉండుటకు వాటిని 'సాన్ఫొరైజ్డ్' ('Sanforized') లేబిలుగల బట్టలతో కుట్టించండి 'సాన్ఫొరైజ్డ్' ట్రేడు మార్కుగల దుస్తులు క్రుంగిపోయి వాని ఆట పాటలలో ఏమి అడ్డురావు మీరు కొనే ప్రతి గజము నూలుబట్టమీద 'సాన్ఫొరైజ్డ్' లేబిలు ఉన్నదా అని చూడండి 'సాన్ఫొరైజ్డ్ లేబిలు గల దుస్తులు గాలి ఆడేలా మరియు క్రుంగకుండా సరిపోయేలా ఉంటాయి.

ఆరు మూడయినా, మూడు ఆరయినా 'సాన్ఫొరైజ్డ్' ట్రేడు మార్కుగల బట్టలతో కుట్టించిన దుస్తులు చాలనట్లుగా ఎన్నటికీ క్రుంగవు

లేబిలుమీద '**SANFORIZED**' REGD TD MK

ఈ గుర్తు ఉన్నదా అని గమనించండి

అలాచేస్తే మీ దుస్తులు చాలనట్లుగా ఎన్నటికీ క్రుంగవు!

రిజిస్టరు చేయబడిన 'సాన్ఫొరైజ్డ్' ట్రేడు మార్కునకు అధికారులైన క్లూయట్, పీబోడీ అండ్ కంపెనీ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమితమైన బాధ్యతతో యు ఎస్ ఎ లో సంస్థాపితము) వారిచే ప్రచురింపబడినది ఈ కంపెనీయొక్క కచ్చితమైన ప్రమాణములకు తగినట్లు క్రుంగకుండా ఉండే బట్టలమీదనే 'సాన్ఫొరైజ్డ్' ట్రేడు మార్కు వేయుటకు అంగీకారము యిస్తాము

వివరములకు 'సాన్ఫొరైజ్డ్' సర్వీస్, 95, మెరీన్ డ్రైవ్, బొంబాయి 2